ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

బుధవారం 22 జూలై 2026 | సంపుటి: 28 సంచిక: 107
Wednesday 22 July 2026 | Vol.No 28 Issue No .107
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

- సాగు,తాగునీటి సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్,జూలై21 : ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ మిగతా 2లో..



## ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

- ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం
- వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి
- కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి

హన్మకొండ,జూలై 21 : రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి మిగతా 2లో..

హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులు

## వేగవంతం చేయాలి

- ప్రతి నెలా పనుల పురోగతిని స్వయంగా సమీక్షిస్తా..
- అవసరమైతే సైట్‌లోనే బస చేస్తా : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్/వికారాబాద్: వికారాబాద్ జిల్లా హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక నుంచి ప్రతి నెలా పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేస్తానని, అవసరమైతే ఒక రోజు సైట్‌లోనే బస చేసి పనులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఎడ్యుకేషన్ హబ్‌లో నిర్మాణంలో ఉన్న ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ, పారా మెడికల్ కళాశాలలు, హాస్టళ్ల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి మిగతా 2లో..

## దేవాదుల పంపులు ఇక 24 గంటలు పనిచేస్తాయి

- 9 పంపింగ్ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో ప్రారంభం
- ప్రజలకు నీటి భద్రతే ప్రభుత్వ లక్ష్యం... రాజకీయాలు కాదు
- కాళేశ్వరం కాంట్రాక్టర్ల నుంచి బీఆర్‌ఎస్‌కు రూ.1,400 కోట్లు
- కవిత ఆరోపణలకు హరీశ్ రావు సమాధానం చెప్పాలి
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్,జూలై 21 : దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ఈ రాత్రి నుంచే 9 పంపింగ్ యూనిట్లు 24 గంటల పాటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తాయని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో తనను కలిసిన మీడియాతో ఆయన చిట్-చాట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దేవాదుల ప్రాజెక్టుపై మంత్రుల బృందం నిర్వహించిన సమీక్షలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. గోదావరి నుంచి వీలైనంత ఎక్కువ నీటిని ఎత్తిపోసి, దేవాదుల పరిధిలోని 9 జిల్లాలకు చెందిన 22 రిజర్వాయర్లను నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు పంపులను గరిష్ట సామర్థ్యంతో నడపాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో మిగతా 2లో..

ప్రధాని నివాసం ముందు

## కాంగ్రెస్ మెరుపు ధర్నా

- జంతర్‌మంతర్ ఆందోళనకారులపై లాఠీఛార్జ్‌కు నిరసన
- ప్రధాని మోడీ రాజీనామా చేయాలన్న రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ,జూలై21 : భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు.గూండాగిరి, నిరంకుశత్వం వద్దంటూ.. అణచివేత మిగతా 2లో..

## దేశ యువత కోసం రాహుల్ పోరాటం

- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి పోస్ట్



హైదరాబాద్,జూలై 21 : యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జీకి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని మిగతా 2లో..

## జిహెచ్‌ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

- ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు



హైదరాబాద్,జూలై 21 : జీహెచ్‌ఎంసీ ఎన్నికలు వస్తున్నాయనే ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతోందని బిజెపి దుయ్యబట్టింది. 7వేల ఇళ్లకు 10వేల దరఖాస్తులు వస్తాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.10వేల చొప్పున తీసుకుంటే ప్రభుత్వానికి రూ.వెయ్యికోట్ల రాబడి వస్తుందని, క్యూర్ పేరుతో ప్రజలకు మిగతా 2లో..

## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి



మిగతా 2లో..

## ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

- కెకె కమిటీకి నివేదిక అందించిన కవిత



హైదరాబాద్,జులై 21 : ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి టీఆర్‌ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి మంగళవారం ఆమె అందజేశారు. మిగతా 2లో..

## సిజెపి ఆందోళన వెనక కుట్ర కోణం?

- ప్రాణాలకు తెగించి రావాలని సందేశాలు
- ప్రాణత్యాగాలు చేసిన వారిని గుర్తుంచుకుంటాం
- సీక్రెట్ యాప్‌తో పరస్పరం సందేశాలు చేరవేత
- సంసద్ యాత్రపై కూపీ లాగుతున్న పోలీసులు



న్యూఢిల్లీ,జూలై21 : దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం చేపట్టిన చలో సంసద్ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడం ఒక ఎత్తయితే..వారి ఆందోళనల వెనక ఉన్న కుట్ర కోణాలను పోలీసులు కూపీ లాగుతున్నారు. సోమవారం నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో పలువురు నిరసనకారులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం కూడా పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. దీంతో రాజధానిలో హై టెన్షన్ నెలకొంది. మరోవైపు విపక్ష పార్టీలు ప్రధాని మోడీ నివాసం ఎదుట నిరసనకు దిగారు. సర్వత్రా టెన్షన్.. టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది. అయితే తాజాగా పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సీజేపీ నిరసన హింసాత్మకంగా మారడానికి భారీ కుట్ర జరిగినట్లుగా పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయి. సోమవారం ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోయినా పెద్ద ఎత్తున నిరసనకారులు ఎలా రాగలిగారు అన్న దానిపై ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిరసనకారులు పరస్పరం సందేశాలు పంపించుకున్నట్లు మిగతా 2లో..

నలుగురు రైతులు చనిపోయినా

## బాధ్యత లేదా


- వారికి కనీసం రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా
- కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన బిఆర్‌ఎస్ నేత కెటిఆర్
- పార్టీ తరఫున ఒక్కో కుటుంబానికి 5 లక్షల సాయం అందచేత



ఆదిలాబాద్,జూలై21 : ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేడు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేడు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కులేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం మిగతా 2లో..

## ఎపిలో అరబ్ ఎమిరేట్స్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు

సిఎం చంద్రబాబుతో అరబ్ మంత్రి అబ్దుల్లా భేటీ



అమరావతి,జూలై21 : దావోస్ సదస్సులో ఈ ఏడాది కుదుర్చుకున్న మరో కీలక ఒప్పందం సాకారమయ్యే దిశగా ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) ముందుకు వచ్చింది. మంగళవారంరాష్ట్ర సచివాలయంలో మిగతా 2లో..

## కాళేశ్వరంపై ఇన్ని అబద్దాలా?

- నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా
- దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం
- రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్
- మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు




హైదరాబాద్,జులై 21 : కాళేశ్వరం దగ్గర చిల్లర రాజకీయం చేయడంపై సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మరి దేవాదుల దగ్గర నీకు ఏం అడ్డమొచ్చిందని ప్రశ్నించారు. దేవాదుల విషయంలో నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ పార్టీది ద్రోహమే అని మండిపడ్డారు. 2011లో మూడేళ్లు దేవాదులను మూలకు పడేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఎల్‌నినో పేరు చెప్పి మిగతా 2లో..

## రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

- ఎల్‌నినోతో వర్షాభావంపై అధికారులతో చర్చలు
- కార్యాచరణతో ముందుకు సాగాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశం



రంగారెడ్డి,జూలై21 : ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున రైతులను పండ్ల తోటలు, ఆరుతడి పంటల వైపు మళ్లించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. మిగతా 2లో..

## దేశ యువత కోసం రాహుల్ పోరాటం

నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

## ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

అనంతరం ట్యాంక్ బండ సమీపంలోని అమరజ్యోతి వద్ద ఆమె మాట్లాడుతూ.. స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఈ సందర్భంగా ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది.. అది తప్పని నిరూపించాలని ఆ కమిటీ చైర్మన్‌తో ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాటం చేసి బలైన వ్యక్తిని తానని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంత మేలు జరిగితే తన జన్మ ధన్యమైనట్లేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా కె. కేశవరావును నియమించింది.

## ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలంలోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

## రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తీవ్రత ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులను తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, పండ్ల తోటలు, అరుతడి పంటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌నినో బారిన ప్రజలు పడకుండా చూసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగంపైనే ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలని, అవసరమైన చోట నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమం చివరలో వర్షపు నీటి సంరక్షణ కు సంబంధించిన తెలంగాణ జలసిరి పోస్టర్ విడదల చేశారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, కాలే యాదయ్య ఇంకా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివిధ విభగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయాలి

క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే ఆ ప్రాంత అభివృద్ధి ప్రణాళికలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నిర్మాణ పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిపై నెలవారీ నివేదికలు అందించాలని, పనుల్లో జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండొద్దని అధికారులను ఆదేశించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని అవసరమైతే సస్పెండ్ చేయడానికీ వెనుకాడొద్దని ఉన్నతాధికారులకు సూచించారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జరుగుతున్న జాప్యంపైనా సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా లబ్ధిదారులకు ప్లాట్ల పట్టాలు అందజేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు.

## దేవాదుల పంపులు ఇక 24 గంటలు పనిచేస్తాయి

ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయ విమర్శలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. దేవాదుల ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేయడం మానేసి, కాళేశ్వరం ప్రాజెక్టులో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో మొదట రూపొందించిన షీట్ పైల్ ఫౌండేషన్ డిజైన్‌ను ఎందుకు మార్చి సెకెంట్ పైల్ ఫౌండేషన్ అమలు చేశారో హరీశ్ రావు వివరించాలని మంత్రి ప్రశ్నించారు. ఆ నిర్ణయం వల్లే ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి చేరుకుందని అన్నారు. అలాగే, కాళేశ్వరం కాంట్రాక్టర్లు బీఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు చెల్లించారని ఎమ్మెల్సీ కే. కవిత చేసిన ఆరోపణలపై హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. రైతులను తప్పుదోవ పట్టించడం మానేసి, ఆ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులను వేగవంతం చేసి 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ÷-రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తాగునీటి భద్రత కూడా గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## ఎపిలో అరబ్ ఎమిరేట్స్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఆంధ్రప్రదేశ్‌లో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో యుఏఈ ప్రతినిధుల బృందం చర్చించింది. ఈ ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు చేసిన ఆహ్వానానికి స్పందించిన యూఏఈ.. ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆహార శుద్ధి రంగంలో ఏపీలో వాల్యూ చైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. ఈమేరకు ఏపీ ప్రభుత్వం - యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య భాగస్వామ్యం ఏర్పాటైంది. ఈ భాగస్వామ్యంతో మామిడి, అరటి, కోకోతో పాటు వివిధ ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు పంపేలా వాల్యూ చైన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో యూఏఈ ప్రతినిధుల బృందంతో పాటు మంత్రి టీజీ భరత్, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, ఆంధప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి(ఇఆః) ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

ప్రభుత్వం పెయిన్ తెస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాంపల్లిలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యూర్‌లో శాస్త్రీయ బద్ధమైన పన్నుల విధానం లేదు. ట్యాక్స్ దోపిడీతో ప్రజలపై భారం పడుతుంది. ఈ చట్టాన్ని రెసిడెన్షియల్ అసోసియేషన్లు వ్యతిరేకిస్తున్నాయి. ఇది సరైన చట్టం కాదు. ఎవరితోనూ చర్చించకుండా దీన్ని అమలు చేస్తున్నారు. ఉాజీవ్ స్వగృహ పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వాలి. క్యూర్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే చట్టాన్ని అమలు చేయాలన్నారు. రూ.వెయ్యి కోట్ల కోసం పేదల నుంచి రూ.10వేలు తీసుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు.

## ప్రధాని నివాసం ముందు
# కాంగ్రెస్ మెరుపు ధర్నా

చర్యలు నడవవంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ధర్నా సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నిన్న యువతపై లాఠీచార్జ్‌కు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చకు అంగీకరించలేదని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మౌనం వీడాలని, నీట్ అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ మార్చ్ సందర్భంగా ఢిల్లీ పోలీసులు విద్యార్థులు, నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. విద్యార్థులపై అణచివేతకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు కాంగ్రెస్ నాయకులు లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో పవన్ ఖేరా, పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షులు అమరీందర్ సింగ్ రాజా వారింగ్, దీపేందర్ హూడా, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. విద్యార్థుల్ని బీజేపీ ప్రభుత్వం క్రూరంగా హింసించిందని, కానీ బాధ్యత వహించడానికి, పార్లమెంట్‌లో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ నేతల ధర్నాతో ఒక్కసారిగా ఢిల్లీలో హైడ్రామా చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ కాంగ్రెస్ ధర్నా చేస్తున్న ప్రదేశానికి చేరుకుని రాహుల్ గాంధీతో చర్చిస్తున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయాలని రాహుల్ గాంధీకి నచ్చచెప్పేలా ప్రయత్నిస్తున్నారు. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో చర్చించారు. మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులు రాజీనామా చేయాలంటూ నినాదాలు చేస్తున్నారు.

## సిజెపి ఆందోళన వెనక కుట్ర కోణం?

కొన్ని చాట్ సందేశాలు వెలుగులోకి వచ్చాయి. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయినా పరస్పరం సంప్రదింపులు కొనసాగించేందుకు బ్లూటూత్ ఆధారిత 'సీక్రెట్ యాప్' వినియోగించినట్లుగా తేటతెల్లమైంది. అంతేకాకుండా కొంతమంది ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని సందేశాలు పంపించుకున్నారు. ప్రస్తుతం ఈ సందేశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చాట్‌ల వెనుక ఉన్న రహస్యం, వాటిని పంపిన వ్యక్తుల గుర్తింపును ధృవీకరించే పక్రియ కొనసాగుతోంది. అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా బయటకు వచ్చిన చాట్‌లలో.. నిరసన ప్రాంతానికి చేరుకున్న తర్వాత మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవచ్చని హెచ్చరికలు ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా పోలీసులు నెట్‌వర్క్ జామర్లు ఉపయోగించారని, ఈసారి కూడా అదే జరిగే అవకాశం ఉందని పేర్కొంటూ ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ మార్గాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఒక సందేశంలో.. 'నిరసన ప్రాంతానికి వెళ్లాక ఫోన్ నెట్‌వర్క్ ఉండకపోవచ్చు. అందుకే ముందుగానే అందరూ ఒకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని కనెక్ట్ అవ్వాలని సూచించినట్లు పోలీసులు గుర్తించారు. బ్లూటూత్ సిగ్నల్ ఆధారంగా పనిచేసే కొన్ని యాప్‌ల లింకులను కూడా అదే గ్రూపులో షేర్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ యాప్‌లపై సైబర్ నిపుణులు సాంకేతిక విశ్లేషణ చేస్తున్నారు. చాట్‌ల్లో తీవ్ర రాజకీయ హెచ్చరికలు కూడా ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఒక సందేశంలో రేపే మోడీ ప్రభుత్వానికి చివరి రోజు అని ఉంది. మరోవైపు కొందరు నిరసనకారులు ఉద్యమం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఒక సందేశంలో.. ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నవారు గుర్తుంచుకోండి.. మీ త్యాగాన్ని భావితరాలు గుర్తుంచుకుంటాయి.' అని ఉండగా.. మరో సందేశంలో 'ఎవరైనా చనిపోతే ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయాలేనా? లేక నిరసనలను హింసాత్మకంగా మార్చేందుకు ముందస్తు వ్యూహంలో భాగమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చాట్ సందేశాలతో పాటు సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ వీడియోలు, మొబైల్ ఫోన్ వీడియోలు, ఇతర డిజిటల్ ఆధారాలను కూడా ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు అధికారులు తెలిపారు. పోలీసుల ప్రకారం.. ప్రతి డిజిటల్ సందేశాన్ని సాంకేతికంగా ధృవీకరించిన తర్వాతే సాక్ష్యంగా పరిగణిస్తామని, దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగానే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

హైదరాబాద్,జూలై21 : బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో ఎన్నో విపత్తులు ఎదుర్కొన్నామని.. ఎన్‌లినోను కూడా ఎదుర్కుంటామన్నారు. అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. సంవృద్ధిగా వర్షాలు పడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆషాఢమాస బోనాలు ఘనంగా జరిగేలా దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్ని ఏర్పాట్లు చేసినా చిన్న చిన్న ఇబ్బందులు జరుగుతుంటాయని.. వాటిని అధిగమించి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర మీద ఉండాలని, సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# బిఎల్‌వోలకు వెంటనే ఫామ్లు అందించాలి

- మరోమారు గడువు పొడిగించడం కుదరదు
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్

హైదరాబాద్,జులై 21 : రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ పొడిగింపు మళ్లీ ఉండదని జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫామ్‌లు త్వరగా బీఎల్‌వోలకు ఇవ్వాలని నగరంలోని ఓటర్లకు సూచించారు. ఫామ్ తీసుకున్న ఓటర్లు ఆగస్టు 3వ తేదీ వరకు గడువు ఉందని చెబుతున్నారని.. కానీ వీటినన్నింటిని డిజిటలైజేషన్ చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సర్ ఫామ్‌లు సాధ్యమైనంత త్వరగా బీఎల్‌వోలకు అందించాలని ప్రజలకు ఆయన వివరించారు. చివరి రోజు వరకు ఆగితే.. డిజిటలైజేషన్ చేసే సమయంలో సర్వర్ డౌన్ అయ్యే అవకాశం ఉందని అన్నారు. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలు ఐదారుసార్లు ఇంటింటికి వెళ్లారని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో 9.59 శాతం మంది ఓటర్లు ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ ఫామ్‌లు నింపారని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 43 శాతం ఎన్యూమరేషన్ ఫామ్‌లు రిసీవ్ చేసుకుని.. వాటి వివరాలను డిజిటలైజ్ చేశామని పేర్కొన్నారు. ఓటరును భయపెట్టి, ఎన్యూమరేషన్ ఫామ్ ఇవ్వకుండా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ హెచ్చరించారు. ఓటు హక్కుకు, సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన వివరించారు. మీ ఓటు హైదరాబాద్‌లో ఉన్నా లేక గ్రామాల్లో ఉన్నా సంక్షేమ పథకాలు ఎక్కడికి పోవని అన్నారు. ఉాఎఖీ పక్రియలో నిర్లక్ష్యంగా వహించిన ఓ ంఇఖీక్షను ఇప్పటికే సస్పెండ్ చేశామని గుర్తు చేశారు. ఇంకొంత మంది బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. బీఎల్‌వోలు ఎలా పని చేస్తున్నారో చెక్ చేయడానికి విజిలెన్స్ అధికారులు ఫీల్డ్‌లో చెక్ చేస్తున్నారని ఆర్వీ కర్ణన్ వివరించారు.

## నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా

దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరపున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చేరకున్న కేటీఆర్ లక్షెట్టిపేట సమీపంలోని అంకతిపల్లిలోని వాసవీ ఫంక్షన్‌హాలుకు చేరుకుని రైతు సదస్సులో పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశు సంవర్థక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

ఎగనామం పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. మాట్లాడితే తిట్లు, ఒట్లు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు. మొన్న రాములోరి మీద కూడా ఒట్టు పెట్టిండు అని తెలిపారు. ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టాలని హితవుపలికారు. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. నీళ్లు రాకున్నా.. కరెంటు లేకున్నా రేవంత్ రెడ్డిదే బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి నేటి వరకు సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీరు కిందకు పోయిందని తెలిపారు. నీళ్లన్నీ ఆంధ్రాకు తరలిపోయాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిందని చెప్పారు. నాలుగు రోజులకు ఒక టీఎంసీ ఎత్తవచ్చని.. 50 రోజులకు 12 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. కానీ కనీసం రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదని విమర్శించారు. ఇది నేరపూరిత నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. నీ ప్రభుత్వానికి ఏం శిక్ష వేయాలో నువ్వే చెప్పు అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఇన్ని నీళ్లు ఉంటే ఎత్తవా అని మండిపడ్డారు. ఇదేనా రైతులపై నీకు ఉన్న చిత్తశుద్ధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న దేవాదులను నిర్వహించే సత్తా మీకు లేదా అని అడిగారు. మీ వైఫల్యం వల్ల వరంగల్ జిల్లా వ్యవసాయ సంక్షోభంలో మునిగిపోయిందని అన్నారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని ఆరోపించారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని.. ప్రతిరోజు పావు టీఎంసీ ఎత్తవచ్చని తెలిపారు. అంటే ఇప్పటికి 12 టీఎంసీలు ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు. మరెందుకు 22 రిజర్వాయర్లు నింపలేదని ప్రశ్నించారు. దేవాదుల నుంచి 105 టీఎంసీలు కిందకు తరలిపోయాయని తెలిపారు. ఈ రోజు కూడా దేవాదులలో 78 మీటర్ల ఎత్తులో నది ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. 73 మీటర్లు ఉంటే చాలు మోటార్లు నడుస్తాయని.. 78 మీటర్లు ఉన్నప్పటికీ మోటార్లు నడిపించడం లేదని చెప్పారు. ఎందుకు నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఏమిటీ నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అతి తక్కువ వర్షపాతం పడిన జిల్లా వరంగల్ జిల్లా అని హరీశ్‌రావు తెలిపారు. రెయిన్‌ఫాల్ తక్కువ ఉంటే సమ్మక్క బ్యారేజీ నుంచి నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎందుకు నీళ్లను కిందకు జారవిడుస్తున్నారని ప్రశ్నించారు. మేం ప్రెస్‌మీట్ పెట్టగానే.. దేవాదులలో రెండు మోటార్లు స్టార్ట్ చేశారని తెలిపారు. మేం ప్రశ్నిస్తే తప్ప నీళ్లు ఎత్తిపోయారా అని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్షంగా రైతుల పక్షాన బాధ్యతాయుత పోరాటం చేస్తున్నామని మండిపడ్డారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు స్టార్ట్ చేసి సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి రైతులు నారుమడులు పోసుకున్నారని తెలిపారు. ఇప్పుడేమో నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ మాత్రం నీళు ఇమ్మని చెబుతున్నాడని అన్నారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని మండిపడ్డారు. ప్రపంచమంతా నీళ్లను కాపాడుకుంటే.. మీరు వృథా చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాకాల ప్రాజెక్టు కింద 29వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి అక్కడి రైతులు నాట్లు వేసుకున్నారని, రామప్ప కింద కూడా నాట్లు వేసుకున్నారని పేర్కొన్నారు. రామప్ప కింద 5500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. నిన్న పాకాల కింద తూములు మూసేశారని పేర్కొన్నారు. నమ్మి నాట్లు వేసుకున్న రైతుల పరిస్థితి ఏంటి అని నిలదీశారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని హరీశ్‌రావు మండిపడ్డారు. రామప్ప కింద తూములు మూసేస్తే రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. నీళ్లు ఎత్తకుండా కలెక్టర్ ఎందుకు తూములు మూసేయమని చెప్పాడని ప్రశ్నించారు. మంత్రులు చెప్పింది తప్పయితే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్రాప్ హాలీడే ప్రకటించి, రైతులకు డబ్బులు ఇవ్వాలన్నారు. పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడతారని హరీశ్‌రావు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి నార్లు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. బిందెలు, సీసాలతో పత్తికి బొట్టు బొట్టు నీళ్లు జల్లుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఉన్న తపన, సోయి రేవంత్ రెడ్డికి లేదా అని మండిపడ్డారు. నీళ్ల కోసం తెలంగాణ రైతులు ఎంతో తపన పడుతున్నారని తెలిపారు. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలు ఎందుకు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నీళ్లు కిందకు విడిచిపెడుతున్నాడని మండిపడ్డారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ఉరుముతున్న యుద్ధమేఘాలు !

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు మళ్లీ కమ్ముకోవడంతో ప్రపంచదేశాలు దిక్కుతోచని స్థితికి చేరాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కూడా మళ్లీ తీవ్రస్థాయికి చేరింది. నియంతల కారణంగా ప్రపంచానికి శాంతి లేకుండా పోతోంది. వాళ్లు,వాళ్లు కొట్టుకు చస్తున్నా ఫర్వాలేదు..ఇందులో మిగతా దేశాలు తల్లడిల్లి పోతున్నాయి. ముఖ్యంగా అమెరికా మళ్లీ ఇరాన్‌పై భీకరదాడులుకు దిగుతోంది. ట్రంప్‌ను అంతమొందిస్తాం అంటూ ఇరాన్‌లో పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. అలాగే ప్రపంచంలోని అమెరికన్లు జాగ్రత్తగా ఉండాలంటూ అమెరికా ప్రజలకు హెచ్చరికలు చేసింది. ఈ క్రమంలో యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చనుందన్న సంకేతాలు వస్తున్నాయి. దీంతో చమురు సమస్యలు మళ్లీ మొదటికి అన్నట్లుగా పరస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్‌ను సర్వనాశనం చేసే వరకు వదలనని ట్రంప్ భీష్మించుకున్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ వెనక్కి తగ్గగా అమెరికానే యుద్ధాన్ని ఎగదోస్తోంది. మరోవైపు అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా



బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హర్మూజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్యత ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తో పాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, వాటిని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదని తెలిపారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ.. దాన్ని ఎక్కువ రోజులు అధీనంలో ఉంచుకోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒక వేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం దాదాపు ఐదు నెలలు కావస్తోంది. అయినా అగ్గి చల్లారడం లేదు. ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ట్రంప్ మళ్లీమళ్లీ దాడులకు తెగిస్తున్నారు. తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండ బోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ గతంలోనే స్పష్టం చేశారు.శాంతి ఒప్పందానికి చిల్లు పెట్టారని, ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి చర్చలు జరగడం లేదు. ఇకపై మంచివాడిగా ఉండను అని గతంలో ట్రంప్ చేసిన హెచ్చరికలు తాజా పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్నితమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచదేశాలు కూడా పెద్దగా స్పందించడం లేదు. ఏ దేశం కూడా ఈ సుదీర్ఘ యుద్ధానికి అడ్డుపడడం లేదు. ఇరాన్ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. అయితే ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాడోపేడో తేల్చుకునేదాకా వదిలేది లేదని హెచ్చరికలు చేస్తోంది. అలాగే అమెరికా స్థావరాలపై భీకర దాడులు చేస్తోంది. ఈక్రమంలో ఈ యుద్ధం ఇప్పట్లో ముస్తుందని అనుకోవడానికి లేదు. ప్రపంచదేశాలు ఏకమైతే తప్ప యుద్ధ పరిస్థితులను అదుపు చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది.

# స్టార్టప్ టూ... స్కైహై...



హైదరాబాద్, జూలై 21 : శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుండి జూలై 18, శనివారం, మధ్యాహ్నం 12:05 ఎంకి విక్రమ్-1 ప్రయోగం ప్రారంభమైంది. 17 నిమిషాల తర్వాత, ఇది తన పేగులకు సంబంధించిన ఉపకరణాలను విజయవంతంగా విడుదల చేసింది. ఈ ఘనతకు 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌లో సంబరాలు గట్టిగా జరిగాయి. ఈ తొలి ప్రయోగం, 'ఆగమన్' అని పిలువబడింది, భారతదేశాన్ని ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యం కలిగిన మూడవ దేశంగా నిలిపింది. అయితే, తెలంగాణకు ఇది ఒక దశాబ్ద కాలం పాటు ఆవిష్కరణ వ్యవస్థను నిర్మించడానికి పెట్టిన పెట్టుబడికి ఫలితం. ఈ ప్రయాణం 2015 నవంబరులో ప్రారంభమైంది, అప్పటి ఐటీ మరియు పరిశ్రమల మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో టీ హబ్ ప్రారంభమైంది, ఇది అప్పటివరకు భారతదేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇన్క్యుబేటర్. ప్రారంభోత్సవంలో, రతన్ టాటా దీనిని 'భారతదేశానికి కొత్త ముఖం' అని పేర్కొన్నారు. ఈ చుట్టూ, రాష్ట్రం విస్తృతమైన నెట్‌వర్క్‌ను నిర్మించింది – ప్రోటోటైపింగ్ కోసం టీ వర్క్స్, మహిళా వ్యాపారులకు, నైపుణ్యాలు, పరిశోధన మరియు అకాడమియా-ఇండస్ట్రీ సంబంధాల కోసం టాస్క్, రిచ్ తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ సెల్. స్కైరూట్ ఎయిరోస్పేస్ ఈ వ్యవస్థలో జన్మించింది. 2018లో, మాజీ ఇస్రో శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన మరియు నాగ భరత్ డాకా స్థాపించిన ఈ కంపెనీ, ౧-ఊబీఎలో ప్రారంభ సంవత్సరాలలో ఇన్క్యుబేట్ చేయబడింది, మెంటార్షిప్, పెట్టుబడిదారుల ప్రాప్తి మరియు వ్యాపార మద్దతు పొందింది. ఇది డ్రాయింగ్‌ల నుండి హార్డ్‌వేర్‌కు మారుతున్నప్పుడు, తన ఇంజనీర్లకు ప్రోటోటైపింగ్ సౌకర్యాలను అందించింది, దీని ద్వారా భాగాలను డిజైన్ చేయడం, పరీక్షించడం మరియు మెరుగుపరచడం జరిగింది. దీని వల్ల సాధించిన ఫలితాలు త్వరగా వచ్చాయి. 2022 నవంబరులో, స్కైరూట్ యొక్క ఉపఆర్బిటల్ విక్రమ్-ూ, ఇస్రో యొక్క సౌకర్యాల నుండి రాకెట్‌ను ప్రయోగించిన తొలి భారతీయ ప్రైవేట్ కంపెనీగా నిలిచింది. టీ హబ్ లో జరిగిన ఒక వేడుకలో, కేటీఆర్ దీనిని భారతదేశం యొక్క అంతరిక్ష సాంకేతిక పరిశ్రమకు 'నిజంగా చరిత్రాత్మక క్షణం' అని పేర్కొన్నాడు. 'ఇది హైదరాబాద్ నుండి మరింత మంచిగా జరగలేదు' అని చెప్పాడు మరియు రాష్ట్రంలో దేశంలోని తొలి సమగ్ర రాకెట్ డిజైన్, తయారీ మరియు పరీక్షా సౌకర్యం కోసం ప్రోత్సహించాడు. 'వారు తమ రాకెట్లను ఇతర ప్రాంతాలకు పంపకూడదు' అని ఆయన అన్నారు. 2025 నవంబరులో, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హైదరాబాద్‌లోని స్కైరూట్ యొక్క ఇన్ఫినిటీ క్యాంపస్‌లో ఫ్లైట్-రెడీ విక్రమ్-1ను ఆవిష్కరించారు. 2026 మే నాటికి, ఈ కంపెనీ భారతదేశంలోనే తొలి స్పేస్ టెక్ యూనికార్న్‌గా మారింది. రెండు నెలల తర్వాత, ఇది ఉపగ్రహాలను ఆకాశంలోకి పంపించింది. విక్రమ్-1, సుమారు 20 మీటర్ల ఎత్తు, 350 కిలోల బరువున్న చిన్న ఉపగ్రహాలను తక్కువ భూమి కక్ష్యలోకి తీసుకెళ్లగలదు – ఇది హైదరాబాద్‌ను ప్రపంచ చిన్న ఉపగ్రహాల మ్యాప్‌లో బలంగా నిలబెట్టింది మరియు నగరానికి కొత్త రకం ప్రొపల్షన్, ఉపగ్రహ మరియు ఎయిరోస్పేస్-మటీరియల్స్ స్టార్టప్‌లను ఆకర్షించింది. భారతదేశానికి, ఇది ప్రైవేట్ స్పేస్‌ఫ్లైట్‌లో ఒక దూకుడు. తెలంగాణకు, ఇది చివరకు ప్రారంభానికి క్లియర్ అయిన దృష్టి.

# నైరుతి రిటర్న్స్...

హైదరాబాద్, జూలై 21, : ఎల్‌నీనో ప్రభావంతో కొన్ని వారాలుగా అడపాదడపా వర్షాలు తప్పా.. వరణుడి కరుణ లేదు. ఉక్కపోతతో కూడిన వాతావరణం.. రైతులలో పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో వాతావరణ శాఖ వర్షాలపై కీలక అప్డేట్ ఇచ్చింది. దేశంలో పలుచోట్ల నైరుతి రుతుపవనాలు యాక్టివ్ అయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది.. రాబోయే రోజుల్లో భారతదేశ నైరుతి రుతుపవనాలు తిరిగి బలం పుంజుకునేందుకు అవకాశం ఉండటంతో.. రాబోయే రోజుల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ.. అంచనా వేసింది. ప్రస్తుతం.. విస్తారంగా వర్షాలు కురవడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని.. ఆదివారం నుంచి వర్షపాతం క్రమంగా పెరిగి, వచ్చే వారం దేశంలోని పలు ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) పేర్కొంది. విడతల వారీగా కురిసే వర్షాలు నేలలో తేమను మెరుగుపరచి, పంట పెరుగుదలకు తోడ్పడి, మైదాన ప్రాంతాలంతటా నిరంతరంగా ఉన్న వేడి నుండి ఉపశమనం కలిగిస్తాయని అంచనా వేసింది.జూలై నెలలో చాలా వరకు రుతుపవనాలు బలహీనపడటానికి బంగాళాఖాతంలో బలమైన వాతావరణ వ్యవస్థలు లేకపోవడమే కారణమని చెప్పవచ్చు. తక్కువ అల్పపీడన వ్యవస్థలు ఏర్పడటంతో, తేమ రవాణా బలహీనపడి, మధ్య ? ద్వీపకల్ప భారతదేశం అంతటా సుదీర్ఘ పొడి వాతావరణం నెలకొంది. అనేక నగరాల్లో తేమ అధికంగా ఉన్నప్పటికీ, మేఘాలు ఏర్పడటం పరిమితంగా ఉండటంతో, చెప్పుకోదగ్గ వర్షపాతం లేక ప్రజలు అసౌకర్యమైన వేడిని తట్టుకోవలసి వచ్చింది. ఈ కాలంలో, వర్షపాతం ప్రధానంగా హిమాలయ ప్రాంతంలోని కొన్ని భాగాలకే పరిమితమైంది. అయితే పెద్ద వ్యవసాయ ప్రాంతాలలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. అందుబాటులో ఉన్న వర్షపాత సమాచారం ప్రకారం, ఈ నెలలో ఇప్పటివరకు భారతదేశంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. అందువల్ల, కాలానుగుణ లోటును పూడ్చడానికి రాబోయే వర్షపాత కాలం అత్యంత కీలకం.ఆదివారం నుంచి పలు ప్రాంతాల్లో వర్షాలు విస్తృతంగా కురిసి, వారం పొడవునా మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.. ఈశాన్య భారతదేశంలోని రాష్ట్రాలలో మొదట వర్షపాతం పెరిగే అవకాశం ఉంది.. ఆ తర్వాత ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లలో వర్షపాతం పెరుగుతుంది. ఈ వాతావరణ వ్యవస్థ భూభాగంలోకి ప్రవేశిస్తున్నందున, మధ్య, వాయువ్య భారతదేశంలోని పలు ప్రాంతాలలో కూడా మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# బొద్దింక జూరింది... ఢిల్లీ జ్వలించింది!



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
జగిత్యాల
9133947176

ఢిల్లీ వీధుల్లో తాజాగా కనిపించిన ఉద్యమం ఒక బొద్దింకను ప్రతీకగా ఎంచుకుని అధికార వ్యవస్థను ప్రశ్నించింది. అది కేవలం వ్యంగ్య ప్రతీక కాదు; వ్యవస్థపై పేరుకుపోయిన యువత ఆవేదనకు రూపం. బొద్దింకను ఎంత తొక్కినా మళ్లీ కనిపించినట్లే, "మా కలలను తొక్కొచ్చు... మా ప్రశ్నలను కాదు" అనే సందేశాన్ని యువత దేశ రాజధానిలో వినిపించింది.

ఈ ఉద్యమానికి కారణం ఒక్క నీట్ ప్రశ్నపత్రం లీక్ మాత్రమే కాదు. పోటీ పరీక్షలపై పెరుగుతున్న అనుమానాలు, నియామకాలలో జాప్యం, నిరుద్యోగ యువతలో పెరిగిన నిరాశ, పరీక్షా వ్యవస్థపై క్షీణించిన విశ్వాసంఈ అసంతృప్తులన్నీ ఒకే వేదికపై వ్యక్తమయ్యాయి. ప్రశ్నపత్రం లీక్ అయితే పరీక్షను మళ్లీ నిర్వహించవచ్చు. కానీ యువతలో కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి తీసుకురావడం అంత సులభం కాదు.

"చలో సంసద్" పిలుపుతో వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, మహిళలు, ఉద్యోగార్థులు పార్లమెంట్ వైపు కదలడం సాధారణ ర్యాలీ కాదు. అది ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రశ్నించే రాజ్యాంగబద్ధమైన నిరసన. అయితే వారి ఎదుట నిలిచింది సంభాషణ కాదు; బారికేడ్లు, లాఠీలు, బాష్పవాయువు. ప్రజలు పార్లమెంట్‌ను చేరకుండా అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ఏమి కాపాడింది? భవనాన్నా? లేక తన ప్రతిష్ఠననా? అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తాయి.

ఈ ఉద్యమంలో పాల్గొన్నవారు కేవలం విద్యార్థులు మాత్రమే కాదు. తల్లిదండ్రులు, మహిళలు, వృద్ధులు కూడా వీధుల్లోకి రావడం, ఇది ఒక్క పరీక్ష సమస్య కాదని, దేశ భవిష్యత్తుపై పెరుగుతున్న సామూహిక ఆందోళన అని స్పష్టం చేసింది. ప్రశ్నపత్రం లీక్ అయితే ఒక సంవత్సరం నష్టం. నమ్మకం లీక్ అయితే ఒక తరం నష్టం.

పరీక్షల నిర్వహణ ప్రభుత్వ బాధ్యత అయితే, వాటిపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటం కూడా అదే బాధ్యత. ప్రతి ఘటన తర్వాత విచారణ కమిటీలు, అరెస్టులు, హామీలు వినిపిస్తున్నాయి. కానీ ప్రజలు ఇప్పుడు అడుగుతున్న ప్రశ్న ఒక్కటేతదుపరి పరీక్ష భద్రంగా ఉంటుందా? దీనికి స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతే ప్రతి పరీక్ష అనుమానాల మధ్యే సాగుతుంది.

ప్రతిపక్షానికీ ఇక్కడ బాధ్యత ఉంది. అధికారాన్ని విమర్శించడం ప్రజాస్వామ్యంలో అవసరమే. కానీ పరీక్షా సంస్కరణలపై ప్రత్యామ్నాయ విధానాన్ని కూడా ప్రజల ముందుంచాలి. వీధిలో నిరసనలకు మద్దతు ఇవ్వడమే కాదు, పార్లమెంట్‌లో శాశ్వత పరిష్కారాల కోసం పట్టుదల చూపాలి. విద్యార్థుల భవిష్యత్తు అధికారానికి ఓటు కాదు; ప్రతిపక్షానికి నినాదం కాదు. అది దేశ సంపద.



ఈ ఉద్యమంలో మరో కీలక అంశం సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష. అహింసా మార్గంలో ప్రభుత్వాన్ని ఆలోచింపజేయాలనే ఆయన ప్రయత్నం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఆయనను బలవంతంగా ఆసుపత్రికి తరలించడం, ఆరోగ్య పరిస్థితిపై న్యాయస్థానం ఆరా తీసిన పరిణామాలు ప్రజాస్వామ్యంలో నిరసన హక్కుపై మరోసారి చర్చను ముందుకు తెచ్చాయి. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకోవచ్చు. కానీ ఒక ఆలోచనను నిర్బంధించడం సాధ్యం కాదు.

ఈ సంఘటన దేశానికి ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది. ప్రశ్నపత్రం లీక్ కావడం కంటే ప్రమాదకరమైనది ప్రజల విశ్వాసం లీక్ కావడం. ఒకసారి ఆ విశ్వాసం కూలిపోతే దాన్ని పునర్నిర్మించడానికి చట్టాలకంటే ఎక్కువగా పారదర్శకత, జవాబుదారీతనం, నిజాయితీ అవసరం.

ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ముందు ఉన్న అసలు సవాలు ఒక మంత్రి రాజీనామా చేయాలా వద్దా అనే రాజకీయ చర్చ కాదు. దేశంలోని ప్రతి పోటీ పరీక్షపై మళ్లీ నమ్మకం ఎలా కల్పించాలన్నదే అసలు పరీక్ష. స్వతంత్ర పరీక్షా పర్యవేక్షణ వ్యవస్థ, అత్యాధునిక డిజిటల్ భద్రత, వేగవంతమైన విచారణ, బాధ్యులపై కఠిన చర్యలు వంటి నిర్మాణాత్మక సంస్కరణలు అమలులోకి రావాల్సిన అవసరం ఉంది.

ప్రతిపక్షం కూడా ప్రతి ప్రజా సమస్యను ఎన్నికల రాజకీయాలకు పరిమితం చేయకుండా, విద్యా సంస్కరణలపై ఏకాభిప్రాయం సాధించేందుకు ముందుకు రావాలి. ప్రజాస్వామ్యం అంటే అధికారాన్ని ఓడించడం కాదు; సమస్యను ఓడించడం.

ఢిల్లీ వీధుల్లో జ్వలించింది కేవలం ఒక నిరసన కాదు. అది అధికారానికి హెచ్చరిక, ప్రతిపక్షానికి గుర్తుచూపు, దేశానికి పాఠం. ఈ పాఠాన్ని చదివి వ్యవస్థను సరిదిద్దితే అది ప్రజాస్వామ్య విజయంగా నిలుస్తుంది. నిర్లక్ష్యం చేస్తే మరో ఉద్యమానికి బీజం పడుతుంది.

చివరికి ఈ ఉద్యమం దేశం ముందుంచిన ప్రశ్న ఒక్కటే "కష్టపడి చదివితే నిజంగానే న్యాయం జరుగుతుందా?"

ఈ ప్రశ్నకు ప్రభుత్వం, ప్రతిపక్షం, న్యాయవ్యవస్థ, విద్యాసంస్థలు కలిసి విశ్వసనీయమైన సమాధానం ఇవ్వగలిగిన రోజే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. చరిత్ర రాసేది అధికారాలు కాదు... ప్రశ్నించే తరాలే.

# నీతి అయోగ్ ర్యాంకింగ్ లో ఏపీ టాప్

న్యూఢిల్లీ, జూలై 21 : నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీ ఇండెక్స్ (ఐఎఫ్ఐ) రాష్ట్రాల పెట్టుబడి వాతావరణాన్ని మరింత విస్తృతంగా అంచనా వేసే కొత్త సాధనం. గతంలో కేంద్రం నిర్వహించిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌తో పోలిస్తే ఇది 84 అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. అనుమతుల వేగం, వ్యాపార వాతావరణం, ఆర్థిక ఆరోగ్యం వంటి అంశాలు ఇందులో కీలకం.పెద్ద రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు 6వ స్థానం దక్కింది. దేశవ్యాప్తంగా మొత్తం 8వ ర్యాంకు వచ్చింది. స్కోరు 48.7 శాతం. తెలంగాణకు 13వ ర్యాంకు, స్కోరు 47.3 శాతం. టాప్ పెర్ఫార్మర్ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చోటు లేదు. ఫ్రంట్ రన్నర్‌లుగా గుర్తించిన రాష్ట్రాల్లో కూడా ఏపీ లేదు. టాప్ ఐదు స్థానాల్లో వరుసగా గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, గోవా, ఒడిశా ఉన్నాయి.దేశవ్యాప్తంగా ప్రతిపాదిత పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్‌కు 25.3 శాతం వాటా ఉందని ప్రభుత్వం పేర్కొంటోంది. ఇది పెద్ద అచీవ్‌మెంట్‌గా చెప్పబడుతోంది. కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే కాన్సెప్ట్‌ను అమలు చేస్తూ పెట్టుబడులకు అనుకూల వాతావరణం సృష్టిస్తున్నట్లు చెబుతోంది. ఇది గతంలో టాప్ ర్యాంకులు సాధించిన ఏపీకి కొత్త గుర్తింపు తెచ్చింది. అయినప్పటికీ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీ ఇండెక్స్‌లో టాప్ స్థానాలు దక్కకపోవడం విశ్లేషకుల్లో చర్చను రేపుతోంది.ఈ ఇండెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ స్కోరు ప్రభావితం కావడానికి ప్రధానంగా ఆర్థిక ఆరోగ్యం సంబంధిత అంశాలు కారణమని విశ్లేషణలు సూచిస్తున్నాయి. అధికారికంగా రూ. 6.36 లక్షల కోట్ల అప్పు ఉండగా, అనధికారిక అప్పులు సుమారు 4 లక్షల కోట్లు ఉన్నాయి. మొత్తం అప్పు భారం రూ. 10 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది. 2019 నుంచి సంక్షేమ కార్యక్రమాలపై భారీగా ఖర్చు పెరగడం వల్ల ఆర్థిక వెసులుబాటు తగ్గింది. దీంతో వారం వారం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఇండెక్స్‌లో ఆర్థిక ఆరోగ్యం సంబంధిత స్కోరును ప్రభావితం చేసింది. బిజినెస్ క్లైమేట్ సబ్?ఇండెక్స్‌లో ఏపీకి 9వ ర్యాంకు వచ్చింది. ఇందులో కూడా పెద్ద




మార్పు లేదు.కొన్నేళ్లలో రాజధాని విషయంలో గందరగోళం, పరిశ్రమల విధానంలో స్థిరత్వం లోపం కూడా ర్యాంకింగ్‌ను ప్రభావితం చేశాయి. 2019కి ముందు ఉన్న కొన్ని పాలసీలు నిలిపివేయడం లేదా మార్చడం వల్ల పెట్టుబడిదారులకు నిరంతరత్వం లోపించింది. గుజరాత్, తెలంగాణ వంటి రాష్ట్రాలు పాలసీల్లో స్థిరత్వం కొనసాగించి మెరుగైన ర్యాంకులు సాధించాయి.విపక్ష వైసీపీ ఈ ర్యాంకును పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. పరిశ్రమలు పారిపోతున్నాయని, ప్రభుత్వం విఫలమైందని వాదిస్తోంది. అయితే ఇది పూర్తి చిత్రం కాదు. ప్రతిపాదిత పెట్టుబడుల్లో ఏపీకి గణనీయమైన వాటా ఉండటం, కొత్త ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దష్టి పెట్టడం వాస్తవాలు. ర్యాంకు తగ్గడం అంటే పెట్టుబడులు రావడం ఆగిపోయిందని అర్థం కాదు.ఆర్థిక క్రమశిక్షణ పెంచడం, అనవసర ఖర్చులు తగ్గించడం, పాలసీల్లో స్థిరత్వం తీసుకురావడం ద్వారా ఏపీ త్వరలోనే టాప్ పెర్ఫార్మర్ రాష్ట్రాల జాబితాలోకి చేరవచ్చు. పెట్టుబడులు ఆకర్షించడంలో ఏపీ ఇప్పటికే ముందుంది. ఇప్పుడు అవసరం ఆ గమనాన్ని ఆర్థిక సుస్థిరతతో మిళితం చేయడం.

## ప్రభుత్వ అనుమతి లేకుండా బీడీల తయారీ

**- వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలన్న యూనియన్**

రాజన్న సిరిసిల్ల,జులై 21 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా బీడీలు తయారు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. యూనియన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొందరు నగదు పేరుతో బీడీల తయారీ చేపట్టి కార్మికులకు తక్కువ కూలి చెల్లిస్తున్నారని ఆరోపించారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి కార్మిక సంక్షేమ సదుపాయాలు కల్పించకుండా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీని కూడా ఎగ్గొడుతున్నారని పేర్కొన్నారు. అక్రమంగా బీడీలు తయారు చేయడం వల్ల కార్మికులు ఉపాధి, సంక్షేమ ప్రయోజనాలు కోల్పోతుండటంతో పాటు, చట్టబద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బీడీ కంపెనీలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. అందువల్ల జిల్లాలో లైసెన్స్ లేకుండా బీడీలు తయారు చేస్తున్న సంస్థలపై, అలాగే ఒక కంపెనీ లైసెన్స్‌తో మరో కంపెనీ పేరుతో బీడీలు తయారు చేస్తున్న వారిపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా కార్యదర్శి సూరం పద్మ, జిల్లా ఉపాధ్యక్షుడు జిందన్ కమలాకర్ పాల్గొన్నారు.

# గ్యాప్ కంటిన్యూస్..




మెదక్,జూలై 21: బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు వర్సెస్ కేటీఆర్ పంచాయితీ నడుస్తుంది అన్న గుసగుసలు, లీకులు కొత్తేమీ కాకపోయినా, తాజాగా రంగనాయక్ సాగర్ వద్ద జరిగిన హరీష్ రావు పాదయాత్ర మరోసారి ఆ ఆరోపణలకు బలం చేకూర్చినట్లైంది.కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టులు నింపాలని, కరువులో రైతన్నలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అన్నపూర్ణ సాగర్ నుండి రంగనాయక సాగర్ వరకు మాజీ మంత్రి హరీష్ రావు పాదయాత్ర చేశారు. హరీష్ రావు పాదయాత్రకు ఏర్పాట్లు కూడా భారీగానే జరిగాయి. భారీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలతో హరీష్ పాదయాత్ర సాగింది. అయితే, వాటిలో ఎక్కడా కేటీఆర్ ఫోటో లేదు. భారీ సైజులో హరీష్ రావు, చిన్నగా కేసీఆర్ ఫోటోతో మాత్రమే కనపడ్డాయి. దీంతో ఎంత సిద్దిపేట కేంద్రంగా పాదయాత్ర చేసినా? పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ ఫోటో వేయటం కనీసం ప్రోటోకాల్. బాధ్యత. కానీ, కేటీఆర్ ఫోటోను ఎందుకు పక్కనపెట్టినట్లు? కావాలనే ఇలా చేశారన్న అభిప్రాయం వినపడుతోంది.నిజానికి తాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా రాష్ట్రంలో పాదయాత్ర చేస్తాను అని ఇప్పటికే కేటీఆర్ ప్రకటించారు. జిమ్ లో జాయిన్ అయ్యి, రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు సన్నద్ధం కూడా అవుతున్నారు. ఆ మధ్య సంగారెడ్డి జిల్లా రైతాంగానికి అండగా ఉండేందుకు, సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేస్తానని హరీష్ రావు ప్రకటించారు. ఇప్పుడు సిద్ధిపేట జిల్లాలో ప్రాజెక్టుల వద్ద పాదయాత్ర చేస్తున్నారు. పైగా పార్టీ జెండాల్లో ఎక్కడా కేటీఆర్ ఫోటో లేకుండా.పార్టీలో వెనకబడకుండా ఉండేందుకే హరీష్ వర్గం ఈ పాదయాత్రలను టేకప్ చేసిందని? కావాలనే కేటీఆర్ ఫోటోను పక్కనపెట్టిందని? కృష్ణార్జునులు అని ఎంత చెప్పినా, ఆధిపత్య పోరు ఎంతలా ఉందో ఇప్పుడు కనపడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో కవిత కూడా పార్టీలో కొట్లాటలు, ఆధిపత్యపోరు గురించి చెప్పిన మాటలను కూడా ప్రస్తావిస్తున్నారు.

# ఫలించిన 22 ఏళ్ల పోరాటం

మెదక్, జూలై 21 : ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసిత రైతుల 22 ఏళ్ల పోరాటం ఫలించింది. కందుకూరు మండలం లేమూరులోని సర్వే నంబర్ 102లో అభివృద్ధి చేసిన ప్లాట్లను కేటాయించేందుకు రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు అంగీకరించారు. ఆరుగురు సీఎంలకు విన్నవించి, ఇటీవల మూడు నెలల పాటు దీక్షలు చేసిన రైతుల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మార్గం సుగమమైంది. ఈ మేరకు 23 మంది సీలింగ్ పట్టాదారులకు 325 చ.గజాలు, కాస్తులో ఉన్న 148 మందికి 200 చ.గజాల చొప్పున ప్లాట్లు దక్కనున్నాయి. అయితే 38ఈ పట్టాదారుల సమస్య పరిష్కారం కావాల్సి ఉంది.ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసితుల సుదీర్ఘ పోరాటం ఎట్టకేలకు 22 సంవత్సరాల తర్వాత ఫలించింది. నిర్వాసిత రైతులకు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం లేమూరులో ప్లాట్లు కేటాయించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధిలోని తుక్కుగూడ డివిజన్ పరిధిలోని రావిర్యాల, జెన్నాయిగూడ గ్రామాల్లో మొత్తం 730.17 ఎకరాల భూమిని 2003-04లో అప్పటి ప్రభుత్వం ఏపీఐఐసీ కోసం సేకరించింది. ఇందులో కొండలు, గుట్టలు ఉన్న ప్రాంతాన్ని మినహాయించి.. మిగిలిన 679.13 ఎకరాలకు పరిహారంగా జెన్నాయిగూడ వద్ద 35 ఎకరాలను అభివృద్ధి చేసి ప్లాట్ల రూపంలో కేటాయిస్తామని అప్పట్లో ప్రతిపాదించారు. అయితే.. ఆ సమయంలో కేటాయించిన ప్యాకేజీకి 38ఈ పట్టా రైతులు అంగీకరించకపోవడంతో కేటాయింపు ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వాలు మారడంతో బాధితులకు న్యాయం జరగలేదు.ఈ సమస్య పరిష్కారం కోసం భూనిర్వాసిత రైతులు గత 22 ఏళ్లుగా విరామం లేకుండా పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి వరకు దాదాపు ఆరుగురు ముఖ్యమంత్రుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. 2003లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబును, 2006లో వైఎస్ రాజశేఖరరెడ్డిని కలిశారు. ఆ తర్వాత కొణిజేటి రోశయ్య, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలకు వినతిపత్రాలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ విషయాన్ని కేసీఆర్, కేటీఆర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టే సమయంలో మళ్లీ ప్రభుత్వం మారింది. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గత మూడు నెలలుగా రిలే నిరాహారదీక్షలు చేపట్టడం గమనార్హంఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేఎల్ఆర్.. బాధితుల సమస్యను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని టీజీఐఐసీ ఎండీని ఆదేశించింది. దీంతో స్పందించిన అధికారులు కందుకూరు మండలం లేమూరులోని సర్వే నంబరు 102లో ఉన్న 130 ఎకరాల అసైన్డ్ భూమిని అభివృద్ధి చేసి రైతులకు ప్లాట్లు ఇవ్వడానికి అంగీకరించారు.

# ముందుకు సాగని ఎస్ ఐఆర్



హైదరాబాద్, జూలై 21ం: హైదరాబాద్ SmF ప్రక్రియ సజావుగా నడవటం లేదు. బీఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారంలను పంపిణీ చేసి తిరిగి ఇవ్వాలని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. హైదరాబాద్ లో మాత్రం బీఎల్‌ఓలు ూఎఖీ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనడం లేదు. హైదరాబాద్ నగరం పరిధి ఎక్కువ కావడం, అపార్ట్ మెంట్లు ఎక్కువగా ఉండటంతో వాచ్ మెన్ కు ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చి వెళ్లిపోయే వారి సంఖ్య ఎక్కువగా కనపడుతుంది. ఎన్యుమరేషన్ ఫారాలు నింపడానికి అవసరమైన సలహాలు, సూచనలు కూడా చేయకపోవడంతో బీఎల్‌ఓలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి వరకూ ఇరవై శాతం మాత్రమే ఎన్యుమరేషన్ జరిగిందని చెబుతున్నారు. బీఎల్‌ఓలు పెద్దగా పట్టించుకోకపోవడంతోనే ూఎఖీ ప్రక్రియ సజావుగా నడవడం లేదు. పైగా బీఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేయడంలో సహకరించాల్సింది పోయి అసలు పట్టీపట్టన్నట్లు వ్యవహరించడంతోనే ఈ ప్రక్రియ సజావుగా జరగడం లేదు. అనేక మంది తమకు ఓట్లు ఉన్నా లేకపోయినా పరవాలేదు అనుకునే దశకు చేరుకున్నారు. బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని అంటున్నారు. .. దీనికి బీఎల్‌ఓలను ప్రశ్నిస్తే తాము వచ్చి ఫారాలు నింపేందుకు సహకరించలేమని, తమకు మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదని ఎదురుదాడికి దిగుతున్నారు. అనేక ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. హైదరాబాద్ లో అపార్ట్ మెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటన్నింటికీ ఎక్కి దిగాలంటే కష్టమే. కానీ తమకు మంచి నీళ్లు ఇవ్వలేదని, టీ అడగలేదంటూ కుంటిసాకులు చెబుతూ ూఎఖీ ప్రక్రియ ను నీరుగార్చడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇప్పటికైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకోకపోతే ఆగస్టు 3వ తేదీ వరకూ పెంచినా ఈ SmF ప్రక్రియ సజావుగా పూర్తి కాదన్న వాస్తవం గ్రహించాలి.

# తిట్టు తిట్టించు...

## తెలంగాణలో నయా రాజకీయం





హైదరాబాద్, జూలై 21: తెలంగాణలో రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శల స్థానాన్ని ఇప్పుడు పచ్చి బూతులు, తీవ్రమైన వ్యక్తిగత దూషణలు ఆక్రమిస్తున్నాయి. శనివారం ఉదయం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన నిరుద్యోగుల సదస్సు ఇందుకు తాజా ఉదాహరణగా నిలిచింది. ఈ సమావేశంలో నిరుద్యోగుల సమస్యలను పక్కనబెట్టి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో తిట్లందుకున్నారు. ఇక దీనికి ప్రతిగా సాయంత్రం వేదికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అదే స్థాయిలో విరుచుకుపడ్డారు. నువ్వెంత.. నీ బిశాదెంత.. నీ జాతెంత. నీ జాతి మా ప్రజా పాలన మీద శాపనార్థాలు పెడ్తదా. అంటూ సీఎం కౌంటర్ ఇచ్చారు.రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు సహజం. కానీ, ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా సాగుతున్న ఈ తిట్ల పురాణం రాను రాను పౌర సమాజానికి, సామాన్య ప్రజలకు సైతం తీవ్ర అసహ్యం కలిగిస్తోంది. నిరుద్యోగ సంగ్రామ సభ పెట్టిన కేటీఆర్ కొంత మందియువతతో మాట్లాడించారు. వారు రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత బూతులు తిట్టడానికే తమ సమయం కేటాయించారు. ఇందులో మహిళలు కూడా ఉన్నారు. ఇలా ఓ ముఖ్యమంత్రిని ఉద్దేశపూర్వకంగా తిట్టించడం.. దాన్ని కేటీఆర్ ఆస్వాదించడం ఏ మాత్రం సమర్థనీయంగా లేదు.అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ తిట్ల పురాణాన్ని ఊరికే వదిలేయడం లేదు. తనపై వస్తున్న విమర్శలను, దూషణలను ఆయన అత్యంత తెలివిగా ఒక పక్కా పొలిటికల్ అస్త్రంగా మలచుకుంటున్నారు. తనను తిడుతున్న ప్రతి సందర్భాన్ని పరోక్షంగా ఒక సామాజిక అంశంగా మారుస్తూ, తెలంగాణ సమాజంలో గత పాలకుల సామాజికవర్గం పై సహజంగా ఉండే కొన్ని వర్గాల వ్యతిరేకతను మరింత పెంచడానికి వాడుకుంటున్నారు. తెలంగాణను పదేళ్లు దోచుకున్న ఒక నిర్దిష్ట జాతి శక్తులు.. ఇప్పుడు పేదల ప్రజా పాలనపై శాపనార్థాలు పెడుతున్నాయి అనే నేరేటివ్‌ను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా సెంటిమెంట్‌ను రగిల్చే వ్యూహాన్ని రేవంత్ అమలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.ఈ జాతి, జాతెంత అనే వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నమైన చర్చ నడుస్తోంది. రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే కేసీఆర్ కుటుంబ సామాజికవర్గాన్ని టార్గెట్ చేశారని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతుంటే.. గతంలో కేసీఆర్, కేటీఆర్ ప్రతిపక్ష నేతలను లఫంగి, సన్నాసి అంటూ సంబోధించినప్పుడు లేని సంస్కారం ఇప్పుడెందుకు గుర్తుకొచ్చిందని కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్స్ కౌంటర్లు ఇస్తున్నారు. ఈ సోషల్ మీడియా వార్‌తో రాష్ట్రంలో పొలిటికల్ డిస్కషన్ పూర్తిగా పక్కదారి పట్టి, కేవలం కుల సమీకరణాలు, ఈగో క్లాషెస్ చుట్టూనే తిరుగుతోంది. ఇది ఆ పార్టీలకు ఎలాంటి మేలు చేయదు.

**మౌన రాజకీయాలు చేస్తున్న మల్లారెడ్డి**

తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని లక్ష్యంగా చేసుకుని సొంత పార్టీ సోషల్ మీడియా విభాగాలు ఒక్కసారిగా దాడికి దిగడం ఇప్పుడు రాష్ట్ర పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రజాకవి అందెశ్రీకి సంబంధించిన ఒక అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మల్లారెడ్డి ఒకే వేదికను పంచుకున్నారు. ఆ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి వేదికపై నుంచే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో రాజకీయ విమర్శలు గుప్పించారు. అయితే, రేవంత్ రెడ్డి విమర్శలు చేస్తున్నప్పుడు పక్కనే ఉన్న మల్లారెడ్డి వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదని, కనీసం నిరసన కూడా తెలపకుండా మౌనంగా ఉండిపోయారనేది గులాబీ శ్రేణుల ప్రధాన ఆగ్రహం.వాస్తవానికి, గత కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాల్లో మల్లారెడ్డి పెద్దగా చురుగ్గా వ్యవహరించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన పార్టీ కార్యక్రమాలకు కాస్త దూరంగానే ఉంటున్నారు. వర్తమాన రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా భారీ విద్యాసంస్థలు, వ్యాపార సామ్రాజ్యాలు ఉన్న నాయకులు ఎదుర్కొనే రాజకీయ ఒత్తిళ్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏ రకమైన సమీకరణాలు, వ్యూహాలతో మల్లారెడ్డిని పార్టీలోకి చేర్చుకున్నారో.. ఇప్పుడు కేంద్ర, రాష్ట్రాల్లోని అధికార పార్టీలు కూడా అదే తరహా ఒత్తిళ్లకు లేదా ఆకర్షణ మంత్రాలకు పాల్పడుతున్నాయనేది బహిరంగ రహస్యం.ఇలాంటి కత్తిమీద సాము లాంటి పరిస్థితుల్లో, ఆయన పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, సొంత పార్టీ బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడకుండా సైలెంట్‌గా ఉండటమే ఒక రకంగా గొప్ప విషయం. ఈ సున్నితమైన తరుణంలో మల్లారెడ్డి లాంటి సీనియర్ నేతను గుర్తించకుండా, ఆయనపై సోషల్ మీడియా ద్వారా దాడి చేయించడం వల్ల బీఆర్ఎస్‌కు ఎలాంటి రాజకీయ ప్రయోజనమూ ఉండదు. మల్లారెడ్డి కేవలం ఒక సాధారణ ఎమ్మెల్యే మాత్రమే కాదు; మేడ్చల్ నియోజకవర్గంతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని, బలమైన అనుచరగణాన్ని సంపాదించుకున్న ఒక స్టేచర్ ఉన్న లీడర్. ఆయన వ్యాపారాలు, విద్యాసంస్థల రక్షణ కోసం అధికార పక్షంతో సఖ్యతగా ఉండటం రాజకీయంగా సహజం. అంతమాత్రానికే ఆయనను బలిపశువును చేస్తూ ట్రోలింగ్ చేయడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ.

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. రేపటి రోజున రాజకీయ సమీకరణాలు మారి, కాంగ్రెస్ లేదా బీజేపీ కంటే బీఆర్ఎస్ పార్టీయే తమ భవిష్యత్తుకు బెటర్ అని మల్లారెడ్డి భావిస్తే.. ఆయన పార్టీ మారాలనే ఆలోచనను పక్కన పెట్టి మళ్లీ గులాబీ గూటిలోనే కొనసాగే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఇప్పుడే ఆయనను టార్గెట్ చేసి దూరం చేసుకుంటే, ఆయన అధికార పార్టీ వైపు అడుగులు వేయడానికి బీఆర్ఎస్సే స్వయంగా దారి చూపించినట్లవుతుంది. కాబట్టి, ఆవేశంతో కాకుండా ఆలోచనతో, మల్లారెడ్డి లాంటి సీనియర్ల విషయంలో వ్యూహాత్మక మౌనాన్ని ప్రదర్శించడమే బీఆర్ఎస్ లీడర్‌షిప్‌కు మేలు చేకూరుస్తుందని అనుకోవచ్చు.

# యూనిఫాం 50 శాతంపై సౌత్ స్టేట్స్ హ్యాపీ

హైదరాబాద్, జూలై 21, : దేశంలో నియోజకవర్గాల పునర్విభజ అంశం సరికొత్త మలుపు తిరిగింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్ల విభజన జరిగితే ఉత్తరాది రాష్ట్రాల సీట్లు విపరీతంగా పెరిగి, జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పార్లమెంట్‌లో దారుణంగా పడిపోతుందనే భయాలు ఇన్నాళ్లూ ఉండేవి. అయితే, కేంద్ర ప్రభుత్వం తెరపైకి తెచ్చిన యూనిఫాం 50 శాతం సీట్ల పెంపు ఫార్ములా ఈ సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. ఏ రాష్ట్రానికీ ఉన్న సీట్లు తగ్గకుండా, ఉన్న స్థానాలను యాభై శాతం పెంచే ఈ మధ్యేమార్గ ఫార్ములాకు దక్షిణాదిలోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు లోపాయకారీగా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో బలమైన చర్చ నడుస్తోంది.నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పై కేంద్రం ప్రతిపాదించినట్లుగా ప్రచారం జరుగుతున్న "యూనిఫాం 50 శాతం సీట్ల పెంపు ఫార్ములా" పట్ల దక్షిణాది పార్టీలు సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

దక్షిణాది పార్టీల వైఖరి సానుకూలత:

జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పడిపోతుందనే భయాలు ఉండేవి. అయితే, ఏ రాష్ట్రానికీ ఉన్న సీట్లు తగ్గకుండా, ఉన్న స్థానాలను 50% పెంచే ఈ మధ్యేమార్గ ఫార్ములాకు దక్షిణాది



ప్రాంతీయ పార్టీలు లోపాయకారీగా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

డీఎంకే (తమిళనాడు): జనాభా ప్రాతిపదికన వెళ్తే తీవ్రంగా నష్టపోయే తమిళనాడు, ఈ ఫార్ములా వల్ల తమ సొంత రాష్ట్రంలో పొలిటికల్ స్పేస్ పెరగడమే కాకుండా పార్లమెంట్‌లో గొంతుక మరింత బలపడుతుందని భావిస్తోంది. ప్రాంతీయ ప్రయోజనాల దృష్ట్యా దీనిని తిరస్కరించాల్సిన అవసరం లేదని స్టాలిన్ ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం.

బీఆర్ఎస్ (తెలంగాణ): పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి నిష్పత్తి దారుణంగా పడిపోనంత కాలం, ఈ 50% పెంపుదల మోడల్ వల్ల తమకు వచ్చే నష్టమేమీ లేదని భావిస్తూ సానుకూల ధోరణిలోనే ఉంది.

తమిళనాడు, తెలుగు రాష్ట్రాల సీట్ల సమీకరణాలు ఈ ఫార్ములా ప్రకారం మూడు రాష్ట్రాలలో సీట్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది. దీనివల్ల ఎక్కువ మంది అభ్యర్థులకు అవకాశం లభించడంతో పాటు రాజకీయ పునరేకీకరణకు క్షేత్రస్థాయిలో మార్గం సుగమం అవుతుంది.రాష్ట్రాల వారీగా మారబోయే సీట్ల అంచనాలు:రాష్ట్రంప్రస్తుత లోక్‌సభ సీట్లు50% ఫార్ములా ప్రకారం పెరిగే సీట్లు (అంచనా)

| | | |
|---|---|---|
| తమిళనాడు | 39 | 59 |
| ఆంధ్రప్రదేశ్ | 25 | 37 - 38 |
| తెలంగాణ | 17 | 25 - 26 |


రాష్ట్రాలకు వచ్చే అదనపు సీట్లను, కేంద్ర నిధుల వాటాలను కోల్పోకూడదనే ఆర్థిక కోణంతో పాటు, ప్రాంతీయ అస్తిత్వం దెబ్బతినకుండా పార్లమెంట్‌లో బలం పెరుగుతుండటంతో డీఎంకే, బీఆర్ఎస్, టీడీపీ, వైఎస్సార్‌సీపీ సహా దాదాపు అన్ని పార్టీలు ఈ కొత్త పొలిటికల్ రియాలిటీని స్వీకరించే దిశగానే అడుగులు వేస్తున్నాయి.

# హైదరాబాద్‌లో కొత్తగా మరో 15 రిటైల్ మాల్స్..

హైదరాబాద్, జూలై 21: హైదరాబాద్‌లో రిటైల్ రంగానికి లభిస్తున్న ఆదరణతో మరో 15 కొత్త మాల్స్ ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం 30కి పైగా మాల్స్ ఉండగా.. కొత్తగా 6 గ్రేడ్-1, పలు గ్రేడ్-2 మాల్స్ జతకానున్నాయి. సంధ్య లులూ, ఫోరం మాల్, వంశీరామ్, బ్రూక్‌ఫీల్డ్ వంటి దిగ్గజ మాల్స్ రాబోతున్నాయి. కాగా, నిర్వహణ భారం, ఆధునిక పోటీ తట్టుకోలేక పాత మాల్స్ క్రమంగా ఆస్పత్రులు, కామర్షియల్ టవర్లుగా మారుతున్నాయి. మరోవైపు నగరంలోని అన్ని దిక్కులా మాల్స్ కల్చర్ విస్తరిస్తున్నట్లు అనరాక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.హైదరాబాద్ మహానగరంలో రిటైల్ రంగం శరవేగంగా విస్తరిస్తోంది. మాల్స్ సంస్కృతి నగరంలో కొత్త శిఖరాలకు చేరుకుంటోంది. తాజాగా అందిన వివరాల ప్రకారం.. ఈ సంవత్సరాంతానికి లేదా వచ్చే ఏడాది నాటికి గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా కొత్తగా మరో 15 మాల్స్ ప్రారంభం కానున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే నగరంలో చిన్నవి, పెద్దవి కలిపి 30కి పైగా మాల్స్ అందుబాటులో ఉన్నాయి. దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి అని అనరాక్ వంటి ప్రముఖ రియల్ ఎస్టేట్ పరిశోధనా సంస్థలు వెల్లడిస్తున్నాయి.ఒకప్పుడు కేవలం సెంట్రల్ హైదరాబాద్ ప్రాంతానికే పరిమితమైన మాల్స్, ఇప్పుడు నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ అంటూ నగర నలుమూలలకూ విస్తరించాయి. కొత్తగా రాబోతున్న వాటిలో ఆరు మాల్స్ గ్రేడ్-1 కేటగిరీకి చెందినవిగా ఉండనున్నాయి. దీంతో నగరంలో గ్రేడ్-1 మాల్స్ సంఖ్య 9 నుంచి 15కి చేరనుంది. మరోవైపు.. కొత్తగా అత్యాధునిక మాల్స్ రూపుదిద్దుకుంటుండటంతో పాత మాల్స్ నిర్వహణ తీవ్ర భారంగా మారి తెరమరుగయ్యే పరిస్థితి నెలకొంది. కొన్ని పాత మాల్స్ ఇప్పటికే ఆస్పత్రులుగా, వాణిజ్య సముదాయాలుగా రూపాంతరం చెందుతుండగా.. మరికొన్ని మాల్స్ నిర్మాణ దశలోనే ఇతర వాణిజ్య సంస్థలుగా మారిపోతున్నాయి.నగరంలో రాబోతున్న ప్రధాన గ్రేడ్-1 మాల్స్ చూసినట్లయితే.. నార్సింగి వద్ద దేశంలోనే అతిపెద్ద మాల్స్‌లో ఒకటిగా సంధ్య లులూ మాల్ రానుంది. రాజేంద్రనగర్‌లోని ప్రెస్టీజ్ సిటీలో దాదాపు 12 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫోరం మాల్ నిర్మితమవుతోంది. గచ్చిబౌలి పరిసరాల్లో యూనిటీ మాల్, నార్సింగి వద్ద లగ్జరీ మాల్‌గా వంశీరామ్ మాల్, కోకాపేట వద్ద ఏరియా బై ఫెయిర్‌మౌంట్, కర్మాన్‌ఘాట్ వద్ద కొలీసియం మాల్ రూపుదిద్దుకుంటున్నాయి. వీటితో పాటు నానక్‌రామ్‌గూడ వద్ద ఎస్ఏఎస్ ఐ-టవర్స్ రిటైల్, రాయదుర్గంలో బ్రూక్‌ఫీల్డ్ కే రహేజా కార్ప్ మాల్, డౌన్ టౌన్ మాల్స్ అందుబాటులోకి రానున్నాయి.వీటితో పాటు మీడియం అండ్ కమ్యూనిటీ కేటగిరీ కింద రాబోతున్న గ్రేడ్-2 మాల్స్ నగరంలో రీజినల్ రిటైల్ అవసరాలను తీర్చనున్నాయి. హస్తినాపురంలో హెచ్ఎస్ఆర్ ఆర్క్ మాల్, మణికొండలో రామిరెడ్డి మాల్, బాలానగర్‌లో స్టార్ లైట్ మాల్, బండ్లగూడ పరిసరాల్లో టాప్రా మాల్ నిర్మాణంలో ఉన్నాయి. ఆధునిక సౌకర్యాలు, విశాలమైన పార్కింగ్, అంతర్జాతీయ బ్రాండ్లతో వస్తున్న ఈ కొత్త మాల్స్ రాకతో హైదరాబాద్ రిటైల్ మార్కెట్ స్వరూపమే మారిపోనుంది.

# 78 మండలాల్లో కరువు జాడలు

హైదరాబాద్, జూలై 21: తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు లేక రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. తెలంగాణలోనూ వానలు కురియడం లేదు. అనేక మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. తాగు, సాగు నీటికి కూడా ఇబ్బందికరంగా మారింది. వానలు లేకపోవడంతో ప్రాజెక్టుల్లో నీరు లేదు. తెలంగాణ ఎక్కువగా భూగర్భ జలాల పై ఆధారపడి సేద్యం సాగుతుంది. కానీ విపరీతమైన ఎండల కారణంగా చాలా బోర్లు ఎండిపోయాయి. అనేక మండాలలను కరువు పరిస్థితులు ప్రకటించడానికి ప్రభుత్వం సిద్ధమయింది. ఎల్ నినో ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తుంది.మరొకవైపు జులై నెలలో చల్లదనాన్ని నిండుకుని ఉండే తెలంగాణ నేటికీ వేసవి కాలాన్ని తలపిస్తుంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా మేరకు ఈరోజు వానలు అక్కడక్కడ పడతాయని, తేలికపాటి వానలు మాత్రమే పడతాయని చెప్పింది. ఈ కరువు నుంచి బయటపడాలంటే కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిందే.ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి రెండు నెలలు గడుస్తున్నా, రాష్ట్రంలోని 78 మండలాల్లో చుక్క వర్షం కూడా పడలేదు. చెరువులు పూర్తిగా ఎండిపోయి, పంట పొలాలు కష్టాల్లో ఉన్నాయి. వాతావరణ శాఖ తెలిపిన సమాచారం ప్రకారం,



రాష్ట్రంలో సగటున 24 రోజులే వర్షాలు కురిసినట్లు తెలుస్తోంది. పలు జిల్లాల్లో పది రోజులు కూడా వర్షం కురవలేదని అధికారులు పేర్కొన్నారు. నేలలో తేమ ఆరిపోయి, నాటిన విత్తనాలు మాడిపోతున్నాయి. కొన్ని మొలకెత్తినప్పటికీ, అవి వాడిపోయి నేలవాలుతున్నాయి. ఈ పరిస్థితి రైతుల ఆశలను మరింతగా దెబ్బతీస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా 462 మండలాల్లో లోటు వర్షపాతం నమోదవుతోంది. ములుగు జిల్లాలో మాత్రమే వర్షపాతం సాధారణ స్థాయిని మించి ఉంది. ములుగు జిల్లాలో 343.2 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా, 350 మిల్లీ మీటర్ల వర్షం పడింది. కానీ, మిగతా జిల్లాల్లో 33 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుండి జులై 19 వరకు సాధారణంగా 254.3 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉంది, కానీ కేవలం 170.7 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసాయి. గత సంవత్సరం ఇదే కాలంలో 204.3 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది, అయితే ఈసారి పరిస్థితి మరింత కష్టంగా ఉంది.సాధారణంగా జులైలో నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల ఎక్కువ వర్షాలు కురుస్తుంటాయి. కానీ ఈసారి 53 శాతం లోటు వర్షపాతం నమోదవుతోంది. జూన్ నుండి సెప్టెంబర్ వరకు సాధారణంగా 740.6 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉంది, కానీ ఇప్పటి వరకు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. జూన్‌లో 130.3 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 115.3 మిల్లీ మాత్రమే కురిసింది. జులైలో 227.4 మిల్లీ వర్షం పడాల్సి ఉంది, కానీ 61.5 మిల్లీ మాత్రమే కురిసింది. ఈ పరిస్థితి రైతుల సాగుకు తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలంలో గోదావరి నది కూడా వెలవెలబోతుంది. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడుతున్న కరవు పరిస్థితుల వల్ల దాదాపు 2 వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. వాజేడు, ఏటూరునాగారం, మంగంపేట, వెంకటాపురం మండలాల్లో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

# ఒకేసారి ముగ్గురు...

## నార్మల్ డెలివరీలో అరుదైన త్రిపుల్స్!

- నాగర్‌కర్నూల్ ప్రగతి నర్సింగ్ హోమ్‌లో అద్భుతం...
- తల్లీబిడ్డలు క్షేమం..




ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జులై 21 (విజన్ ఆంధ్ర): నాగర్‌కర్నూల్‌లో వైద్య అద్భుతం జరిగింది.లి జిల్లా కేంద్రంలోని ప్రగతి నర్సింగ్ హోమ్‌లో మంగళవారం ఒక యువతి సాధారణ కాన్పు ద్వారా ఒకేసారి ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. పెద్దకొత్తపల్లి మండలం నారాయణపల్లి గ్రామానికి చెందిన 22 ఏళ్ల అనిత మొదటి కాన్పు కోసం సోమవారం ఆస్పత్రిలో చేరింది. వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో మంగళవారం నార్మల్ డెలివరీ జరిగింది. ఫలితంగా ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగబిడ్డ ఆరోగ్యంగా జన్మించారు. అనుభవజ్ఞురాలైన డా. నూర్జహాన్ మాట్లాడుతూ నా 40 ఏళ్ల వైద్య జీవితంలో సాధారణ కాన్పు ద్వారా త్రిపుల్స్ పుట్టడం ఇది ఐదోసారి. ఇది చాలా అరుదైన ఘటన. ముగ్గురి బరువు చెరో 2 కిలోలు ఉంది. తల్లీబిడ్డలం పూర్తి ఆరోగ్యంగా ఉన్నాం" అని సంతోషం వ్యక్తం చేశారు. ఒక్కసారిగా ఇంటికి ముగ్గురు పిల్లలు రావడంతో అనిత, శివ దంపతులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. "దేవుడి దయ" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వార్త తెలియగానే నారాయణపల్లి గ్రామంలో సంబరాలు మిన్నంటాయి.

వైద్య నిపుణుల ప్రకారం : సాధారణ కాన్పులో త్రిపుల్స్ పుట్టడం లక్షలో ఒకటి. ఈ విజయవంతమైన డెలివరీతో ప్రగతి నర్సింగ్ హోమ్ వైద్య బృందానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# అందరికీ న్యాయ సేవలు అందించడమే లక్ష్యం

- డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి.కృష్ణయ్య



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 21 (విజన్ ఆంధ్ర) : సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి. కృష్ణయ్య పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి జి. కళార్చన ఆదేశాల మేరకు శుక్రవారం వనపర్తి జిల్లా మల్లాయిపల్లి గ్రామంలో ప్రజలకు, అలాగే చందాపూర్, చింతకుంట గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ... బాల్య వివాహాల నిర్మూలన చట్టం, పోక్సో చట్టం, ఉచిత విద్యా హక్కు చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, మోటారు వాహనాల చట్టం మరియు సైబర్ క్రైమ్స్ (సైబర్ నేరాలు) పట్ల ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం తెలంగాణ న్యాయ సేవా అధికార సంస్థ రూపొందించిన న్యాయ అవగాహన లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఉచిత న్యాయ సేవలకై టోల్ ఫ్రీ నెంబర్: 15100 బాధితులు లేదా న్యాయ సహాయం కావాల్సిన వారు 15100 నెంబర్‌ను సంప్రదించి ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లాయిపల్లి గ్రామ సర్పంచ్, గ్రామస్థులు, పారా లీగల్ వాలంటీర్లు, చింతకుంట మరియు చందాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'సర్ ' కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాగస్వామ్యం కావాలి

*సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులకు...మైనంపల్లి హన్మంతరావు పిలుపు*



మల్కాజిగిరి, జూలై 21, (విజన్ ఆంధ్ర) : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో కాంగ్రెస్ శ్రేణులు భాగస్వామ్యులై సమర్ధవంతంగా ముందుకు తీసుకుని వెళ్ళాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కోరారు. సోమవారం ఆనంద్ బాగ్ లోని క్యాంపు కార్యాల యం వద్ద కాంగ్రెస్ నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మైనంపల్లి హన్మంత రావు మాట్లాడుతూ, సర్ కార్యక్రమాన్ని ఆగస్ట్ 3 వ తేది వరకూ గడువు పొడిగించడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ, సమర్పణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని మీ బాధ్యతగా తీసుకుని ముందుకు వెళ్లాలని కోరారు. సర్ ప్రక్రియలో ఎలాంటి తప్పులు జరగకుండా , అర్హులైన వారందరికీ ఓటు హక్కు లభించేలా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు సమీర్ కౌశల్, మాజీ కార్పొరేటర్లు వై ప్రేమ్ కుమార్, జితేం ద్రనాథ్, మల్కాజిగిరి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు తుమట్ల వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్, జీఎన్ వీ సతీష్ కుమార్, ఎస్ ఆర్ ప్రసాద్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, డివిజన్ అధ్య క్షులు నోరి సత్యమూర్తి, పోతుల వినోద్ యా దవ్, పిట్టల నాగరాజు, జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, యూసుఫ్ భాయ్, శ్రీకాంత్, సీనియర్ నాయకులు బాబు, సత్యనారా యణ,సిరిగిరి రాజు, సనాది శంకర్,వెంకటేష్, చుంకూ శ్రీనివాస్,ఆశా, ఇందిర ప్రియదర్శిని, శారద, సుమలతయాదవ్, కనకలక్ష్మి, పుష్ప లత, పార్థు, బాలరాజ్ యాదవ్, కుట్టి శ్రీనివా స్,బ్రహ్మయ్య, శ్రీరామ్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు

# బాలికల విద్యాభివృద్ధికి అందరూ తోడ్పడాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- పదో తరగతి ప్రతిభావంతులకు 'వీఐపీ' స్వచ్ఛంద సంస్థ సత్కారం
- ఉత్సాహంగా సాగిన ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమం



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 21(విజన్ ఆంధ్ర)
బాలికల విద్యను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి, వారికి అండగా నిలుస్తూ ఉన్నత చదువులకు తోడ్పాటునందించడం ఎంతో అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. బాలికల విద్యాభివృద్ధి, వారిలో ఉన్నత విద్యపై మరింత ప్రోత్సాహం నింపే లక్ష్యంతో 'విలేజెస్ ఇన్ పార్ట్‌నర్‌షిప్' (విఐపి) గ్రామీణ భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర స్వామి ఆధ్వర్యంలో మంగళవారం




వనపర్తిలోని దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో 'ప్రతిభా పురస్కారాల' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ఇలాంటి సత్కార కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామమన్నారు. లభించిన అవకాశాలను ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. "విద్యార్థినులు కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించాలి. సమాజానికి ఆదర్శంగా నిలవాలి. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం విద్యార్థుల శ్రేయస్సుకు, వారి అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ, ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిన కవిత వంటి విజేతలను ఆదర్శంగా తీసుకుని మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు.

**15 మంది విద్యార్థినులకు పురస్కారాలు**

జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలం నుంచి పదో తరగతి తెలుగు మాధ్యమంలో అత్యధిక మార్కులు సాధించిన 15 మంది ప్రతిభావంతులైన విద్యార్థినులను ఈ వేదికపై ప్రత్యేకంగా సత్కరించారు. వారికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులతో పాటు మొక్కలను అందజేశారు. విద్యార్థినుల పురోగతికి కారణమైన వారి తల్లిదండ్రులను, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

**ఆకట్టుకున్న 'కవిత' సందేశం**

విఐపి స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో ఉన్నత చదువులు పూర్తి చేసి, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన 'కవిత' అనే యువతి ప్రసంగం సభలో అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. తన విద్యార్జన ప్రయాణాన్ని వివరిస్తూ ఆమె ఇచ్చిన సందేశం సదస్సులో స్ఫూర్తి నింపింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) యాదయ్య, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రంజిత్ రెడ్డి, విలేజెస్ ఇన్ పార్ట్‌నర్‌షిప్ (విఐపి) వ్యవస్థాపకులు నాగేంద్ర స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రహదారి భద్రతకు పక్కా చర్యలు చేపట్టాలి

- అక్రమ పార్కింగ్‌లపై ఉక్కుపాదం
- వీడియో కాన్ఫరెన్స్‌లో =&దీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్
- అధికారులకు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 21 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో రహదారి భద్రతను మరింత సమర్థవంతంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర రహదారులు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లాల్లో రహదారి భద్రతకు సంబంధించిన చర్యలు, సుప్రీంకోర్టు కమిటీ ఆదేశాల అమలు పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్ తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా రహదారులు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణ రోడ్లు & భవనాల శాఖ, పోలీసు శాఖ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (చీనాూ×) సమన్వయంతో రహదారి భద్రతా చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు, ట్రక్కులు పార్కింగ్ చేయవద్దని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలు మినహా ఎక్కడా వాహనాలు పార్కింగ్ చేయవద్దని




స్పష్టం చేశారు. అలాగే రోడ్డుపై ఆక్రమణలు ఉండకుండా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు అధికారులు, పోలీసులు, జాతీయ రహదారుల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారుల వెంట పోలీస్, రవాణా శాఖ అధికారుల పెట్రోలింగ్ వాహనాలు ఎప్పుడూ పెట్రోలింగ్ చేసేలా చూడాలని సూచించారు. ఆ వాహనంలో అత్యవసర సేవలు అందించే సామాగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ జిల్లా పరిధిలో అన్ని ఆసుపత్రుల వివరాలు, ట్రామా కేర్ సెంటర్ల వివరాలు మ్యాపింగ్ చేసి అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. అన్ని జిల్లాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తించి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి భద్రతపై సుప్రీంకోర్టు కమిటీ ఆదేశాల అమలుపై రేపటిలోగా పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రహదారులపై అక్రమ ఆక్రమణల తొలగింపు, పార్కింగ్ నిషేధిత ప్రాంతాల అమలు, రోడ్డు భద్రతా తనిఖీలు, సమర్థవంతమైన పహారా, తదితర అంశాలపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జిల్లా హైవేస్ టాస్క్‌ఫోర్స్ను మరింత చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసి, అక్రమ ఆక్రమణల జాబితాను సిద్ధం చేసి తొలగింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో రోడ్లు & భవనాల శాఖ ఈఈ పరిమళ, డిటిఓ సురేష్,తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి జిల్లా ప్రతినిధి,జులై 21 (విజన్ ఆంధ్ర) : ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (జజుూ) పి. సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాల్లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఎన్యుమరేషన్ ఫారంల డిజిటలైజేషన్ ఎంత శాతం పూర్తయిందని ఇంకా ఎంత మేర చేయాల్సి ఉందని దానిపై ఆరా తీశారు. మరో వారం రోజుల్లో 90 శాతానికి చేరుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అన్ని జిల్లాల అధికారులకు సూచించారు. వీసి అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. అందరూ తహసీల్దార్లు ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, ఫారాల సేకరణ, ఆన్లైన్ లో నమోదు, తదితర పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసిల్దార్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నీనో కంటింజెన్సీ ప్లాన్ బుక్‌లెట్ ఆవిష్కరణ...

- రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ




హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 21 ( విజన్ ఆంధ్ర ) : ఈ సందర్భంగా 2026 వానాకాల పంట సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ రూపొందించిన 'ఎల్‌నీనో కంటింజెన్సీ ప్లాన్2026' బుక్‌లెట్‌తో పాటు పంటల క్యాలెండర్లను రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ఆవిష్కరించారు.అనంతరం వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లేలా ప్రోత్సహించేందుకు, సబ్సిడీపై అందుబాటులోకి తీసుకువచ్చిన కంది, పెసర విత్తనాల ప్యాకెట్లను హనుమకొండ జిల్లా హసన్‌పర్తి, ఎల్కతుర్తి, దామెర, భీమదేవరపల్లి మండలాలకు చెందిన రైతులకు మంత్రుల చేతుల మీదుగా వ్యవసాయ శాఖ అధికారులు పంపిణీ చేశారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టి నష్టాలను తగ్గించుకోవాలని ఈ సందర్భంగా మంత్రులు సూచించారు.

## వరుసగా రెండోరోజూ నష్టాల్లో సూచీలు

ముంబయి,జూలై21 : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరగడం, విదేశీ మదుపర్ల విక్రయాలు జరపడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. దీంతో సెన్సెక్స్ 238 పాయింట్లు కోల్పోగా.. సెన్సెక్స్ 50 పాయింట్ల మేర పతనమైంది. సెన్సెక్స్ 238.41 పాయింట్ల నష్టంతో 77,470.11 వద్ద ముగిసింది. నిఫ్టీ 50.80 పాయింట్లు పతనమై 24,187.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్30 సూచీలో బజాజ్‌÷నాన్స్, ఇండిగో, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఎస్‌బీఐ, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రుపాయి విలువ 96.24 వద్ద ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.33 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,066 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# జర్నలిస్టులకు 'పునశ్చరణ' ఎంతో ప్రయోజనకరం

- తెలంగాణ ప్రెస్ అకాడమీ శిక్షణ తరగతులు పూర్తి
- టీడబ్ల్యూజేయూ రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్‌కు వనపర్తి జిల్లా జర్నలిస్టులు కృతజ్ఞతలు



వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 21 (విజన్ ఆంధ్ర) : హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు



నిర్వహించిన పునశ్చరణ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని వనపర్తి జిల్లా ప్రతినిధులు తెలిపారు. జర్నలిజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విలేకరులు తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడిందన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, ఈ రంగానికి చెందిన నిపుణులు విలేకరులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

సమాచార హక్కు చట్టం (=×) మాజీ ఆర్‌టీఐ కమిషనర్, సీనియర్ జర్నలిస్టు దిలీప్ రెడ్డి ప్రజా ప్రయోజనాల కోసం ఆర్‌టీఐ చట్టం2005ను సమర్థవంతంగా ఎలా వినియోగించుకోవాలో సమగ్రంగా వివరించారు.

వార్తా రచన ప్రమాణాలు 'దిశ' ఎడిటర్ మార్కండేయ వార్తా కథనాలు, ప్రత్యేక కథనాల రచనలో పాటించాల్సిన ప్రమాణాలు, విశ్లేషణాత్మక దృక్పథంపై మార్గనిర్దేశం చేశారు.

ఫేక్ న్యూస్ ఏఐ సవాళ్లు నేటి డిజిటల్ యుగంలో ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, కృత్రిమ మేధ (ూ×) ప్రభావం గురించి సీనియర్ జర్నలిస్టు ఉడుముల సుధాకర్ రెడ్డి వివరిస్తూ, వాటిని గుర్తించే విధానాలపై విలేకరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేర వార్తలు నైతికత సీనియర్ జర్నలిస్టు గోవింద్ రెడ్డి నేర వార్తల రచనలో పాటించాల్సిన నైతిక ప్రమాణాలు, చట్టపరమైన జాగ్రత్తలు, 'చేయాల్సినవిచేయకూడనివి' అనే అంశాలపై స్పష్టతనిచ్చారు.

భాషా ప్రమాణాలు & గ్రామీణ వార్తలు సీనియర్ జర్నలిస్టు చిల్ల మల్లేశం వార్తా రచనలో వ్యాకరణం, భాషా ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించగా... సీనియర్ జర్నలిస్టు తోట భావనారాయణ గ్రామీణ వార్తల సేకరణ, ఎలక్ట్రానిక్ మీడియాలో వాటి ప్రదర్శనపై విలువైన సూచనలు చేశారు.

మీడియా చట్టాలు, నైతిక నియమావళి "మీడియా చట్టాలు, నైతిక నియమావళి" అనే అంశంపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. సమాజంలో మీడియా బాధ్యతలు, విలువలు, నైతికత, చట్టపరమైన అంశాలను తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి విలేకరులకు క్షుణ్ణంగా వివరించారు.

మధు గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు వనపర్తి జిల్లా జర్నలిస్టుల కోసం ఈ శిక్షణ తరగతులు విజయవంతంగా జరిగేలా ప్రత్యేక కృషి చేసిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఔజీఖ) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ విలేకరుల నైపుణ్యాభివృద్ధి కోసం ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని వనపర్తి జిల్లా ప్రతినిధులు కోరారు.

విజన్ ఆంధ్ర



# కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను అమలు చేయాలి.

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప,జూలై 21(విజన్ ఆంధ్ర) ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో పనిచేసే కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ పనుల్లో కార్మికుల వేతనాలు, స్థానికులకు ఉపాధి కల్పన, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ఆయన సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టే అన్ని రకాల అభివృద్ధి పనుల్లో వీలైనంత వరకు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కార్మికుల ఎంపికలో పారదర్శకత పాటించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాల కంటే తక్కువ చెల్లించకుండా సంబంధిత అధికారులు కచ్చితంగా పర్యవేక్షించాలని స్పష్టంచేశారుసమావేశంలో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఎన్.ఎం.ఆర్., కాంటింజెంట్, దినసరి కార్మికుల కనీస వేతనాల సవరణపై సమీక్షించారు. నైపుణ్యం లేని (అన్‌స్కిల్డ్) కార్మికులకు గ్రామ పంచాయతీల్లో రోజుకు రూ.560, మున్సిపల్ పరిధిలో రూ.583, మిగిలిన ప్రాంతాల్లో రూ.605 చెల్లించాలని నిర్ణయించిన విషయాన్ని అధికారులు వివరించారు.అలాగే పాక్షిక నైపుణ్యం (సెమీ స్కిల్డ్) గల కార్మికులకు గ్రామ పంచాయతీల్లో రూ.611, మున్సిపల్ పరిధిలో రూ.635, ఇతర ప్రాంతాల్లో రూ.659 రోజువారీ వేతనం చెల్లించాలని, నైపుణ్యం కలిగిన (స్కిల్డ్) కార్మికులకు గ్రామ పంచాయతీల్లో రూ.669, మున్సిపల్ పరిధిలో రూ.695, ఇతర ప్రాంతాల్లో రూ.721 రోజువారీ వేతనాలు అమలులో ఉన్నాయని సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ ఉత్తర్వులను అన్ని శాఖలు ఖచ్చితంగా అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షించేలా అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్మికులకు నిర్ణయించిన వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప కార్మిక కమీషనర్ ఏ. టి. శ్రీనివాసులు, సంబంధిత శాఖల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో "శ్రీ సుదర్శన యాగం"

**-హాజరైన పాలకమండలి సభ్యులు, భక్తులు**



సరూర్ నగర్ జూలై 21 (విజన్ ఆంధ్ర): భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా కొలువుదీరినటువంటి వాసవికాలనీలోని శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయంలో మంగళవారం ఉదయం శ్రీ సుదర్శన యాగం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్చారణలతో కన్నుల పండుగ సాగింది. ఆలయంలో మంగళవారం తెల్లవారుజామునుండే ప్రత్యేక పూజలతో పాటు యాగంలో పాలుపంచుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలకమండలి సభ్యులు కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాటు చేశారు. ఆలయ పాలకమండలి సభ్యుల పర్యవేక్షణలతో ప్రారంభమైనటువంటి శ్రీ సుదర్శన యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, సిబ్బంది భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సిర్పూర్ నియోజకవర్గం లో టిఆర్ఎస్ జండా ఎగరవేస్తాం

**- కవేటి సబితా మనోహర్‌కు ఘన విజయం ఖాయం...**

**- జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ కిరిమిల్ల వినోద్ చారి...**



కాగజ్ నగర్ జులై 21 (విజన్ ఆంధ్ర) కొమరం భీం జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో టీఆర్ఎస్ పార్టీ తరపున సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కవేటి సబితా మనోహర్‌ను అధికారికంగా ప్రకటించిన సందర్భంగా కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ కిరిమిల్ల వినోద్ చారి ఆమెను జిల్లా పార్టీ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కిరిమిల్ల వినోద్ చారి మాట్లాడుతూ, సిర్పూర్ నియోజకవర్గానికి కవేటి సబితా మనోహర్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడం పార్టీ తీసుకున్న సముచిత నిర్ణయమని పేర్కొన్నారు. ఆమె నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేస్తారని చెప్పారు.పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సిర్పూర్ నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీ విజయకేతనం ఎగరవేసి, కవేటి సబితా మనోహర్‌ను ఘన మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి చేరుకుని పార్టీ సిద్ధాంతాలు, అభ్యర్థి సేవలను ప్రజలకు వివరించి విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కవేటి సబితా మనోహర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థుల అభ్యసన నైపుణ్యాల పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలి

**- జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



ఆదిలాబాద్, జులై 21 (విజన్ ఆంధ్ర): విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, తరగతి గదుల్లో వారిని క్రియాశీలకంగా ఉంచేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో తెలుగు లెక్చరర్లకు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు సబ్జెక్టులపై పూర్తి స్పష్టత వచ్చేలా బోధనా పద్ధతులలో మార్పులు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు కూడా సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన సాగాలని, అందుకు అనుగుణంగా అధ్యాపకులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. కళాశాలల్లో నూతన పాఠ్యపుస్తకాల లభ్యతను పరిశీలించి, ఎక్కడైనా పుస్తకాల కొరత ఉంటే వెంటనే ప్రిన్సిపాల్, డీఐఈఓ ల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను నివారించాలని ఆదేశించారు. డిజిటల్ బోధనకు ప్రాధాన్యత ఇస్తూ తరగతుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వినియోగాన్ని పెంచాలని, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా లభించే విద్యా విషయాలను తరగతి గదుల్లో ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని నిరంతరం అంచనా వేసేందుకు ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు తొలుత సులువైన ప్రశ్నలు, ఆ తర్వాత మధ్యస్థ, కఠినమైన ప్రశ్నలతో సాధన చేయించాలని అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం, ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న అధ్యాపకులకు కలెక్టర్ చేతుల మీదుగా 'సర్టిఫికెట్ ఆఫ్ పార్టిసిపేషన్' పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్, ఇతర అధికారులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితుల్లో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి



నల్లబెల్లి: జులై 21,విజన్ ఆంధ్ర; ప్రస్తుత వానకాలంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని నల్లబెల్లి మండల వ్యవసాయ అధికారి బన్న రజిత సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని అధిక నీటి అవసరమయ్యే వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వరి, మొక్కజొన్న, పత్తి, ఎండుమిర్చి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటల సాగును తగ్గించి, తక్కువ నీటితో మంచి దిగుబడులు ఇచ్చే పప్పుధాన్యాలు (కంది, పెసర, మినుము), నూనెగింజల పంటలు (వేరుశనగ, నువ్వులు, ఆముదం), చిరుధాన్యాలు (జొన్నలు, సజ్జలు, రాగులు) వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే రైతులు నేలలో తేమను సంరక్షించేందుకు కలుపు నివారణ, మల్చింగ్, వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనించి వ్యవసాయ పనులు నిర్వహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తే సాగు వ్యయం తగ్గి, స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.రైతుల క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారుల సలహాలు తీసుకొని పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. దీంతో వర్షాభావం వల్ల కలిగే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులకి అవగాహన కోసం ప్రతీ గ్రామ పంచాయతీలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.నల్లబెల్లి రైతు వేదికలో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కరపత్రాన్ని విడుదల చేశారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల దృష్ట్యా రైతులు సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని కరపత్రం ద్వారా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లు రంజిత్ కుమార్, శివకుమార్, విశ్వభాను, రాకేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చదువు వచ్చింది... సంస్కారం ఏమైంది?

**- ట్రైని ఐపీఎస్ అధికారుల వ్యవహార వివాదం**

**- ఖాకీకి మచ్చ - సమాజంలో ఆగ్రహం**

**- ఉన్నత చదువులు చదివిన వారే నిబంధనలు ఉల్లంఘన..**

**- అధికార మదంతో ప్రవర్తన...**

**- యువతకు ఏం ఆదర్శం?**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జులై 21 (విజన్ ఆంధ్ర): "చదువుకుంటే బాగుపడతావు" అని మనం చెప్తాం. కానీ ఈ రోజు చదువు ఉంది కానీ సంస్కారం లేదు అనే చేదు నిజం కనిపిస్తోంది. ముఖ్యంగా ట్రైని ఐపీఎస్ అధికారుల ప్రవర్తన పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**ట్రైని IPS అధికారుల వ్యవహారం**

ఇటీవల ట్రైని ఐపీఎస్ అధికారుల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇంకా శిక్షణలోనే ఉండి, పూర్తి అధికారాలు రాకముందే అధికార మదంతో ప్రవర్తించడం, నిబంధనలను ఉల్లంఘించడం,ట్రైని మహిళా అధికారిని వేదించడం వంటి సంఘటనలతో చదువు పట్ల సంస్కారం లేకుంటే ఎలా అంటూ ప్రజలు మండిపడుతున్నారు. ట్రైని అధికారులే ఇలా ఉంటే రేపు పూర్తి బాధ్యతలు వచ్చిన తర్వాత ఏం చేస్తారో అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. "ఖాకీకి ఉన్న గౌరవాన్ని సొంత చేతులతో పాడు చేస్తున్నారు" అనే కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ట్రైని అధికారులే వివాదాల్లో చిక్కుకోవడంతో " ఐపీఎస్ శిక్షణలో ఏం నేర్పిస్తున్నారు?" అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

**ఉన్నత చదువులు... కానీ నైతికత శూన్యం**

యూపిఎస్సి ర్యాంకులు, పెద్ద పెద్ద డిగ్రీలు, గొప్ప స్థాయి ఉద్యోగం. కానీ మానవత్వం, నీతి, బాధ్యత మాత్రం మిస్సింగ్. ఉన్నత చదువులు చదివిన వారే తప్పులు చేస్తే నేటి యువతకు మనం ఏం నేర్పుతున్నట్టు? "ఎలాగైనా పైకి రావాలి" అనే పోటీలో "మంచిగా బతకాలి" అనే పాఠం మర్చిపోతున్నాం.

**అధికారులే తప్పు చేస్తే సరిదిద్దేదెవరు?**

సమాజంలో తప్పు జరిగితే దాన్ని సరిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ పూర్తిగా తీసుకోవాల్సిన అధికారులే తప్పులు చేస్తుంటే మరి ప్రశ్నించేదెవరు? ఫైళ్లలో లంచం, కుర్చీలో అహం, నోటిలో అబద్ధం. ఒకరిని ఒకరు




దుర్భషాలాడటం, వేదించడం ఇదేనా మనం ఆశించే పాలన? సమాజానికి వెళ్తున్న తప్పుడు మెసేజ్ ఈ రోజు యువత చూస్తున్నది ఇదే."పెద్ద చదువు చదివితే ఏం చేసినా చెల్లుతుంది" అనే సంకేతం. డిగ్రీ సర్టిఫికెట్ చేతిలో ఉంది కానీ, గుండెల్లో విలువలు లేవు.పదవి ఉంది కానీ ప్రజాసేవ అనే భావం లేదు. అబ్దుల్ కలాం,కిరణ్ బేడీ లాంటి అధికారులు ఆదర్శం కావాలి. కానీ ఇప్పుడు వార్తల్లో నిలుస్తున్నది వివాదాలు మాత్రమే. చదువు మనిషిని తెలివైనవాడిని చేస్తుంది. కానీ సంస్కారం మాత్రమే మనిషిని మంచివాడిని చేస్తుంది. కొన్ని ఘటనలు మళ్లీ జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, శిక్షణా సంస్థలపై ఉంది. యువతకు చదువుతోపాటు సమాజ విలువలు ఇవ్వకపోతే రేపు "చదువుకున్న రాక్షసులు" సమాజాన్ని నడిపే ప్రమాదం ఉంది....

**- కార్వంగ ఆనంద్ గౌడ్**

**విజన్ ఆంధ్ర ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో...**

# ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ బిఎల్ఎ తో సమావేశం

**- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉత్తనూర్ జయన్న**



అయిజ జూలై 21 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఉత్తనూర్ జయన్న ఎస్ఐఆర్ పై బిఎల్ఎ తో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ బింగిదొడ్డి దొడ్డప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమంలో ప్రతి బిఎల్ఏ తన బూత్ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణలు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు.ప్రతి బూత్‌లో ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో బిఎల్ఏ.ల పాత్ర ఎంతో కీలకమైనదని, ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేసి, మన బూత్‌ను ఆదర్శ బూత్‌గా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల కాంగ్రెస్ సీనియర్ నాయకులు,బిఎల్ఏ. లు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి రాజగోపుర నిర్మాణానికి భూసార పరీక్షలు ప్రారంభం



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 21 ( విజన్ ఆంధ్ర ) : చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో మహా పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళీ దేవస్థానానికి నాలుగు వైపులా మాడవీధుల నిర్మాణం జరిపే క్రమంలో అమ్మవారి ఆలయానికి పూర్వ పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిశలలో నాలుగు రాజగోపురాలు నిర్మాణం చేయడానికి ధర్మకర్తల మండలి నిర్ణయం మేరకు ప్రభుత్వం అంగీకరించి సదరు నిర్మాణమునకు గత సంవత్సరం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మరియు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి చే శంకుస్థాపన కూడా జరిగింది. ఈ సందర్భంగా ఆలయానికి పశ్చిమం వైపున మరియు తూర్పు వైపున దేశంలోనే అత్యంత ఎత్తయిన (9 అంతస్తుల) రాజగోపురం, తూర్పు దిశలో ఏడు అంతస్తుల రాజగోపురాన్ని కాకతీయ శైలిలో నిర్మాణం చేయడానికి ప్లాన్లు మరియు ఎస్టిమేట్లు చేయబడ్డాయి. ఈ నిర్మాణానికి నిర్దేశించిన భూమి యొక్క ధృడత్వాన్ని పరిశీలించడానికి సాయిల్ టెస్ట్ చేయడానికి లిఅంజీ జియో సొల్యూషన్స్, హైదరాబాదువారికి ఇట్టి బాధ్యతలు అప్పగిం చుట జరిగినది. వారు ఈ రోజు ఆలయ ప్రాంగణంలో కార్యాచరణ ప్రారంభించారు. ప్రతి 1.5 మీటరు లోతులో మట్టిని సేకరించి సాయిల్ టెస్ట్ జరుపుతారు. సదరు రిపోర్టు ప్రకారం రాజగోపురానికి వేయవలసిన పునాది ప్రమాణాలను నిర్ణయిస్తారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ ఇంజనీరిగింగ్ సెల్ కు చెందిన ఎడ్ల శివశంకర్ సహాయ స్తపతి , ఆలయ పర్యవేక్షకులు కూచన హరినాథ్, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని అంజీ జియో సొల్యూషన్స్, హైదరాబాదుకు చెందిన సాంకేతిక నిపుణులు తెలిపారు

## సన్న వడ్ల కుంభకోణం గతంలో జరిగిందేమో

**- ఈ ప్రభుత్వంలో అలాంటిదేమీ జరగలేదు**

**- హరీష్ రావు తదితరుల విమర్శలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్**

హైదరాబాద్,జూలై21 : ఈ ప్రభుత్వంలో సన్న వడ్ల కుంభకోణం అనేది అవాస్తవమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మీడియా – సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. కొందరు కావాలని సన్న వడ్ల కుంభకోణం అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఈ కుంభకోణం జరిగి ఉండవచ్చని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. ధరలు పెంచి టెండర్ కోడ్ చేస్తే.. ఎవ్వరూ ముందుకు రాలేదని అన్నారు. అందుకే మళ్ళీ పిలిచారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదలలో ఎక్స్‌పర్ట్ అయితే.. హరీశ్ రావును మంత్రి పదవి నుంచి కేసీఆర్ ఎందుకు తొలగించారంటూ ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ముందు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావుకు సూచించారు. దేవాదులలో 7 పంపులు నడుస్తున్నాయని.. నేడు మరో రెండు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రూ.14 వందల కోట్ల సంగతి ఏమిటో ముందు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## కల్వకుర్తిలో కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిని కలిసిన విజన్ ఆంధ్ర బృందం...

**- 91వ విశ్వశాంతి మహాయాగం వివరాలు తెలుసుకున్న బ్యూరో...**

**- శుక్రవారం యాగంలో పాల్గొనాలని స్వామీజీ ఆహ్వానం...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో జులై 21 (విజన్ ఆంధ్ర): కల్వకుర్తి పట్టణానికి విచ్చేసిన కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిని విజన్ ఆంధ్ర ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో ఆనంద్ గౌడ్, సారిక దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామివారు తలపెట్టిన 91వ విశ్వశాంతి మహాయాగం గురించి అడిగి తెలుసుకున్నారు. యాగం ఏ రోజుల్లో జరుగుతుందో, దాని విశిష్టత, సంకల్పం గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. స్వామిజీ మాట్లాడుతూ ప్రపంచ శాంతి, దేశ సుభిక్షత కోసం ఈ మహాయాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం రోజు దంపతులు యాగంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆనంద్ గౌడ్ దంపతులను ఆహ్వానించారు. స్వామివారి ఆధ్యాత్మిక



సందేశాన్ని స్వీకరించిన అనంతరం బ్యూరో సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.వారితో పాటు విజన్ ఆంధ్ర కిషోర్, భాను,రవి,రాజు, శేఖర్ తదితరులు ఉన్నారు.

# నిరుపేదలను ఆదుకునే కాంగ్రెస్ ప్రభుత్వం



నారాయణపేట , జూలై 21 ( విజన్ ఆంధ్ర) : నిరుపేదలను ఆదుకునే కాంగ్రెస్ ప్రభుత్వమని నారాయణపేట మండల పార్టీ అధ్యక్షులు కోట్ల రవికుమార్ రెడ్డి మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి లు అన్నారు. మంగళవారం జాజాపూర్ గ్రామంలోని రైతు వేదిక భవనంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులతోపాటు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలను గత ప్రభుత్వాలు ఆదుకోవడంలో ఎంతో నిర్లక్ష్యం వహించారని దీంతో తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేద ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వారికి కల్యాణ లక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయం అందజేస్తుందని అన్నారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి సమస్యలను పరిష్కరించే దిశగా ఆయన చర్యలు చేపడుతున్నారని దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేవునిలా భావిస్తున్నారని వారన్నారు అదేవిధంగా నిరుపేదలు నివాసముండేందుకు ఇందిరమ్మ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలను సొంత ఇంటి కలను నెరవేర్చిన ఘనత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కిందని వారు పిలుపునిచ్చారు.రాబోయే రోజుల్లో కూడా నిరుపేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టేందుకే ఆయన కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాజాపూర్ గ్రామ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అనార్‌పల్లి వాగుపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తా -ఆత్రం సుగుణక్క..



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 21.( విజన్ ఆంధ్ర) : కెరమెరి: కెరమెరి మండలంలోని అనార్‌పల్లి వాగుపై శాశ్వత వంతెన నిర్మించాలని స్థానిక గ్రామస్తులు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు సోమవారం విన్నవించారు.ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి వాగును ప్రత్యక్షంగా పరిశీలించారు.గ్రామస్తులు మాట్లాడుతూ..వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో అనార్‌పల్లి, పరిసర గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు, రైతులు, అత్యవసర వైద్య సేవలు పొందాల్సిన రోగులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనిసుగుణక్క దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ..ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్కకు ఈ సమస్యను వివరించి, అనార్‌పల్లి వాగుపై శాశ్వత వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


# నవధాన్యాల సాగువలన కలిగి ప్రయోజనాలపై అవగాహన



బద్వేలు జూలై 21 (విజన్ ఆంధ్ర) బద్వేలో మండలం, రాజుపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన పి ఎం డి ఎస్ ఫీల్డ్ సందర్శించడం జరిగింది యెల్నీనో ప్రభావం వలన రైతులకు పి ఎం డి ఎస్ నవధాన్యాల సాగువలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించడం జరిగింది. ప్రధాన పంట వేసుకోవడానికి ముందుగా ప్రతి రైతు పొలంలో బీడు గా ఉండకుండా ఎం డి ఎస్ సాగు విధానాన్ని అమలు చేయాలని కడప జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్ వి ప్రవీణ్ తెలియజేయడం జరిగింది ఎం డి ఎస్ పథకం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన మెలకువలు, వాతావరణ సమాచారం, నీటి యాజమాన్యం గురించి క్షేత్రస్థాయిలో వివరించారు. జీవామృతం,ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, లాంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పాటించాలని తెలియజేసినారు రైతులు ఈ అవకాశాన్ని పాటించాలని తమ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశ్వర రెడ్డి, నరసింహారెడ్డి, విజయ శేఖర్, గ్రామ రైతులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలి

**- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి.**



ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, జులై 21,(విజన్ ఆంధ్ర) : ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డి జి ట లై జే ష న్ ప్రక్రియలో వేగం పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ మీద రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి,మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో వెనుకబడి ఉన్న జిల్లాలలో ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.జిల్లాల వారిగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రగతి వివరాలు సమీక్షించారు. వారంలోగా అన్ని జిల్లాల ఎస్ఐఆర్ ప్రక్రియ 90 శాతానికి చేరుకోవాలని,వీలైనంత త్వరగా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని చెప్పారు.ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారములో ఆధార్ నంబరు నమోదు చేయడం కేవలం ఐచ్ఛిక మాత్రమే అని, తప్పనిసరి కాదని వివరించారు.కలెక్టర్లంతా ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు.ఈవీడియోకాన్ఫరెన్సులో కలెక్టర్ బి చంద్రశేఖర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ.జె శ్రీనివాస్ జిల్లా రెవెన్యూ అధికారి దశరథ ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**- కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**







గద్వాల జూలై 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై మంగళవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎలక్ట్రోరల్ ఓటర్ జాబితాలో తప్పిదాలకు చోటు లేకుండా పారదర్శకంగా రూపొందించి అర్హులైన ఓటర్ల అందరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. మొదట ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్నుమరేషన్ పత్రాలను ప్రతి ఓటరుకు అందజేసినందున సకాలంలో పూరించి ఇచ్చేలా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలన్నారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం వివిధ మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులతో మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 79.75 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశారని, నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తయ్యేలా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. గద్వాల అర్బన్ లో 61 శాతం మాత్రమే డిజిటలైజేషన్ జరిగిందని, వార్డు అధికారులు, ఇతర వాలంటీర్ల సహకారం తీసుకొని ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ నిబంధనల ప్రకారం ఉండాలన్నారు. వలస వెళ్లిన, మృతి చెందిన, రెండు ఓట్లు కలిగిన ఓటర్ల వివరాలను రీవెరిఫికేషన్ చేసి ఓటరు జాబితాను తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించాలన్నారు. జిల్లా ప్రజావాణికి వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. విసి అనంతరం కలెక్టర్ అధికారులతో వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రతి బుధవారం సంబంధిత శాఖల జిల్లా అధికారులు తమ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్ కు కృషి చేయాలన్నారు. భూభారతి, సాదా బైనామా, తదితర దరఖాస్తులు పెండింగ్ లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. రేషన్ దుకాణాలను తరచూ తనిఖీ చేస్తూ పిడిఎస్ బియ్యం పక్కదారి పెట్టకుండా నిఘా ఉంచాలన్నారు. తహసిల్దార్ లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వివిధ ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం జారీ చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల, చిన్నారుల భద్రతకు పెద్దపీట

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




ఆదిలాబాద్, జులై 21 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ జిల్లాలో మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి రక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా మహిళలను, పాఠశాల విద్యార్థులను వేధిస్తూ షీ టీం ద్వారా పట్టుబడిన 180 మంది ఆకతాయిలకు, వారి కుటుంబ సభ్యులకు మంగళవారం స్థానిక పోలీస్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు, కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. గత ఆరు నెలల కాలంలో జిల్లా వ్యాప్తంగా ఈవ్‌టీజింగ్, మహిళల వేధింపులకు సంబంధించి 230 పెట్టీ కేసులు, 20కి పైగా ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా వేధించడం, పాఠశాలలు మరియు కళాశాలల వద్ద విద్యార్థినులను పిలిచి వేధించడం, ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేయడం, బస్టాప్‌లలో మహిళలను ఇబ్బంది పెట్టడం, పాత విషయాలను ఆధారంగా చేసుకుని బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడటం వంటి చర్యలను సహించేది లేదన్నారు. ఇప్పటివరకు నమోదైన పెట్టీ కేసులను కౌన్సిలింగ్ కోసం చివరి అవకాశంగా భావించాలని, ఇకపై మహిళలు, చిన్నారులను వేధిస్తే నేరుగా ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, చెడు సావాసాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తనతో ఉండేలా వారిని సరైన మార్గంలో నడిపించాలని సూచించారు. ఒకసారి పోలీసు కేసు నమోదు అయితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్పీ అప్రమత్తం చేశారు. కేసు నమోదైన వారికి పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్ లభించదని, దీనివల్ల విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్ట్ రాదని, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కూడా పూర్తిగా కోల్పోతారని స్పష్టం చేశారు. మహిళలకు ఎలాంటి సమస్య వచ్చినా రక్షణగా నిలిచేందుకు పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా ముందుంటుందని హామీ ఇచ్చారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) పి. మౌనిక, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు, ఇన్‌స్పెక్టర్ కె. ఫణీధర్, షీ టీం బృంద సభ్యులు సుశీల, వాణిశ్రీ, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భీమ బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ ఫెస్టివల్



హైదరాబాద్, జూలై 21 (విజన్ ఆంధ్ర) : భారత దేశంలోని ప్రముఖ ఆభరణాల సంస్థ భీమ జ్యువెలర్స్ జూలై 9 నుంచి ఆగస్టు 9 వరకు అన్ని షోరూమ్‌లలో 'భీమ బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ ఫెస్టివల్' నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ మేకింగ్ ఛార్జీలపై 100 శాతం వరకు తగ్గింపు, ప్రతి క్యారెట్ డైమండ్ కొనుగోలుపై రూ.5 వేల క్యాష్‌బ్యాక్, డైమండ్ ఎక్స్ఛేంజ్‌పై అదనంగా రూ.5 వేల అర్హత గల కొనుగోళ్లపై 24 క్యారెట్ల గోల్డ్ బార్తో పాటు బిఎండబ్ల్యూ ఎక్స్-1 కారు గెలుచుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. బ్రైడల్, సాలిటైర్, సమకాలీన, రోజువారీ వినియోగానికి అనువైన ధృవీకరించబడిన డైమండ్ ఆభరణాలు ఈ ఉత్సవంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ఆఫర్లకు నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

# రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలి

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూలై 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వ్యవసాయం, విద్యుత్, వైద్యం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలని అన్నారు.ప్రతి గ్రామంలో కూరగాయల విత్తనాల ప్యాకెట్లను ఉచితంగా అందజేయడం జరిగిందని, రైతులు కూరగాయల సాగుతో పాటు ఆయిల్ పామ్ తోటల సాగు చేసేందుకు సహకరించాలన్నారు. విబిజి రాంజీ పథకంపై అవగాహన కలిగించాలని, వనమహోత్సవంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలను నాటాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణంతోపాటు అవసరమైన చోట బోర్ వెల్స్ రీఛార్జెస్ చేయించాలన్నారు. పైప్ లైన్స్ లీకేజీలతో తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 22న మండల స్థాయిలో, 23 నుంచి గ్రామస్థాయిలో సభలు నిర్వహించి ఈ అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, డిఆర్డిఓ ముషాహిదా బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటనారాయణ, డిపిఓ శ్రీకాంత్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ ఆసుపత్రిలో మరింత మెరుగైన వైద్యసేవలు: జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్, జులై 21(విజన్ ఆంధ్ర): రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా చర్యలు వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం రిమ్స్ ఆస్పత్రిలోని డైరెక్టర్ ఛాంబర్‌లో వివిధ విభాగాల అధిపతులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, విభాగాల వారీగా ఉన్న అవసరాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోగులకు నాణ్యమైన వైద్యం త్వరితగతిన అందించేందుకు వీలుగా వివిధ విభాగాలకు అవసరమైన అత్యవసర వైద్య పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా, ప్రస్తుతం వివిధ విభాగాలకు తక్షణమే కావలసిన వైద్య పరికరాల తుది జాబితాను సిద్ధం చేసినట్లు వివరించారు. ప్రధానంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, యూరాలజీ, ఈఎన్‌టీ, అనస్థీషియా, ఆర్థోపెడిక్స్, డెంటల్, ఆప్తాల్మాలజీ, సైకియాట్రీ, క్యాజువాల్టీ, డయాలిసిస్ విభాగాలకు అవసరమైన ఆధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పరికరాల లభ్యత ద్వారా ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన చికిత్స అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దీపక్ పుష్కర్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 21 ( విజన్ ఆంధ్ర ) రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రవాణా & బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

**వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేయాలి:**

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు.వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.


# వరంగల్‌లో ఉపాధి హామీ పథకం అమలుపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ డా. కడియం కావ్య



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 21 ( విజన్ ఆంధ్ర ) : వరంగల్ జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) అమలు, ఉపాధి కల్పన, వేతనాల చెల్లింపుల స్థితిగతులపై వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఉపాధి కోరిన కుటుంబాలకు ఎంత మేర పని కల్పించారు? సగటున ఎన్ని పనిదినాలు లభించాయి? వేతనాల చెల్లింపుల్లో ఏమైనా బకాయిలు ఉన్నాయా? అనే అంశాలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను ఆమె వివరణ కోరారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాస్వాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, వరంగల్ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కోరిన అర్హ కుటుంబాల్లో 99.99 శాతం మందికి, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 99.97 శాతం మందికి పని కల్పించారు. ఒక్కో కుటుంబానికి సగటున 2024-25లో 41.12 పనిదినాలు, 2025-26లో 27.89 పనిదినాలు లభించాయన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ,లి ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించడంలో వరంగల్ జిల్లా మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రజల సమస్యలను పార్లమెంట్ వేదికగా ప్రస్తావిస్తూ, వారి హక్కులు, సంక్షేమ పథకాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. వేతనాల చెల్లింపుల విషయంలో కూడా వరంగల్ జిల్లాలో ఎలాంటి పెండింగ్ బకాయిలు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడం సానుకూల పరిణామమని కడియం కావ్య పేర్కొన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా కూలీల ఖాతాల్లోకి నేరుగా వేతనాలు జమ కావడం వల్ల పారదర్శకత పెరిగిందన్నారు. భవిష్యత్తులో ఉపాధి కల్పన రోజులను మరింత పెంచడంతో పాటు మహిళలు, బలహీన వర్గాల భాగస్వామ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఆస్తుల సృష్టి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా కోరారు.

# చట్టమా? చుట్టమా? మల్కాపూర్ అక్రమ వెంచర్ కు అధికారుల అండ..

- మల్కాపూర్ వెంచర్ పై అధికారుల మౌనం!
- అనుమతులు లేకుండానే 6 నెలలుగా అక్రమ నిర్మాణాలు
- ప్రజావాణి, ఎమ్మెల్యే ఫిర్యాదులపై కూడా చర్యలు శూన్యం
- 8 ప్లాట్లు అమ్మకాలు..
- పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయమా?...
- జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్...




సంగారెడ్డి బ్యూరో,జూలై 21 (విజన్ ఆంధ్ర): నిబంధనలు అందరికీ సమానంగా ఉండాల్సిన చోట పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం అమలవుతోందా? అనే ప్రశ్నకు తాజాగా మల్కాపూర్ అక్రమ వెంచర్ ఉదంతమే నిదర్శనంగా నిలుస్తోంది. కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ శివారు సర్వే నంబర్ 158/ఈ లో గత 6 నెలలుగా ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అయినా పంచాయతీ అధికారులు మాత్రం కళ్లు మూసుకుని కూర్చోవడం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది.

**అనుమతులు లేకుండానే అమ్మకాలు**

అనుమతి లేకుండానే ఇప్పటికే 8 ప్లాట్లను విక్రయించారు అని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంచర్ లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, ప్రహరీ గోడ, ప్రధాన ద్వారం నిర్మాణం పూర్తయ్యాయి. ప్రస్తుతం ఇండ్ల నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. ఒక ఇంటి నిర్మాణానికి తీసుకున్న పంచాయతీ అనుమతినే మొత్తం వెంచర్ కు వాడుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం పంచాయతీకి ఇవ్వాల్సిన 10% ఓపెన్ ల్యాండ్ కూడా ఇవ్వలేదు.

**ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు**

ఈ అక్రమాలపై ప్రజావాణిలో ఫిర్యాదులు అందాయి. స్థానిక పత్రికల్లో వరుస కథనాలు వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే స్వయంగా జిల్లా కలెక్టర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జూలై 1న జిల్లా పంచాయతీ అధికారి మల్లారెడ్డి స్వయంగా టీమ్ తో వచ్చి తనిఖీ చేసి "అక్రమాలు కొనసాగితే కఠిన చర్యలు" అని హెచ్చరించారు. కానీ ఆ తర్వాత కూడా పనులు యథావిధిగా కొనసాగుతున్నాయి.

**తనిఖీలకే పరిమితం - చర్యలు లేవు**

అధికారులు వచ్చి ఫోటోలు తీసి, నోటీసులు ఇచ్చి వెళ్లడం తప్ప ఒక్క చర్య కూడా లేదు. దీంతో "రాజకీయ ఒత్తిళ్లు, పలుకుబడి" కారణంగానే చర్యలు ఆగాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**స్థానికుల ప్రశ్న:**

"పేదలు చిన్న ఇల్లు కట్టుకుంటే వెంటనే కూల్చేస్తారు. మరి ఇంత పెద్ద వెంచర్ 6 నెలలుగా అక్రమంగా నడుస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు?"అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రభుత్వానికి నష్టం**

అనుమతులు లేకుండా వెంచర్లు రావడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, లేఅవుట్ ఛార్జీలు కోల్పోతున్నాయి. ఒక అక్రమాన్ని ఉపేక్షిస్తే మరిన్ని అక్రమాలకు ఆస్కారం ఇచ్చినట్లే అవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

"అక్రమం ఒక్కటే కాదు... దానికి మౌనం మరింత ప్రమాదం"

చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే మౌనంగా ఉంటే వ్యవస్థపై ప్రజల విశ్వాసం పోతుంది. "తనిఖీలతో సరిపెడతారా? లేక చట్టం ముందు అందరూ సమానమే అని నిరూపిస్తారా?" అనే ప్రశ్నకు జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది...

# కాటారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



భూపాలపల్లి జిల్లా: 21 జూలై (విజన్ ఆంధ్ర) : భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గ ఆదేశాల మేరకు జిల్లా షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ ఆధ్వర్యంలో కాటారం మండలంలోని మోడల్ స్కూల్లో విద్యార్థినుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళలపై వేధింపులు, స్ట్రీట్ హరాస్మెంట్, వ్యక్తిగత భద్రత, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు తమ కోసం పడుతున్న కష్టాన్ని గుర్తించి బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని తెలిపారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, మహిళలపై ఎలాంటి వేధింపులు జరిగినా వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 సేవలను వినియోగించుకోవాలని, సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని వివరించారు.

# బ్రహ్మ సాగర్ నీటిని విడుదల చేసిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా, బద్వేలు టిడిపి ఇంచార్జ్ మంచూరి



బద్వేలు,జూలై 21: (విజన్ ఆంధ్ర)బద్వేలు నియోజకవర్గం వరప్రసాధిని అయిన బి.మఠం మండలం పరిధిలోని బ్రహ్మ సాగర్ ఎడమ కాలువ గేట్‌ను మంగళవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్,బద్వేలు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్& ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఎడమ కాలువ గేటు ను ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, కాలవ ద్వారా నీటి విడుదల చేయడంతో బద్వేలు నియోజకవర్గంలోని అన్ని మండల ప్రాంతాల రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడి పంటలు సమృద్ధిగా పండుతాయని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. రైతులు విడుదలైన నీటిని సమర్థవంతంగా వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేకులపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



గద్వాల జూలై 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల మండలం రేకులపల్లి గ్రామం లోని ప్రాథమిక పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి విద్య సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, ఆహార నాణ్యత తదితర అంశాలపై స్వయంగా వివరాలు, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యత, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాల సాధనపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత ప్రమాణాలతో బోధన నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యతో పాటు క్రీడలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వంద శాతం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని కమ్యూనిటీ సోక్ పిట్, విఓఎ భవన నిర్మాణపు పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల ఎంపీడీవో శైలజ, గ్రామ సర్పంచ్ సత్యమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- ప్రతి బీఎల్‌వో రోజుకు కనీసం 100 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేయాలి
- ఓటరు జాబితాకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి
- 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్ల పై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి






సూర్యాపేట జూలై 21:(విజన్ ఆంధ్ర) : ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో అందుబాటులో ఉన్న సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) రోజుకు కనీసం 100 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. జూలై 15వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 లక్షల ఓటర్ల వివరాలు డిజిటలైజ్ కాగా, గత ఏడు రోజుల్లో కేవలం 22 లక్షల వివరాలు మాత్రమే డిజిటలైజ్ అయ్యాయని, ఈ పురోగతి ఆశించిన స్థాయిలో లేదన్నారు. వచ్చే సమీక్షా సమావేశం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలనే లక్ష్యంతో అన్ని జిల్లాలు పనిచేయాలని ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో డిజిటలైజేషన్ పురోగతి చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి, వచ్చే వారం గరిష్ఠ స్థాయిలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఓటరు జాబితా వివరాలను ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తున్నారనే వదంతులను జిల్లా యంత్రాంగం వెంటనే ఖండించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంలో ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికం మాత్రమేనని, బీఎల్‌వోలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆధార్ నంబర్ ఇవ్వాలని ఓటర్లపై ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు.ఆన్‌లైన్‌లో ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారం సమర్పించిన ఓటర్లను మళ్లీ ఆఫ్‌లైన్ ఫారం ఇవ్వాలని కోరడం అవసరం లేదన్నారు. కొన్ని పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొంటూ, ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా బీఎల్‌వోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారం నింపడంలో ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని, ఈ ప్రక్రియపై రూపొందించిన అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు.కొంతమంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదని, మరికొందరి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడ్డాయని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అలాగే జీవించి ఉన్న కొంతమంది ఓటర్లను మరణించిన వారిగా నమోదు చేసిన ఘటనలు కూడా వెలుగుచూస్తున్నాయని, ఇలాంటి పొరపాట్లను వెంటనే గుర్తించి సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరూ తమ మొబైల్ నంబర్లను సంబంధిత వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నవీకరించుకోవాలని సూచించారు.50 శాతం కంటే తక్కువ డిజిటలైజేషన్ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ ప్రేమ్ రాజ్, సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ ఆర్డీఓ,లు, వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, సూర్యాపేట తహసీల్దార్ సాయి గౌడ్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజేందర్ రెడ్డి, ఇతర ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రూరల్ పోలీస్ స్టేషన్ నూతన కాంపౌండ్ వాల్, పార్కింగ్ షెడ్ ప్రారంభించిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు



గద్వాల జూలై 21 (విజన్ ఆంధ్ర బ్యూరో): వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి, పోలీసుల సిబ్బంది గౌరవ వందనం స్వీకరించి, పార్కింగ్ షెడ్, న్యూ కాంపౌండ్ వాల్ లను ఇనాగ్రేషన్ చేయడతో పాటు, మెన్ యూనిఫామ్ టర్న్ ఔట్, కిట్ ఆర్టికల్స్, స్టేషన్ రికార్డ్స్, పరిసరాలను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తనిఖీ చేశారు. పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవా భావం, చట్ట పరిరక్షణ అధికారాల సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారెక్స్, స్టేషన్ రికార్డుల మెయింటేనెన్స్ ను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ,కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న/ కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని, ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి, అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్స్ లు గా గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. రిసెప్షన్ సిబ్బంది స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ లో నమోదు చేయాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు, పని ప్రదేశాలలో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు వాహానాల తనిఖీ నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకోవాలని, అనుమానిత వాహనాలను అదుపులోకి తీసుకోవాలని అన్నారు.బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ ను తనిఖీ చేయాలని, డయల్ -100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బంది తో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవా భావం, చట్ట పరిరక్షణ అధికారాల సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని తెలిపారు. పోలీసు సిబ్బంది. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని, ఎవరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించి నప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకు రావచ్చు అన్నారు. ఒకే చోట పని చేస్తున్నప్పుడు ఫ్రెండ్స్ లాగా కలిసి మెలసి ఉండాలని, పాజిటివ్ ఆలోచనలతో పని చేయాలని అన్నారు. ప్రజలు పోలీస్ యూనిఫామ్ కు ఎంతో గౌరవం ఇస్తారో అంతే గౌరవం తో బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. విధులను, పర్సనల్ లైఫ్ ను బాలన్స్ చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. పోలీస్ స్టేషన్, రికార్డుల మెయింటెనెన్స్, సిబ్బంది పనితీరు పై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ , డిఎస్పీ మొక్కలు నాటారు.

# రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు..

- పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య..



సూర్యాపేట జూలై 21:(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని విద్యార్థులకు సూచించారు, ట్రాఫిక్ ఎస్ఐ యాదవెందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు భద్రత పట్ల తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాలని అన్నారు. పోలీస్ కళా బృందం వారు పాటలతో రోడ్డు భద్రత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేంద్ర రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యాదయ్య, వైస్ ప్రిన్సిపల్ వాసు, ప్రసాద్,అధ్యాపక బృందం, పోలీస్ కళాబృందం ఇన్చార్జ్ యల్లయ్య, సభ్యులు గోపయ్య, కృష్ణ, చారి, సత్యం గురులింగం ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్ వాలంటీర్ కమిటీ సమావేశం..



సూర్యాపేట జూలై 21:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ సిటిజన్ వాలంటీర్ కమిటీ సభ్యులతో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, వృద్ధుల భద్రత, స్థానిక సమస్యలపై కమిటీ సభ్యులతో ఇన్స్పెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత వాతావరణాన్ని పెంపొందించడంలో సీనియర్ సిటిజన్ల అనుభవం, సలహాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. పట్టణంలో వృద్ధులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, వారికి పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కాలనీల్లో అపరిచిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం వాలంటీర్లుగా ముందుకొచ్చిన సీనియర్ సిటిజన్లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ గోపికృష్ణ,ఏఎస్ఐ శంకర్,సీనియర్ సిటిజన్ వాలంటీర్ కమిటీ సభ్యులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధనవాడలో వైభవంగా బోనాల పండుగ



నారాయణపేట, జూలై 21 ( విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండలం కేంద్రంలో బోనాల పండుగను అంగరంగ వైభవంగా మంగళవారం నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు ప్రతి ఇంటి నుండి బోనంతో పాటు మేకలను కోళ్లను తీసుకువెళ్లి అమ్మవారి దేవాలయం చుట్టూ ఐదు ప్రత్యక్షణాలు తిరిగి అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు అమ్మవారికి సమర్పించేందుకు మహిళలు తలపై బోనాలు మూసుకుని మహిళలు పూనకాలు చేసుకుంటూ పోతురాజుల విన్యాసాలు ప్రజలకు ఎంతో ఆకట్టుకున్నాయి అనంతరం అమ్మవారికి మేకలను కోళ్లను బలి ఇచ్చి తమ తమ మొక్కలను చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు గ్రామస్తులు మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

# తరతరాల సంస్కృతి... తరిచే గోరింటాకు కాంతి!!

## తల్లిని కోల్పోయిన విద్యార్థినికి హాస్టల్ లో చేర్పించిన యూత్ అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్



చింతలమానేపెల్లి జూలై 21 (విజన్ ఆంధ్ర ). కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ ధరంపల్లి గ్రామంలో అమ్మమ్మ ఇంటివద్ద ఉంటున్న ఓ విద్యార్థిని ఆదే అక్షితకు యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ చొరవతో హాస్టల్ లో వసతి ఏర్పడింది. విద్యార్థిని ఆదే అక్షిత పుట్టిన ఆరు నెలలకి కన్నతల్లి శ్రీదేవి అనారోగ్యంతో మృతి చెందగా తండ్రి మద్యానికి బానిసై కన్న బిడ్డను వదిలేసి ఎక్కడికి పోయాడో ఆచూకీ లేదు ఈ నేపద్యంలో డబ్బా క్రాస్ రోడ్డు వద్ద అమ్మమ్మ ఇంటివద్ద ఉంటున్న చిన్నారి పాపను 5వ తరగతి వరకు ధరంపల్లి ప్రాథమిక పాఠశాలలో చదివించారు తల్లి తండ్రి లేని విద్యార్థిని అక్షిత పై చదువుల కోసం స్థానికులు శ్రీ శివరామసాయి యూత్ వెల్ఫర్ సొసైటీ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ కు సమాచారం అందించారు విషయం తెలుసుకున్న యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ యూత్ సభ్యులతో కలిసి విద్యార్థినిని చదివించేందుకు ముందుకు వచ్చారు మండల విద్యాధికారి సహకారంతో హాస్టల్ లో చేర్పించడంతో పాటు నోట్ బుక్కలు పెన్నులు పెన్సిల్లు ప్యాడ్ అవసరమైన సామగ్రిని అందించి మానవత్వం చాటుకున్నారు ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు కొట్రంగి రాజు వసంత్ రాకేస్ నాగరాజ్ బాలాజీ గ్రామస్థులు ధోని శంకర్ బొగ్గుల సంతోష్ రమేష్ నక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు ఉచితమే కానీ- వృధా పనికిరాదు !

**- పట్టించుకునే నాధుడు లేక పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు**

**-ఇది విద్యుత్ శాఖ నిర్లక్ష్య పనితీరు కు నిదర్శనం?**

**- పొంచి ఉన్న ప్రమాదం ...**



కామారెడ్డి బ్యూరో జూలై 21 (విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లాలో చాలా కాలంగా పట్టపగలే వీధి దీపాలు జిగేలుమని దర్శనమిస్తున్నాయి. విద్యుత్తును వృధాగా ఖర్చు చేస్తే, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్న విషయం విద్యుత్ శాఖ అధికారులకు తెలియదా? రోజులుగా నిరంతరంగా విద్యుత్ దీపాలు వెలుగుతుంటే విద్యుత్ శాఖ అధికారులు ఉన్నార? అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లిన కిందిస్థాయి అధికారులపై తగిన చర్యలు తీసుకోకపోవడం బాధ్యతరాహిత్యం గా వ్యవహరిస్తున్న తీరుపట్ల గ్రామస్తులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం పొంచి ఉన్న విద్యుత్తు శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి తో పట్టించుకోకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు?

## ఎంపీపీఎస్ చౌటకూర్ పాఠశాలలో ప్రమాదకర చెట్ల కొమ్మల తొలగింపు

***విజన్ ఆంధ్ర స్పెషల్ న్యూస్ కథనం అధికారులు వెంటనే స్పందించిన***




చౌటకూర్, జూలై 21 (విజన్ ఆంధ్ర): చౌటకూర్ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ చౌటకూర్ పాఠశాల ఆవరణలో విద్యుత్ తీగలను తాకుతూ ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను సంబంధిత అధికారులు తొలగించారు. ఇటీవల విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలడంతో వర్షాకాలంలో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పాఠశాల సిబ్బంది, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు వెంటనే స్పందించి చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాదాన్ని నివారించారు. ఈ చర్యతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల పరిసరాల్లో ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే తొలగించి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరారు.




## నిబంధనలకు విరుద్ధంగా ఉర్దూ నమాజ్ నేర్పిస్తున్నారని పాఠశాల గుర్తింపు రద్దు సీజ్.



, ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా జూలై 21 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ డివిజన్ మున్సిపల్ పట్టణ కేంద్ర పరిధిలోని పెర్కిట్లో ఉన్న భవిష్యదర్శిని పాఠశాలలో నిబదలకు విరుద్ధంగా ఉర్దూ నమాజ్ బోధిస్తున్నట్లు గుర్తించిన విద్యాశాఖ అధికారులు తేదీ 20 జూలై రోజున అనగా సోమవారం ఆ స్కూల్ గుర్తింపును రద్దుచేసి సీజ్ చేశారు నష్ట నివారణ చర్యలు అధికారులు చేపట్టిన ముఖ్యమైన అంశాలు సీజింగ్ ఉత్తర్వులు ఆర్సి నెంబర్ 1493 ప్రకారం ఇంచార్జ్ ఎంఈఓ రాజ గంగారం అసిస్టెంట్ కమిషనర్ .బాలాజీ నేతృత్వంలో పోలీసు బందోబస్తు మధ్య పాఠశాలను సీజ్ ,చేశారు విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని నర్సరీ నుంచి ఏడవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యాసంస్థలు నష్టపోకుండా ఉండేందుకు ప్రత్యయమంగా ఏర్పాట్లు చేశారు పాఠశాలల విద్యార్థులను పెర్కిట్ లోని జెడ్పి స్కూల్ ప్రైమరీ స్కూల్ లేదా కోటార్మూర్ ప్రైమరీ స్కూళ్ల తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన వాగ్దేవి కాంతి శ్రీవిద్య నికేతన్ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అధికారులు సూచించారు.

## ప్రమాదవశాత్తూ ఆటోపై నుండి పడి బాలుడు మృతి



మల్దకల్ జులై 21 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పాల్వాయి గ్రామనికి చెందిన ఒక ఆటో మల్దకల్ పశువుల సంతకని బయలుదేరగా అదే గ్రామానికి (పాల్వాయి)చెందిన రంగముని అనే బాలుడు ఆటో పైన ఎక్కి కుర్చున్నాడు.కగా పెద్దపల్లి సమీపంలో ఆటో డ్రైవర్ బ్రేక్ తొక్కడంతో ఆటోపైన ఉన్న బాలుడు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు..ఘటన స్థలానికి మల్దకల్ పోలీసులు చేరుకుని బాలుడి మృతదేహన్ని పంచనామా నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు..కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మల్దకల్ ఎస్ శ్రీహరి తెలిపారు.

---

**- చేతులకు ఎరుపు రంగుల అందం**
**- ఆరోగ్యాన్నిచ్చే గోరింటాకు చందం**
**- ఆషాఢ మాసంలో ఆనందాల ఎరుపు వర్ణం**
**- తెలుగువారి ఇళ్లలో గోరింటాకు పండుగ**

**కాలాలు మారుతున్నా, ఆధునికత పెరుగుతున్నా తరతరాల నాటి గోరింటాకు ఆచారం తన ప్రాముఖ్యతను కోల్పోలేదు. తరతరాల సాంప్రదాయానికి, ఆరోగ్య సూత్రాలకు నిదర్శనంగా నిలుస్తున్న గోరింటాకు సంస్కృతిని తెలిపే "విజన్ ఆంధ్ర" "ప్రత్యేక కథనం".**




**హైదరాబాద్, జూలై 21:** తెలుగువారి సంస్కృతిలో ప్రత్యేక స్థానం. ఆషాఢం వచ్చిందంటే... మురిసే గోరింటాకు పల్లె నుంచి పట్నం వరకు ఇళ్లలో పండుగ వాతావరణం కనిపిస్తుంది. విశేషించి, వర్షాకాలం ఆరంభంలో ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం తెలుగువారి బహుళ ప్రచారంలో ఉన్న ఒక విశిష్ట సాంప్రదాయం. కేవలం ఒక అలంకారంగానే కాకుండా, ఆరోగ్యం, సౌందర్యాల కలయికగా గోరింటాకు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది.

**సంస్కృతి - సంప్రదాయం**

మన సంస్కృతిలో శుభకార్యాలు, పండుగలు అనగానే ముందుగా గుర్తుకువచ్చేది గోరింటాకు. పెళ్లిళ్లలో "మెహందీ" వేడుకకు ప్రత్యేక స్థానం ఉండగా, ఆషాఢంలో గోరింటాకు ధరించడం వెనుక ఒక ప్రత్యేకమైన ఆచారం ఉంది. ఆషాఢ మాసంలో ముత్తైదువులు, నవవధువులు, చిన్నపిల్లలు చేతులకు గోరింటాకు పెట్టుకుని ఆనందిస్తారు. గోరింటాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచి భర్త వస్తాడని లేదా భర్త ప్రేమానురాగాలు అంత ఎక్కువగా ఉంటాయని పల్లెల్లో సరదా నమ్మకం.

**ఆరోగ్య ప్రయోజనాలు**

**సైన్స్ ఏమంటోంది?**

గోరింటాకు పెట్టుకోవడం వెనుక కేవలం ఆచారమే కాదు, అద్భుతమైన ఆరోగ్య సూత్రాలు (ఆయుర్వేద విజ్ఞానం) కూడా ఉన్నాయి:

శరీరానికి చలువలి వర్షాకాలంలో వాతావరణం మారి, శరీరంలో వేడి పెరుగుతుంది. గోరింటాకులో ఉండే శీతల గుణాలు శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, చలువ చేస్తాయి.

క్రిమిసంహారిణి వర్షాకాలంలో నీళ్ల వల్ల చేతులు, కాళ్ల గోళ్ల సంధుల వద్ద పిప్పి గోళ్లు కావడం లేదా ఇన్ఫెక్షన్లు రావడం సహజం. గోరింటాకులో ఉండే ప్రకృతిసిద్ధమైన యాంటీసెప్టిక్ గుణాలు ఈ క్రిముల బారి నుంచి కాపాడతాయి.



మానసిక ప్రశాంతత: ముదురు ఎరుపు/గోధుమ రంగులోకి మారిన గోరింటాకు డిజైన్లు చూడగానే మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని, ప్రశాంతతను ఇస్తాయి.



**సహజసిద్ధమైనదే మేలు!**

ప్రస్తుత ఆధునిక కాలంలో ఇన్స్టంట్ మెహందీ కోన్లు, రసాయనాలు కలిపిన కోన్లు మార్కెట్లో లభిస్తున్నాయి. అయితే, ఇవి చర్మానికి అలర్జీలు లేదా ఇన్ఫెక్షన్లు తెచ్చే ప్రమాదం ఉన్నందున, పాతకాలం నాటి పద్ధతిలోనే తాజా గోరింటాకు ఆకులను కోసి, కొద్దిగా తమలపాకు లేదా చింతపండు జతచేసి రుబ్బి పెట్టుకోవడమే ఎంతో సురక్షితమని, ఆరోగ్యదాయకమని నిపుణులు సూచిస్తున్నారు.

**ఏమంటారు....నిజమే కదా!**

కాలాలు మారుతున్నా, ఆధునికత పెరుగుతున్నా తరతరాల నాటి గోరింటాకు ఆచారం తన ప్రాముఖ్యతను కోల్పోలేదు. తరతరాల సాంప్రదాయానికి, ఆరోగ్య సూత్రాలకు నిదర్శనంగా నిలుస్తున్న గోరింటాకు సంస్కృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

## సింగరేణిలో మెగా వృక్షారోపణ కార్యక్రమం

**- ఒక్కరోజే 50 వేల మొక్కల నాటకం**




కొత్తగూడెం బ్యూరో, జూలై 22(విజన్ ఆంధ్ర) : కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం సంస్థ వ్యాప్తంగా మెగా వృక్షారోపణ (మెగా ప్లాంటేషన్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. "ఏక్ పేడ్ మా కే నామ్" నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఒక్కరోజే 50 వేల మొక్కలను నాటే లక్ష్యాన్ని అమలు చేశారు. కొత్తగూడెంలోని ఇల్లందు బంగ్లాస్ ప్రాంగణంలో ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (ఈ&ఎం) ఎం. తిరుమలరావు, జీఎం (సీపీపీ) ఏ. మనోహర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఐఏఎస్ ఆదేశాల మేరకు సంస్థ పరిధిలోని ఖాళీ ప్రదేశాలు, ఓపెన్‌కాస్ట్ గనుల ఓవర్‌బర్డెన్ డంపులు, కాలనీల్లో విస్తృత స్థాయిలో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలో కూడా సింగరేణి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా చేపట్టాలని పిలుపునిచ్చారు. హరితీకరణ, గని ప్రాంతాల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, పునరుత్పాదక ఇంధన వినియోగం, కాలుష్య నియంత్రణ చర్యల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సింగరేణి కట్టుబడి పనిచేస్తోందని వివరించారు. అనంతరం ఇల్లందు గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో 200 వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జీఎంలు సీహెచ్. వెంకటరమణ (ఆర్&డి), టి. లక్ష్మీపతి గౌడ్ (ఎస్టేట్), ఎన్. రాఘవేంద్రరావు (సర్వే), సీహెచ్. మురళీధర్ (ఎఫ్&ఏ), ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ విభాగం అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుడి వేధింపులు తాళలేక బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య?

**- పుప్పాలగూడలో విషాదం.. రెండు పేజీల సూసైడ్ నోట్ స్వాధీనం**

గండిపేట, జూలై 21 (విజన్ ఆంధ్రా) : అధ్యాపకుడి అనుచిత వ్యాఖ్యలు, కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థుల వేధింపులు తాళలేక ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం... పుప్పాలగూడకు చెందిన వి.శ్రేయ (20) అనే యువతి వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 19న రాత్రి ఆమె తన నివాసంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు రెండు పేజీల సూసైడ్ నోట్ లభించింది. శ్రేయ చాలా సున్నిత మనస్కురాలని, ఇటీవల (జులై 17న) జరిగిన పరీక్షల సమయంలో ఓ అధ్యాపకుడు ఆమెను ఉద్దేశించి తీవ్రమైన, అవమానకరమైన రీతిలో మాట్లాడారని నోట్‌లో పేర్కొంది. అంతేకాకుండా, కళాశాల సిబ్బందితో పాటు తోటి విద్యార్థులు (పీర్స్) కూడా కొంతకాలంగా ఆమెను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని (పర్సనల్ టార్గెటింగ్) తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసినట్లు తెలిసింది. ఈ తీవ్ర మనస్తాపంతోనే శ్రేయ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై నార్సింగి పోలీసులు క్రిమినల్ కేసు (జతీ. చీశీ. 1366/2026 ఖ/o 194 దీచీూ) నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. బాలిక ఆత్మహత్యకు కారణమైన వారిపై సమగ్ర విచారణ జరిపి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## ఆయిల్ పామ్ సాగుతో రైతుల ఆర్థిక స్థిరత్వం

**- మరో 10 వేల ఎకరాల్లో విస్తరిస్తే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు**

**- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




ములకలపల్లి, జూలై 22(విజన్ ఆంధ్ర) : ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ములకలపల్లి మండలంలో నిర్వహించిన ఆయిల్ పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి ఆయన పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు.మంత్రి మాట్లాడుతూ గిరిజన కుటుంబాల ఆదాయం పెరిగితేనే వారి పిల్లల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గురుకులాలు, ఏకలవ్య పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, ఎల్‌నినో ప్రభావంతో రాబోయే నెలల్లో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. బోర్లపై ఆధారపడి వరి సాగు చేయకుండా పెసర, మినుము, కంది, అలసంద వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పత్తిలో కందిని అంతర పంటగా సాగు చేస్తే అదనపు ఆదాయంతో పాటు భూమి సారం పెరుగుతుందని వివరించారు.ములకలపల్లి మండలంలో ప్రస్తుతం 8 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, మరో 10 వేల ఎకరాలకు విస్తరిస్తే వెంటనే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తామని మంత్రి ప్రకటించారు. పోడు భూముల్లో సౌర విద్యుత్ సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఆయిల్ పామ్‌తో పాటు మునగ, పప్పుధాన్యాలను అంతర పంటలుగా సాగు చేస్తే రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని, మునగ ఆకులకు ప్రపంచ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ప్రతి రైతు ఉపాధి హామీ పథకం ద్వారా తన పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు.సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు గోదావరి జలాలను అందించడమే తన జీవిత లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 90 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, ఈ ఏడాది మరో 15 వేల ఎకరాల్లో విస్తరించే లక్ష్యాన్ని నిర్దేశించామని తెలిపారు.సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, విద్యుత్, పశు సంవర్ధక, మిషన్ భగీరథ తదితర శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని చెప్పారు. వరికి బదులుగా మొక్కజొన్న, మిర్చి, ఆయిల్ పామ్, కూరగాయలు, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.అనంతరం ఆత్మనిర్భర్ మిషన్ అపరాల కార్యక్రమంలో భాగంగా 50 శాతం రాయితీపై కంది, మినుము విత్తనాలను మంత్రి, జిల్లా కలెక్టర్ రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వోక్సెన్ యూనివర్సిటీలో 1,198 మందికి డిగ్రీలు




హైదరాబాద్, జూలై 21 (విజన్ ఆంధ్ర) : వోక్సెన్ విశ్వవిద్యాలయం 6వ స్నాతకోత్సవంలో ఏడు పాఠశాలలకు చెందిన 1,198 మంది అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సోషల్ సైకాలజిస్ట్, క్వీన్స్‌లాండ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎమెరిటస్ డా.రాయ్ ఎఫ్.బౌమీస్టర్ కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఏఐను స్వీకరిస్తూనే ఉత్సుకత, అనుకూలత, దీర్ఘకాలిక ప్రణాళికను పెంపొందించుకోవాలని ఆయన పట్టభద్రులకు సూచించారు. ఈ సందర్భంగా వైస్-ఛాన్సలర్ డా.వి.జె.బైరారెడ్డి వార్షిక నివేదిక-2026ను విడుదల చేశారు. ఇందులో 655కుపైగా పరిశోధన పత్రాలు, ప్రపంచవ్యాప్తంగా 190కుపైగా విశ్వ విద్యాలయాలతో భాగస్వామ్యాలు, కొత్త కోర్సుల ప్రారంభాన్ని వెల్లడించారు. విద్యా ప్రతిభలో అంతతి శివాని, కోరిమి మేఘన, కౌకుంట్ల రిషిత రెడ్డి, శ్రేయసి సార్, కురింజి వి.ఎస్, ఎం.జనని, సోఫియా విల్లమరిన్ రోడ్రిగ్జ్, ఆర్కి తివారీ టాపర్లు, గోల్డ్ మెడలిస్టులుగా నిలిచారు. ప్లేస్‌మెంట్లలో సారా హేజల్ ఫిలిప్, గడ్డం శ్రీకేష్ రెడ్డి, కౌకుంట్ల రిషిత రెడ్డి, పకీరు శ్రీవర్ష, పి.కీర్తి, కె.బి.శివాని అత్యుత్తమ ఉద్యోగాలు సాధించారు.

## ప్రతి ఓటరు ఎస్ఐఆర్ లో భాగస్వామ్యం కావాలి

**- బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్**

**- ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్**

బోడుప్పల్, జూలై 21 (విజన్ ఆంధ్ర): మల్కాజిగిరి నగరపాలక సంస్థ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బోడుప్పల్ డివిజన్ ఈస్ట్ బాలాజీహిల్స్ కాలనీలో బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ నాయక్ కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి పర్యటించి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,ప్రతి అర్హత కలిగిన ఓటరు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) నుంచి ఎన్యుమరేషన్ ఫారాన్ని తీసుకుని పూర్తి వివరాలతో నింపి నిర్ణీత గడువులోగా బోడుప్పల్ సర్కిల్ కార్యాలయం లేదా సమీప హెల్ప్ డెస్క్‌లలో సమర్పించాలని సూచించారు.ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని, ఫారాల సమర్పణలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని వారు కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్కొండయ్య, అంబాల అరవింద్ గౌడ్, రాహుల్, సురేష్,కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు,బీఎల్ఓలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ అభివృద్ధి బిజెపి డబల్ ఇంజన్ సర్కార్ తోనే సాధ్యం..

**- బిజెపి జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి**



గద్వాల జూలై 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు శ్రీ పాద రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డికె. స్నిగ్ధ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం పూర్తిగా అప్పుల్లో కూరుకు పోయిందని, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తప్ప రాష్ట్ర ప్రభుత్వం నిధులు పైసా లేదని అన్నారు.కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడానికి అబద్ధపు హామీలు జూట మాటలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా తీసుకుని చురుకుగా పాల్గొనాలని కోరారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఫల్యాలు, దుష్పరిపాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారు. ఈ రెండు పార్టీల నిర్లక్ష్యం, దూరదృష్టి లేని పాలన కారణంగా తెలంగాణ రాష్ట్రం నష్టపోయిందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు పారదర్శకమైన, అభివృద్ధి కేంద్రితమైన,జవాబుదారీతనంతో కూడిన సుపరిపాలన అందించగల ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీది మాత్రమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ,జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, కౌన్సిలర్ శాలన్న , ఉపసర్పంచ్ ఎర్రభీం రెడ్డి,కెటి దొడ్డి మండల సీనియర్ నాయకులు యార్సన్ దొడ్డి హనుమంతు, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నారాయణపేట జూలై 21( విజన్ ఆంధ్ర) : నారాయణ పేట జిల్లా వ్యాప్తంగా ఎల్ నినో వల్ల రైతులు సరి అయిన సమయంలో వర్షాలు రాక పత్తి, ఆముదం, కంది,పెసర విత్తనాలు మొలువక చాలా నష్టపోయారు కావున తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని సామజిక కార్యకర్త హెచ్. నర్సింహా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఖరీఫ్ లో వర్షాలు కురవకపోవడం వలన ఒక్కొక్క రైతు రెండు, మూడు సార్లు పత్తి, కంది, పెసర, ఆముదం విత్తనాలు నాటి సుమారు ఎకరాకు 15000 నష్టపోయారని తెలిపారు. మొలకలు సరిగ్గా మొలవక పోవడం వలన మొన్న, నిన్న కురిసిన వానలకు జిల్లాలో చాలా గ్రామాలలో పంటలు చెడిపి ఆముదలు, పత్తి పెట్టినట్లు తెలిపారు .ధన్వాడ మండలం కంసాన్ పల్లి రైతు మరాఠి నర్సిములు 5 ఎకరాలు మొదట పత్తి పెడితే సరిగ్గా మొలవకపోవడం వలన చెడిపి నిన్న ఆముదలు పెట్టినట్లు చెప్పారని తెలిపారు. ఈ రైతుకు 45000 వేలు నష్టం వచ్చిందని అన్నారు. అదే గ్రామానికి చెందిన మరొక రైతు వెంకటయ్య 5 ఎకరాలలో పత్తి వేసి సరిగా మొలవక పోవడం వలన మొత్తం చెడిపి మళ్ళీ పత్తి విత్తనాలు పెట్టడం వలన 60000 నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి పేట జిల్లాలోని రైతులు అందరికీ ఉంది కావున వ్యవసాయ అధికారులు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయి రైతులను ఆదుకోవడం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సంవత్సరం పంట పొలాలు చూస్తే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు కావున తెలంగాణ ప్రభుత్వం పేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకొనుటకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నిర్లక్ష్యం వద్దు...ఓటును సురక్షితం చేసుకో




నారాయణపేట, జూలై 21 (విజన్ ఆంధ్ర) : ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ లో నిర్లక్ష్యం వహించకుండా పాల్గొని ప్రతి ఒక్కరు పాల్గొని తమ ఓటును సురక్షితం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు.ప్రజల నిర్లక్ష్యం వల్లే ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ దరఖాస్తు గడువు ఆగస్ట్ 3 వరకు పొడిగించింద న్నారు.అయినప్పటికీ ప్రజలు శ్రద్ధ చూపడం లేదని అన్నారు.శ్రద్ధ చూపి ఎన్యూమరేషన్ దరఖాస్తు చేయకపోతే ఓటు గల్లంతు అవుతుందనిసూచించారు.అలాగే బి ఎల్ ఏ 2లు సహకరించి వేగవంతంవ చేయాలనికోరారు.నారాయణపేట జిల్లా కేంద్రంలో ఇప్పటి వరకు75 శాతం కూడా పూర్తి కాలేదని తెలుస్తోందని అన్నారు. వంద శాతం సర్ ను పూర్తి చేసేందుకు బూత్ ల వారీ గా నియమించిన బిజెపి బి ఎల్ ఓ లు ఫారాలు భర్తీ చేసి సహకరించాలని కోరా రు.రాష్ట్ర పార్టీ అదేశాల మేరకు ఓటర్లు తమ వివరా లను అందజేసేందుకు ఆగస్ట్ 3 వరకు గడువు ఉందని,దీనిపై ఎలాంటి అపోహలు కలగకుండా గడువుకు ముందే సంబంధి త బిఎల్ఓలు, యువత సంబంధిత ప్రజలకు సరైన అవగాహన కల్పించి ఎస్ఐ ఆర్ ప్రక్రియను వందశాతం విజయవంతం చేయాలని కోరారు.

# దౌదర్పల్లి ప్లాట్ల లబ్ధిదారులకు హైకోర్టు ద్వారా న్యాయము.

**- ఉత్తర్వుకాపిని జిల్లా కలెక్టర్ కి అందజేసిన ప్లాట్లు**

**లబ్ధిదారుల ప్రతినిధి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు**



గద్వాల జూలై 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్లో ప్లాట్ల లబ్ధిదారుల ప్రతినిధి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కి దౌదర్పల్లి ప్లాట్ల లబ్ధిదారులకు సంబంధించిన హైకోర్టు ఉత్తరువుకాపిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల పట్టణం దౌదరిపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 968, 969,979,980 983,984 లలో ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్ టి, బీసీ, మైనారిటీ, ఈ డబ్ల్యూ ఎస్ వర్గాల వారికి 2013లో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా పట్టా సర్టిఫికెట్లు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేశారు. లబ్ధిదారులకు పట్టా సర్టిఫికెట్లు ఉన్నప్పటికీ గత ప్రభుత్వం వారికి కేటాయించిన స్థలంలో నర్సింగ్ కళాశాల, ఏరియా ఆసుపత్రి నిర్మాణముల కొరకు కేటాయించారు. బాధితులు 2022 సంవత్సరం లో గౌరవ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా గౌరవ ఉన్నత న్యాయస్థానము బీదల పక్షాన కేసు మొదటి విడతగా తుది తీర్పు డబ్ల్యూ బి నెంబర్ 28 124 అండ్ బ్యాచ్ 20 22. 24,4,26 సంవత్సరము లో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయింపు ఉత్తర్వులు ఇచ్చినారు. అట్టి ఉత్తర్వుకాపిని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కి ఇచ్చామని తెలిపారు. ఇట్టి విషయంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ తప్పనిసరిగా హైకోర్టు ఉత్తర్వులను పరిగణలోకి తీసుకుంటానని చెప్పడం జరిగింది. తరువాయి లబ్ధిదారుల ప్రతినిధి కలెక్టర్ కి డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మొత్తము 615 మంది లబ్ధిదారులు గౌరవ హైకోర్టు నందు కేసు వేయగా మొదటి విడతగా పైన కనబరిచిన ఉత్తర్వులు పోగా మిగిలిన వాటికి కూడా త్వరలో తీర్పు వెలువడనున్నదని, దానికి కూడా కలెక్టర్ స్పందించి అన్ని వచ్చిన తర్వాత డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులు జరుప బడునని హామీ ఇచ్చినారు. వీరితోపాటు ఎస్ పి అచ్చన్న గౌడ్ పాల్గొన్నారు.

# చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



నారాయణపేట, జూలై 21 (విజన్ ఆంధ్ర) : ప్రస్తుత సమాజంలో వివిధ రూపాల్లో జరుగుతున్న చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బంగారం, స్థలాలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, లక్కీ డ్రాలు, విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, సులభంగా లోన్, తక్షణ ఉద్యోగం, లాటరీ గెలుపు వంటి ఆశాజనక మాటలతో ప్రజలను నమ్మబలికి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మి ఎవరూ మోసపోవద్దని హెచ్చరించారు. ఇటీవల కొందరు ఫేక్ డాక్యుమెంట్లు, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించి స్థలాలు, ఇళ్లు అమ్ముతున్నట్లు నటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆస్తుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించి, అధికారిక ధృవీకరణ తీసుకున్న తర్వాతే లావాదేవీలు చేయాలని సూచించారు.అలాగే సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని డబ్బులు అడగడం, ఫేక్ అకౌంట్లతో మోసాలు చేయడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమని చెప్పి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. అపరిచితులపై నమ్మకం ఉంచి ఆర్థిక లావాదేవీలు చేయవద్దని సూచించారు.విద్యార్థులు, యువత ఉద్యోగాల కోసం ప్రయత్నించే సమయంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న సంస్థలను మాత్రమే సంప్రదించాలని, ముందస్తుగా డబ్బులు అడిగే సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. మహిళలు బంగారం, చిట్‌ఫండ్లు, ఆన్‌లైన్ షాపింగ్ వంటి విషయాల్లో ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ఎవరైనా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. చీటింగ్ కేసులపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, మోసగాళ్లను చట్టపరంగా శిక్షిస్తామని తెలిపారు. ప్రజల అప్రమత్తతే మోసాలకు అడ్డుకట్ట వేయగలదు. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదించాలి అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి చర్యలు తీసుకోవాలి..

**- సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సమీక్ష,**

**- సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) జులై 21 : రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం, జాతీయ రహదారులపై భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయడం, సుప్రీంకోర్టు జారీ చేసిన కీలక ఆదేశాలను ప్రతి జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా రాష్ట్ర రోడ్లు, రవాణా మరియు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లాల కలెక్టర్లు, జిల్లాపోలీసు సూపరింటెండెంట్లు (ఎస్పీలు), రవాణా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శకాలను ప్రతి జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా గతంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల వివరాలను, ప్రమాదాలకు ప్రధాన కారణాలను, అధిక ప్రమాద ప్రాంతాలు జరుగుతున్న ప్రాంతాల (బ్లాక్ స్పాట్స్) పైన సమీక్షించారు. ప్రమాదాలు ఎక్కువగా ఎక్కడ, ఏ కారణాలతో జరుగుతున్నాయనే అంశాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పనిచేస్తున్న జిల్లా రోడ్డు భద్రత కమిటీ మరింత పటిష్టంగా పనిచేసేలా చూడాలని, ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేపట్టాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రమాదాలకుకారణ మవుతున్న లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని, రోడ్ల మరమ్మతులు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, డివైడర్లు, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ వంటి భద్రతా చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ సమావేశం లో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు సూచించిన అన్ని మార్గదర్శకాలను జిల్లాలో కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా అధికారులతో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (చీనా×) అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి, జిల్లాలోని జాతీయ రహదారుల పరిస్థితి, ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలు, హైవేలపై ఉన్న ధాబాలు, హోటళ్ల అనుమతులు, రహదారి భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, అంబులెన్స్ సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ ప్రతినెలా సమీక్ష సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు కూడా ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. రోడ్డుభద్రతకుసంబంధించిన సుప్రీంకోర్టు ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించి, ప్రతి ప్రయాణికుడికి సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఈ వీడియోకాన్ఫరెన్స్లోఅదనపు కలెక్టర్ రెవిన్యూ చెన్నయ్య, ఆర్టీవో ఇమ్రాన్ అహ్మద్, ఇతర రవాణా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పూర్తి చేయాలి


**- రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతిని ధి జూలై 21, విజన్ ఆంధ్ర : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుండి ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సహాయ ఎలక్టోరల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఇంకా కొన్ని జిల్లాలలో 50 శాతం కూడా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి కాలేదని, చనిపోయిన, గ్రామం వదిలి వెళ్ళిన, 2 చోట్ల ఓటరు జాబితాలో ఉన్న వారి వివరాల జాబితా రూపొందించాలని తెలిపారు. రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని, ఎన్యుమరేషన్ హారంలో ఆధార్ కార్డు తీసుకుంటున్నారని, ఆధార్ కార్డు ఆవశ్యకత లేదని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఎ. ఎస్.డి. జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 83.68 శాతం పూర్తి చేయడం జరిగిందని, ఈ నెల 25వ తేదీలోగా 100 శాతం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఎ.ఎస్.డి. జాబితా ప్రక్రియ సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు ఇంకా సమర్పించని వారి జాబితాను సిద్ధం చేసి రాజకీయ పార్టీల సహకారంతో 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాలు బూత్ స్థాయి అధికారులకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందిన ఎన్యుమరేషన్ ఫారాలను వెనువెంటనే డిజిటలైజేషన్ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యతపై రాజీ లేదు.. నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం.

**- వంద శాతం గిరిజన విద్యార్థుల విద్యా ఆరోగ్యమే లక్ష్యం ....**

**- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి .జాదవ్ అంబాజీ..**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 21.(విజన్ ఆంధ్ర ) గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి జాదవ్ అంబాజీ స్పష్టం చేశారు. కొమురం భీమ్ అసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ గిరిజన బాలికలు పాఠశాలలో నిర్వహించిన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ అధికారులు ఎస్ సి ఆర్ పి ల సమీక్షా సమావేశంలో అయినా మాట్లాడారు. జిల్లాలోని 52 ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పోషకాహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాల లో విధులు నిర్వహిస్తున్న పాఠశాల సిబ్బంది సమిష్టి భాధ్యత గా ఎటువంటి విభేదాలు లేకుండా కలిసి కట్టుగా ముందుకు సాగాలని ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ అధికారులు తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉంటూ విద్యార్థుల చదువు, ఆరోగ్యం, క్రమశిక్షణ, భద్రతపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో హెఫ్ ఎల్ ఎన్, ఎల్ ఈ ఏ పి. కార్యక్రమం వంద శాతం సాధించడమే లక్ష్యంగా ఎస్ సి ఆర్ పి లు పని చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తి చేసి పునశ్చరణకు తగిన సమయం కేటాయించాలని ఆదేశించారు. జీసీసీ (+జజ) ద్వారా సరఫరా అయ్యే బియ్యం, పప్పులు, నిత్యావసర సరుకులను పూర్తిగా పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించినవే స్వీకరించాలని, నాసిరకం సరుకులను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దని స్పష్టం చేశారు. వసతి గృహాల్లోకి బయట నుంచి వచ్చే ఆహార పదార్థాలను పూర్తిగా నిషేధించాలని, వంటశాలలు, భోజనశాలలు, హాస్టల్ ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా సంబంధిత అధికారులపై బాధ్యత నిర్ణయిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ాావీ=జ ాాజమీా పూర్కా ఉద్ధవ్, జిల్లా క్రీడల అధికారి మదావి. శేఖు , +జణూ కె. శకుంతల, కాగజ్‌నగర్ ాాణూ భాస్కర్ , జైనూర్ ాాణూ శ్రీనివాస్, ఆసిఫాబాద్ ాాణూ చిరంజీవితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తోంది: అత్తు ఇమామ్




సిద్దిపేట, విజన్ ఆంధ్ర, జూలెం 21 : బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రైతులను పట్టించుకోలేదని, ఇప్పుడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తోందని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ విమర్శించారు.సిద్దిపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని భారీగా పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రాజెక్టు నాణ్యత లోపాల వల్ల ప్రస్తుతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం నీటిని విడుదల చేస్తే కాళేశ్వరం ప్రాజెక్టుకు మరింత నష్టం జరిగే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎప్పుడు నీరు అందించాలనే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్పష్టమైన అవగాహన ఉందని తెలిపారు.ప్రాజెక్టు మరమ్మతులపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలను ఖండిస్తూ, పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను ఇబ్బందులకు గురిచేసిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు పాదయాత్రలు చేస్తూ రైతుల పేరుతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిముద్దీన్, మార్కా సతీష్, దాస అంజయ్య, వహాబ్, గయాసుద్దీన్, బంక చిరంజీవి, విజయ డైనల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల భద్రత- సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై సమీక్ష



కామారెడ్డి బ్యూరో జూలై 21 (విజన్ ఆంధ్ర) : కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన జాతీయ రహదారుల భద్రత పై వివిధ శాఖల సమన్వయం పై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై చేపట్టవలసిన నివారణ చర్యలను, ప్రమాదాలకు కారణం అవుతున్న బ్లాక్ స్పాట్ గుర్తింపుతో సత్వర పరిష్కారం, హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగ్, క్రాష్ బ్యారియర్లు, స్ట్రీట్ లైటింగ్, రోడ్డు భద్రత మౌలిక వసతుల అభివృద్ధి, అత్యవసర వైద్య వ్యవస్థ స్పందన మరింత మెరుగుపరచాలని సుప్రీం కోర్టు ఆదేశాలను తప్పనిసరిగా విస్తృతస్థాయిలో అమరుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, జాతీయ రహదారులపై భద్రత ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసి దేశ అత్యున్నత న్యాయస్థాన ఆదేశాలను అమలు పరచాలని అధికారులను ఆదేశించాడు. సమావేశంలో ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఎన్ హెచ్ ఎ ఐ డి జి ఎం ఆర్ శాలిని, ఆర్ అండ్ బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వినోద్, జిల్లా రవాణా అధికారి టి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సాదా బైనమా, భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 21, (విజన్ ఆంధ్ర) : సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు, తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతిలో వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాదా బైనమాల క్రమబద్ధీకరణ క్రింద దరఖాస్తు చేసుకున్న వాటిని రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు చాలా మండలాల్లో ఇంకా పెండింగ్ దశలో ఉన్నాయని, తిరస్కరించే దరఖాస్తులను తిరస్కరణకు గల కారణాలు నమోదు చేయాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఈనెల 25 లోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ, ఎ.ఎస్.డి. జాబితాను రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 30వ తేదీన వాహనాల వేలం ...

**- జిల్లా అటవీ అధికారి బాలమణి**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 21,(విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వ అక్రమ కలప రవాణా చేస్తూ పట్టుబడి ప్రభుత్వ పరం చేయబడిన వాహనాలను ఈ నెల 30వ తేదీన యధాస్థితిలో వేలం వేయడం జరుగుతుందని జిల్లా అటవీ అధికారి బాలమణి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిగా జప్తు చేయబడిన, ఖండించబడిన వాహనాలలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, టాటా ఏస్, మ్యాజిక్ ఇతర వాహనాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా అటవీ అధికారి, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించి జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో పని వేళలలో దరఖాస్తు ఫారం పొందాలని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

# నీటి సంరక్షణ పనులు వేగవంతం చేయాలి..

**- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో లక్ష్యాలు సాధించాలి**

**- అధికారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు**



రాజన్న సిరిసిల్ల, జూలై 21 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో నీటి సంరక్షణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తెలంగాణ జలసిరి, ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై హౌసింగ్ ఏఈలు, ఎంపీడీఓలు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రతి నీటి చుక్కను సంరక్షించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ తాగునీటి అవసరాలు, వ్యవసాయ అవసరాలు దృష్ట్యా తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ పనులను అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫామ్ పాండ్ల వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొంటూ అర్హులైన రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు బోర్‌వెల్‌ల రీచార్జ్‌కు ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, నీటి వృథాను నివారించే చర్యలను కట్టుదిట్టం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై కూడా కలెక్టర్ మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. మొదటి దశలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి ప్రతి దశలో పురోగతి కనిపించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రెండో దశ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, నిర్మాణ సామగ్రి, ఇతర సౌకర్యాలపై పూర్తి అవగాహన కల్పించి అవసరమైన సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రతి మండలంలో ఇండ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని అధికారులకు స్పష్టం చేశారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# మొదటి త్రైమాసికం-27లో పేటీఎంకు రికార్డు ఫలితాలు

హైదరాబాద్, జూలై 21 (విజన్ ఆంధ్ర) : డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సేవల సంస్థ పేటీఎం(వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్) మొదటి త్రైమాసికం-2027 ఆర్థిక ఫలితాల్లో రికార్డు స్థాయి పనితీరును నమోదు చేసిందని ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ కంపెనీ అత్యధిక త్రైమాసిక నిర్వహణ లాభంగా రూ.203 కోట్లు నమోదు చేయగా, పన్నుల అనంతర లాభం(పీఏటీ) 79 శాతం పెరిగి రూ.220 కోట్లకు చేరుకున్నట్లు చెప్పారు. ఆపరేటింగ్ ఆదాయం 28 శాతం వృద్ధితో రూ.2,448 కోట్లకు చేరినట్లు తెలిపారు. మొత్తం అమ్మకాల విలువ 31 శాతం పెరిగి రూ.7.1 లక్షల కోట్లకు, వినియోగదారుల యూపీఐ చెల్లింపులు 45 శాతం పెరిగి రూ.5.9 లక్షల కోట్లకు చేరాయని తెలిపారు. నెలవారీ లావాదేవీలు చేసే వినియోగదారుల సంఖ్య 8 కోట్లకు పెరగగా, ఆర్థిక సేవల పంపిణీ ఆదాయం 45 శాతం వృద్ధితో రూ.814 కోట్లకు చేరినట్లు వెల్లడించారు.


# ముఖ్యమంత్రి పర్యటనకు భారీ బందోబస్తు

**- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 21 ( విజన్ ఆంధ్ర ) : రాష్ట్ర ముఖ్యమంత్రి కొడంగల్ నియోజకవర్గ పర్యటన సందర్భంగా హకీంపేట్‌లో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ పాయింట్‌లో బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమం కావున ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను పూర్తి అప్రమత్తతతో, క్రమశిక్షణతో నిర్వహించాలని సూచించారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పర్యటన మార్గంలో నిరంతర నిఘా కొనసాగించాలని, ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుడ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే వరకు సిపిఐ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు నిర్వహిస్తాం.



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 21.(విజన్ ఆంధ్ర) : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని బంబారా గ్రామ పంచాయతీ పరిధిలో నేషనల్ హైవే ఏర్పాటు జరగడం ద్వారా విద్యార్థిని,విద్యార్థులకు స్థానిక ప్రజలకు రాకపోకలు ఒక వైపు నుండి మరో వైపుకి దాటడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే అధికారులు స్పందించి ఫుట్ బ్రిడ్జి, బస్టాండ్, మరియు సెంట్రల్ లైట్స్ ఏర్పాటు చెయ్యాలని కోరుతూ ఈ రోజు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో లిసూపరిండెంట్ ఆఫ్ పోలీస్ నితిక పంత్ మరియు ఆర్డీవో కార్యాలయం ఏవో దుర్గం శ్రావణ్ కుమార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ....రాబోయే రోజుల్లో బంబారా గ్రామపంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (జూ×) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దశలవారీ ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నట్లు వినతి పత్రంలో తెలిపారు."పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప..సమస్య చిన్నదైనా పెద్దదైనా పోరాటమే మార్గం" అనే స్ఫూర్తితో ఈ నిరసనలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. జాతీయ రహదారిపై నిత్యం ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే ఇక్కడ అండర్ పాస్ వంతెన,బస్ షెల్టర్,మరియు రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ న్యాయమైన డిమాండ్ల సాధనకై సిపిఐ చేపట్టే దశలవారీ ఆందోళన కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని,ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోయిరె ప్రకాష్ , సిపిఐ మండల కార్యదర్శి కొదురుపాక మహేష్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు పిప్పిరి వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వర్కులు రాకేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్చార్జ్ ఇటాంకర్ తిరుపతి లు ఉన్నారు.

# మల్కాపూర్ వెంచర్ పై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

**-అనుమతి లేకుండానే 8 ప్లాట్లు అమ్మకాలు?**

**-ఆరు నెలలుగా అనుమతుల్లేని వెంచర్ పనులు**

**-ప్రజావాణి ఫిర్యాదులు, వార్తా కథనాలు,**

**-ఎమ్మెల్యే ఫిర్యాదు చేసిన పట్టించుకోని పంచాయతీ అధికారులు.**

**-తనిఖీలకే పరిమితమైన అధికారులు.**

**-నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.**



సంగారెడ్డి బ్యూరో, జులై :21(విజన్ ఆంధ్ర ) : కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 158/ఈలో ఎలాంటి అనుమతులు లేకుండా ఆరు నెలలుగా కొనసాగుతున్న వెంచర్ నిర్మాణాలపై అధికార యంత్రాంగం ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రారంభం నుంచే అనుమతులు లేవంటూ వరుసగా వార్తా కథనాలు వెలువడినా, ప్రజావాణిలో ఫిర్యాదులు అందినా, స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా నిర్మాణాలు మాత్రం నిరంతరాయంగా కొనసాగడం పలు అనుమానాలకు తావిస్తోంది. వెంచర్‌లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలు, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాల ఏర్పాటు పూర్తికాగా, ప్రహరీ గోడ, ప్రధాన ద్వారం నిర్మించి ప్లాట్ల విక్రయాలు, ఇండ్ల నిర్మాణాలు కూడా కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రామపంచాయతీ నుంచి ఒక ఇంటి నిర్మాణానికి తీసుకున్న అనుమతినే వెంచర్ అభివృద్ధికి ఉపయోగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీకి ఇవ్వాల్సిన 10 శాతం భూమి, అవసరమైన అనుమతులు లేకుండానే పనులు సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు.జూలై 1న జిల్లా పంచాయతీ అధికారి మల్లారెడ్డి అధికార బృందంతో కలిసి వెంచర్‌ను పరిశీలించి అక్రమ నిర్మాణాలు కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ, అనంతరం పనులు యథావిధిగా కొనసాగడం ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తోంది. రాజకీయ ఒత్తిళ్లు, పలుకుబడి కారణంగానే చర్యలు ఆలస్యమవుతున్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి."పేదలు చిన్న నిర్మాణం చేసినా వెంటనే నోటీసులు, కూల్చివేతలు జరుగుతాయి. మరి భారీ వెంచర్లు అనుమతులు లేకుండా నెలల తరబడి కొనసాగినా ఎందుకు చర్యలు లేవు? పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయమా?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.అనుమతులు లేకుండా వెంచర్లు అభివృద్ధి చెందడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, ఇతర ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని, ఒక అక్రమాన్ని ఉపేక్షిస్తే దానిని చూసి మరిన్ని అక్రమాలు జరిగే అవకాశాలు పెరుగుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చట్టాలను అమలు చేయాల్సిన వారే అక్రమాలను ప్రోత్సహిస్తున్నారనే భావన కలిగితే వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని అభిప్రాయపడుతున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా విచారణ జరిపించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అక్రమ వెంచర్లకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. తనిఖీలతోనే సరిపెడతారా..? చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపించేలా కఠిన చర్యలు తీసుకుంటారా..? అనే ప్రశ్నకు అధికార యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని స్థానికులు పేర్కొంటున్నారు.

"అక్రమం ఒక్కటే కాదు... దానికి మౌనం మరింత ప్రమాదం"

ఒక అక్రమాన్ని ఉపేక్షిస్తే అదే మరిన్ని అక్రమాలకు మార్గం చూపుతుంది. చట్టం అందరికీ సమానంగా అమలైతేనే ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. అక్రమ వెంచర్లపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**- జాతీయ రహదారుల పై రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి**

**- రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్**

**- జాతీయ రహదారులపై ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలి**

**- జిల్లాల వారీగా రోడ్డు భద్రత చర్యలపై సమగ్ర నివేదికలు సమర్పించాలి**

**- రోడ్డు భద్రత అంశాన్ని సుప్రీంకోర్టు అత్యంత నిశితంగా పర్యవేక్షిస్తోంది**

**- జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి**




సూర్యాపేట జూలై 21:(విజన్ ఆంధ్ర) : జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమర్థవంతమైన రోడ్డు భద్రత చర్యలు అమలు చేయాలని రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జాతీయ రహదారులపై రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతను పెంపొందించడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సంబంధించి సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు బీహార్, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలు మాత్రమే సుప్రీంకోర్టుకు అనుసరణ నివేదికలు సమర్పించాయని, మిగిలిన రాష్ట్రాలు కూడా త్వరితగతిన చర్యలు తీసుకొని నివేదికలు పంపాలని సూచించారు. జాతీయ రహదారులపై అనధికారిక పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని, పెట్రోలింగ్ వాహనాల నిర్వహణను బలోపేతం చేయడంతో పాటు భారీ వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ స్థలాలను జాతీయ రహదారుల సమీపంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారుల అధికారులు, పోలీసు శాఖ, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి నిబంధనల ప్రకారం వెంటనే తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రులను మ్యాపింగ్ చేసి అత్యవసర వైద్య సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జాతీయ రహదారుల పక్కన కొత్తగా మద్యం దుకాణాలకు ఎలాంటి లైసెన్సులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న రహదారుల్లో ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని ఆదేశించారు.ప్రతి జిల్లా రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలపై సమగ్ర కార్యాచరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రోడ్డు భద్రత అంశాన్ని సుప్రీంకోర్టు అత్యంత నిశితంగా పర్యవేక్షిస్తోందని, ఈ ప్రక్రియలో అవసరమైన అన్ని శాఖల సమన్వయం, పోలీసు సహకారం అందేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని అనుసరణ నివేదికలను వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రవాణా శాఖ అధికారి పురుషోత్తం రెడ్డి, ఎంవిఐ నవీన్, కలెక్టరేట్ సూపర్డెంట్ రాజేందర్ రెడ్డి ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు

**- రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 21,(విజన్ ఆంధ్ర) : జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి అదనపు కార్యదర్శి ఇలంబర్తి, శాంతి భద్రతల అధికారులు, రవాణా, రహదారి భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి. లు, రవాణా, రహదారులు భవనాల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు ప్రతినెల నిర్వహించాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 52 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉందని, ప్రమాదాలు జరగకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతినెల రహదారి భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించి భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామని, రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారిపై పెట్రోలింగ్, వాహనాలు, అంబులెన్స్ అందుబాటులో ఉన్నాయని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం లారీ డ్రైవర్లకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలపై ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం

**- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**- వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



గద్వాల జూలై 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలపై మంగళవారం హైదరాబాద్ నుంచి బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రహదారుల భద్రతకు తమ వంతుగా కృషి చేస్తుందని, ఆయా జిల్లాల పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు వారికి సహకరించాలన్నారు. రవాణా, పోలీస్, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులతో కలిసి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలను ఎన్నుకోవాలన్నారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు, హైవే సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కమిటీలతో కలిసి పని చేసేందుకు తరచూ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూరహదారి ప్రమాదాలతో ఏటా ఎంతో మంది మృత్యువాత పడడమే కాక క్షతగాత్రులుగా మారుతున్నారని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అన్నారు.నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, రోడ్ సేఫ్టీ కమిటీలు ఇప్పటివరకు రహదారి భద్రతపై నిర్వహించిన కార్యక్రమాల వివరాలను అడిగారు. హైవేలపై పెట్రోలింగ్ వాహనాల సేవలు, బ్లాక్ స్పాట్ల వద్ద తీసుకుంటున్న జాగ్రత్తలపై మాట్లాడారు. హైవే స్థలాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన దాబాలు, ఇతర నిర్మాణాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. హైవేల భద్రతకు సంబంధించి ఇదివరకు నిర్వహించిన కార్యక్రమాలు, సమావేశాలు, భవిష్యత్తులో చేయబోయే కార్యాచరణ ప్రణాళికపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికలను సమర్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ ఇన్చార్జి ఏవో మంజుల, నేషనల్ హైవే రేసిడెంట్ ఇంజనీర్ బాలచందర్, రవాణా, ఆర్ అండ్ బి శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులను కలిసిన చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గం



అయిజ జూలై 21 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ చేనేత సహకార సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గ సభ్యులు గద్వాల చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఇందిర ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, చేనేత కార్మికుల సంక్షేమం కోసం శాఖ సహకారంతో ముందుకు సాగుతామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయిజ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు డాన్ వీరన్న, ఉపాధ్యక్షుడు షర్ఫుద్దీన్, కార్యదర్శి పసలాది బసవరాజు, కోశాధికారి కస వెంకటేష్, డైరెక్టర్లు రాజశేఖర్, కొండ, అబ్దుల్ రియాజ్, శైలజ, మద్రాస్ లక్ష్మి పాల్గొన్నారు. అలాగే సంఘం మేనేజర్ సత్యనారాయణ కూడా హాజరయ్యారు.

# సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ ను కలిసిన జాస్ నేతలు



కడప,జూలై 21 (విజన్ ఆంధ్ర) జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఏ. రమేష్ ను జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియా(జాస్)నేతలు గుండ్రాతి విజయకుమార్, నాగేంద్ల .వెంకటసుబ్బారెడ్డి ఎస్ వి.రమణ, మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. జర్నలిస్టులకు మూడవ విడత లో ఇవ్వవలసిన అక్రిడేషన్లు త్వరగా మంజూరు చేయించాలని అసిస్టెంట్ డైరెక్టర్ ను కోరారు.అక్రిడేషన్లు పొందిన చాలామంది జర్నలిస్టులు హెల్త్ కార్డు కొరకు దరఖాస్తు చేయడం లేదని, వారిపై ప్రత్యేక దృష్టి సారించి జర్నలిస్టులందరూ దరఖాస్తు చేసుకునేలా చైతన్య పరచవలసిన అవసరం ఉందని తెలిపారు అదేవిధంగా జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ 50% ఇవ్వవలసి ఉండగా చాలామంది స్కూలు యాజ మాన్యాలు సహకరించడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు పై సమస్యలపై సానుకూలంగా స్పందించిన అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ జర్నలిస్టులందరికీ తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.



హైదరాబాద్ లోని చారిత్రాత్మకమైన శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో ఆగస్టు 9న జరగబోతున్న 78వ వార్షిక బోనాల పండుగ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును ఆహ్వానించిన ఆలయ కమిటి.హైదరాబాద్ నంది నగర్ లోని నివాసంలో కేటీఆర్ ను శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ ప్రతినిధుల బృందం కలసి రానున్న బోనాల పండుగ సంబరాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు డి.ప్రభాకర్, కార్యదర్శి కె.దత్తాత్రేయ, కోశాధికారి ఏ.సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు జగ్మోహన్ కపూర్, ఏం.వినోద్ కుమార్, సభ్యులు పి.సాయికిరణ్, రవీందర్ చారి, ఎల్.అరుణ్ తదితరులు ఉన్నారు.

# యువత వైపు కేటీఆర్ చూపు

## రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ కొత్త వ్యూహం

పాలమూరులో సర్వేలు ముమ్మరం

- యువ నాయకులకు అవకాశం
- మాజీలకు మొండి చేయి?
- డీ-లిమిటేషన్ తో కొత్త నియోజకవర్గాల్లో కొత్త ముఖాలు...
- గెలుపే లక్ష్యంగా కేటీఆర్ టీమ్...



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 21 (విజన్ ఆంధ్ర) : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొత్త వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా యువతకు ప్రాధాన్యత ఇస్తూ టిక్కెట్లు కేటాయించే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

**పాలమూరుపై ప్రత్యేక ఫోకస్**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ పట్టును మరింత బలోపేతం చేసేందుకు కేటీఆర్ టీమ్ ప్రత్యేక సర్వేలు చేపట్టింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల గెలుపు అవకాశాలు, ప్రజల్లో ఉన్న అభిప్రాయాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఈ సర్వేల్లో యువ నాయకులు, విద్యావంతులు, సామాజిక కార్యకర్తల పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

**యువతకే టిక్కెట్ - మాజీలకు కష్టం**

రాబోయే ఎన్నికల్లో యువతకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కేటీఆర్ నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సాంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా కొత్త ఆలోచనలు, కొత్త ఉత్సాహం ఉన్న యువతను బరిలోకి దింపితే ప్రజల్లోకి మంచి సందేశం వెళ్తుందని పార్టీ భావిస్తోంది. ఇక ఈ సారి మాజీ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇవ్వడంలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో ఓడిపోయిన వారికి, ప్రజల్లో వ్యతిరేకత ఉన్నవారికి అవకాశాలు తక్కువగా ఉండే అవకాశం ఉందనీ తెలుస్తోంది.

**డీ-లిమిటేషన్ తో కొత్త లెక్కలు**

కేంద్రం తీసుకురానున్న డీ-లిమిటేషన్ వల్ల కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంది. ఆ కొత్త నియోజకవర్గాల్లో పార్టీ పట్టు సాధించేందుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది బీఆర్ఎస్... ఆయా ప్రాంతాల్లో పట్టు ఉన్న, ప్రజలతో మమేకమయ్యే కొంతమంది యువత పేర్లను కేటీఆర్ టీమ్ సభ్యులు ఇప్పటికే ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నవారికి, సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండేవారికి అవకాశం ఇచ్చే యోచనలో ఉన్నారు.

**గెలుపే లక్ష్యంగా వ్యూహాలు**

"2028 ఎన్నికలు బీఆర్ఎస్ కు అత్యంత కీలకం. ఈసారి గెలిచి తీరాలి" అనే సంకల్పంతో కేటీఆర్ ముందుకు వెళ్తున్నారు. పార్టీలో ఉన్న పాత నాయకుల అనుభవాన్ని, కొత్త యువత ఉత్సాహాన్ని కలిపి "అనుభవం ప్లస్ యువత" ఫార్ములాతో ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి నాయకులతో, క్యాడర్ తో సమావేశాలు నిర్వహిస్తున్న కేటీఆర్... బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని ఆదేశాలు ఇచ్చారు.

**రాజకీయ విశ్లేషకుల మాట**

"కేటీఆర్ తీసుకుంటున్న ఈ నిర్ణయం బీఆర్ఎస్ కు మంచి ఫలితాలు ఇస్తుంది. యువతను ముందుకు తెస్తే పార్టీకి కొత్త రక్తం వస్తుంది. అదే సమయంలో మాజీలను పూర్తిగా పక్కన పెట్టకుండా సమన్వయం చేస్తే మరింత బలం" అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అప్పటివరకు పాలమూరు రాజకీయాల్లో ఈ చర్చే హాట్ టాపిక్ గా ఉండనుంది...

# సమస్యల వలయంలో ఆశ్రమ బాలుర వసతి గృహం..

# విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు బాధ్యతలు

- **ఆగం అవుతున్న విద్యార్థుల భవిష్యత్తు... ఆశ్రమ...ఆశ నిరాశతో.**
- **ఆశ్రమ వసతి గృహంలో అస్తవ్యస్త పరిస్థితులు....**
- **ఒక్క వార్డెన్‌తో మూడు హాస్టళ్లు... విద్యార్థుల భద్రత గాలికొదిలిన అధికారులు....**
- **వాచ్‌మెన్ లేక రాత్రిళ్లు గోడ దూకుతున్న విద్యార్థులు... పాము కాటు ఘటనతో వెలుగులోకి వచ్చిన నిర్లక్ష్యం....**
- **మౌలిక వసతుల లేమి, సిబ్బంది కొరత, పరిపాలనా వైఫల్యంతో ప్రశ్నార్థకంగా మారిన గిరిజన విద్యార్థుల భవిష్యత్....**








కొమురం భీం ఆసిఫాబాద్ జులై 21.(విజన్ ఆంధ్ర) : కాగజ్నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల, వసతి గృహం గిరిజన, దళిత, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన నివాసం, పోషకాహారం, క్రమశిక్షణతో కూడిన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలు తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తు సాధించాలని ఆశిస్తూ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చేర్పిస్తుంటారూ. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఆ లక్ష్యాలకు పూర్తిగా భిన్నంగా ఉంటే, అది కేవలం ఒక హాస్టల్ సమస్య మాత్రమే కాదు, ప్రభుత్వ సంక్షేమ వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనంగా మారుతుంది. ఇటీవల ఆశ్రమ వసతి గృహంలో వెలుగుచూసిన పరిస్థితులు విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్య, క్రమశిక్షణ అన్నింటినీ ప్రశ్నార్థకంగా మార్చాయి. సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపం, మౌలిక వసతుల లేమి, అధికారుల నిర్లక్ష్యం కలిసి హాస్టల్‌ను సమస్యల నిలయంగా మార్చినట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ఒకే వార్డెన్‌తో మూడు హాస్టళ్లు... ఎలా సాధ్యం?**

హాస్టల్‌లో పూర్తి స్థాయి వార్డెన్ లేకపోవడంతో ఒకే వార్డెన్‌కు మూడు ఆశ్రమ వసతి గృహాల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇది పరిపాలనా పరంగా అత్యంత కీలకమైన లోపంగా పలువురు అభిప్రాయపడుతున్నారు. వార్డెన్ అనేది కేవలం హాజరు చూసే ఉద్యోగి కాదు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, క్రమశిక్షణ, ఆహారం, హాస్టల్ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో స్పందన వంటి అనేక బాధ్యతలు ఆయనపై ఉంటాయి. ఒక వ్యక్తి మూడు హాస్టళ్లను ఒకేసారి పర్యవేక్షించడం ఆచరణలో అసాధ్యమని విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఫలితంగా రాత్రి వేళల్లో విద్యార్థులు ఏం చేస్తున్నారో గమనించే పరిస్థితి లేకుండా పోయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పర్యవేక్షణ లోపమే ఇటీవల జరిగిన ప్రమాదకర ఘటనకు కారణమైందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాము కాటు ఘటన... అదృష్టవశాత్తూ తప్పిన ప్రమాదం కొద్ది రోజుల క్రితం జరిగిన ఘటన హాస్టల్‌లోని భద్రతా వైఫల్యాన్ని బహిర్గతం చేసింది. రాత్రి సమయంలో 9వ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి హాస్టల్ ప్రహరీ గోడ దూకి బయటకు వెళ్లాడు. సమాచారం ప్రకారం అతడు సిగరెట్లు కొనుగోలు చేసేందుకు వెళ్లినట్లు తెలిసింది. అదే సమయంలో అతని కాలికి పాము కాటేసినట్లు అనుమానం వ్యక్తమైంది. వెంటనే హాస్టల్ వంట సిబ్బంది అప్రమత్తమై విద్యార్థిని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. అయితే ఈ సంఘటన ఒక కీలక ప్రశ్నను లేవనెత్తుతోంది. హాస్టల్‌లో రాత్రి సమయంలో వాచ్‌మెన్ లేదా వార్డెన్ అప్రమత్తంగా ఉంటే ఆ విద్యార్థి గోడ దూకి బయటకు వెళ్లే పరిస్థితి వచ్చేదా? ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ప్రమాదం జరగకుండా చూడటమే పరిపాలన అసలు బాధ్యత కాదా? అనే ప్రశ్నలు తల్లిదండ్రులు లేవనెత్తుతున్నారు.

**రాత్రిళ్లు గోడ దూకుతున్న విద్యార్థులు... ఎవరి బాధ్యత?**

హాస్టల్‌లో వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రి సమయంలో కొంతమంది విద్యార్థులు బయటకు వెళ్తున్నట్లు సమాచారం. సిగరెట్లు, గుట్కాలు వంటి వ్యసనాలకు అలవాటు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక్క విద్యార్థి వ్యక్తిగత సమస్యగా కాకుండా, మొత్తం హాస్టల్ క్రమశిక్షణకు ముప్పుగా మారే అవకాశం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. పిల్లలు యుక్తవయస్సులో ఉన్నప్పుడు సరైన పర్యవేక్షణ లేకుంటే చెడు అలవాట్లకు లోనయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో హాస్టల్ సిబ్బంది బాధ్యత మరింత పెరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. మారలేదు. కానీ ఇలాంటి ఘటనలు మళ్లీ జరగవని ఎవరూ చెప్పలేరు. భద్రతా లోపాలు, సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి యథాతథంగా కొనసాగితే భవిష్యత్తులో మరింత తీవ్రమైన పరిణామాలు చోటు చేసుకునే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల ప్రాణాలకు సంబంధించిన అంశాల్లో ఆలస్యం ప్రమాదకరమని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి లోపాలను సరిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

**బాధ్యత ఎవరిది..? ఇకనైనా మేల్కొంటారా..?**

ఆశ్రమ వసతి గృహాల్లో వరుసగా వెలుగులోకి వస్తున్న సమస్యలు అధికార యంత్రాంగం పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన చోట వార్డెన్‌ల కొరత, వాచ్‌మెన్ లేకపోవడం, మౌలిక వసతుల లోపం, రాత్రి వేళల్లో తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వంటి అంశాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకే వార్డెన్‌కు మూడు హాస్టళ్ల బాధ్యతలు అప్పగించడం వల్ల ప్రతి హాస్టల్‌పై సమర్థవంతమైన పర్యవేక్షణ సాధ్యం కావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రి సమయంలో అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించే పరిస్థితి లేకపోవడం విద్యార్థుల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. బాత్రూమ్‌ల వద్ద వెలుతురు లేకపోవడం, కిచెన్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడం, శిథిలావస్థకు చేరుతున్న మౌలిక వసతులు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేస్తున్నాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే విషయమే అయినప్పటికీ, ఇది వ్యవస్థకు ఒక గట్టి హెచ్చరికగా భావించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సమస్యలు యథాతథంగా కొనసాగితే భవిష్యత్తులో మరింత తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో ఆలస్యం ప్రమాదకరమని, సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి, అన్ని ఆశ్రమ వసతి గృహాల పరిస్థితిని సమీక్షించి, అవసరమైన సిబ్బందిని నియమించి, భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. ప్రభుత్వం దృష్టి సారిస్తుందా..? లేక మరో ప్రమాదం కోసం ఎదురుచూస్తుందా..? ఆశ్రమ వసతి గృహాలు గిరిజన, నిరుపేద విద్యార్థులకు కేవలం వసతి కల్పించే కేంద్రాలు మాత్రమే కాదు... వారి భవిష్యత్తుకు పునాది వేసే విద్యా కేంద్రాలు. అలాంటి చోట విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు అత్యున్నత ప్రాధాన్యంగా ఉండాలి. కానీ వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డెన్‌ల ఖాళీలు భర్తీ కాకపోవడం, వాచ్‌మెన్ లేకపోవడం, భవనాల నిర్వహణలో నిర్లక్ష్యం, రాత్రి భద్రతా చర్యలు లేకపోవడం, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు సంవత్సరాలుగా కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యలు వెలుగులోకి వచ్చినప్పుడల్లా తాత్కాలిక చర్యలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రతి ఆశ్రమ వసతి గృహంలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించడం, ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయడం, రాత్రి పూట పర్యవేక్షణను బలోపేతం చేయడం, సీసీ కెమెరాలు, తగిన లైటింగ్, అత్యవసర స్పందన వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు అవసరమని సూచిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు జిల్లా వ్యాప్తంగా ఆశ్రమ వసతి గృహాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, లోపాలను సరిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. "విద్యార్థుల భద్రతపై రాజీ ఉండకూడదు; ప్రమాదం జరిగిన తర్వాత కాదు, ముందే నివారణ చర్యలు తీసుకోవాలి" అనే డిమాండ్ రోజురోజుకూ బలంగా వినిపిస్తోంది. దీంతో ఈ ప్రత్యేక కథనం అధికార యంత్రాంగాన్ని మేల్కొలుపుతుందా? లేక మరో ఘటన తర్వాతే చర్యలు తీసుకుంటారా? అన్న ప్రశ్నకు సమాధానం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**సమస్యలు తెలిసినా... పరిష్కారం ఎప్పుడు?**

**ఆశ్రమ వసతి గృహాలపై సమగ్ర సంస్కరణలు అవసరం**

ఆశ్రమ వసతి గృహాల్లో వెలుగులోకి వస్తున్న సమస్యలు ఒక్కరోజులో ఏర్పడినవి కావు. ఏళ్లుగా పేరుకుపోతున్న నిర్లక్ష్యం, ఖాళీ పోస్టుల భర్తీలో జాప్యం, మౌలిక వసతుల నిర్వహణలో లోపాలు, పర్యవేక్షణ వ్యవస్థ బలహీనత వంటి కారణాల వల్ల పరిస్థితి ఈ స్థాయికి చేరిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్య వంటి అత్యంత కీలక అంశాల్లో రాజీ పడటం సమాజానికి మంచిది కాదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ప్రతి ఆశ్రమ వసతి గృహంలో అవసరమైన సంఖ్యలో వార్డెన్‌లు, సహాయ వార్డెన్‌లు, వాచ్‌మెన్, పారిశుద్ధ్య సిబ్బందిని నియమించడం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో కచ్చితమైన పర్యవేక్షణ ఉండేలా విధులు నిర్వహించే సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు, విద్యార్థులు అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్, ఫిర్యాదు వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని సూచిస్తున్నారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి హాస్టళ్లలో భద్రత, పారిశుద్ధ్యం, ఆహార నాణ్యత, విద్యుత్, తాగునీరు, బాత్రూమ్‌లు, వంటశాల, హాస్టల్ భవనాల స్థితిగతులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం ద్వారా లోపాలను వెంటనే గుర్తించి సరిదిద్దే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. తల్లిదండ్రుల అభిప్రాయాలు, విద్యార్థుల ఫిర్యాదులను నేరుగా స్వీకరించే వ్యవస్థ లేకపోవడం కూడా సమస్యలను మరింత పెంచుతోందని విమర్శలు ఉన్నాయి. ప్రతి హాస్టల్‌లో ఫిర్యాదుల పెట్టె, నెలవారీ తల్లిదండ్రుల సమావేశాలు, విద్యార్థులతో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించడం ద్వారా అనేక సమస్యలను ముందుగానే గుర్తించవచ్చని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వం గిరిజన విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటిస్తున్న నేపథ్యంలో, ఆ లక్ష్యం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఆశ్రమ వసతి గృహాలు నిజంగా విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని కల్పించినప్పుడే ప్రభుత్వ సంక్షేమ విధానాల అసలు ఫలితం కనిపిస్తుందని వారు అంటున్నారు.

# పచ్చని చెట్లపై కత్తి..

- **ప్రజా ప్రతినిధుల అండతో పచ్చదనానికి గొడ్డలి పోటు**
- **అధికారుల మౌనం.. ప్రజా ప్రతినిధుల అండ.. చెట్లకు ముప్పు..**
- **చెట్ల సంరక్షణ మాటల్లోనే.. నరికివేతలకు ప్రజా ప్రతినిధుల అండ..?**
- **యథేచ్ఛగా చెట్ల నరికివేత.. పర్యావరణానికి ముప్పు..**
- **అనుమతులు లేకుండా చెట్ల నరికివేత.. అధికారుల చర్యలు ఎక్కడ..?**
- **నీరుగారుస్తున్న ప్రభుత్వ లక్ష్యం**
- **చెట్ల నరికివేతను అడ్డుకోవాలని ప్రజల డిమాండ్**

సూర్యాపేట సిటీ, జూలై 21:(విజన్ ఆంధ్ర) : పట్టణంలో వివిధ రహదారులకు ఇరువైపులా ఉన్న విలువైన చెట్లు గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఓ వైపు మొక్కలు నాటుతుంటే.. మరోవైపు కొందరు వ్యక్తులు రోడ్లపక్క ఏపుగా పెరిగిన పచ్చని చెట్లను నరికేస్తున్నారు.ఎన్నో సంవత్సరాలుగా పెరిగిన చెట్లను ఏదో కారణంతో కొంతమంది వ్యక్తులు నరికి వేస్తుండడంతో వృక్షాలకు రక్షణ కరువైంది. ప్రభుత్వం వృక్షో రక్షతి రక్షిత అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ హరితహారం పేరుతో మొక్కలు నాటిస్తే మరోవైపు కొంతమంది వ్యక్తులు సూర్యాపేట పట్టణ ప్రజా ప్రతినిధులు, అధికారుల అండతో చాటుమాటుగా కొట్టివేస్తున్నారు అనే విమర్శలు ఉన్నాయి. వృక్షాలు నరికి వేయడం వల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు జీవ ప్రాణులపై తీవ్ర ప్రభావం చూపుతుంది కాలుష్య సమస్యలతో అనేకమంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రధాన కారణం అయితే వాణిజ్య షాపులకు అడ్డుగా ఉన్నాయని భవనాలకు షాపులు కనబడటం లేదని నెపంతోనే చెట్లను నరికి వేస్తున్నారు. అయితే ఈ వ్యవహారం అంతా బహిరంగంగానే



జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది సూర్యాపేట అధికారులకు ముడుపులు ఇచ్చి చెట్లను కొట్టి వేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.సూర్యాపేట పట్టణంలోని 24,33వ వార్డులలోని తులసమ్మ హోటల్ సమీపంలో, బ్రాహ్మణ కళ్యాణ మండపం వెనుక సందులో చెట్లను నరికివేస్తున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కొందరు వ్యక్తులు చెట్లను తొలగిస్తున్నారని, దీనికి స్థానిక ప్రజా ప్రతినిధుల అండదండలు మెండుగా ఉన్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.చెట్ల నరికివేతకు సంబంధించి సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.వేసవిలో ఎండ తీవ్రతకు వాహన చోదకులు ఆ చెట్టు నీడ కిందనే సేదతీరేవారు. ఇప్పుడు ఆ భారీ వృక్షాన్ని కొట్టేయడంతో నీడ కరువైందని వాహన చోదకులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కలు నాటాలని ప్రచారం చేస్తుంటే మరోవైపు చెట్లను నరికి వేయడం ఏమిటని వృక్ష ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. వాల్టా చట్టం కింద విచ్చలవిడిగా చెట్లను నరికి వేస్తున్న వారిపై చర్యలు తీసుకునే అధికారం ఉంది. అయినా సంబంధిత విభాగాల అధికారులు మాత్రం తమకేమీ పట్టింపు లేనట్టు వ్యవహరించడం శోచనీయం..పర్యావరణానికి హాని కలిగించే ఇటువంటి చర్యలపై వెంటనే విచారణ జరిపి, అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**నీరుగారుస్తున్న ప్రభుత్వ లక్ష్యం..**

అటవీ సంపద అంతరించిపోయి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటే వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు ప్రారంభించి కోట్ల రూపాయలు వెచ్చించి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తుంది అయితే అవి పెరిగి పెద్దయ్యాక అధికారుల చేతివాటంతో అక్రమార్కులు వాటిని ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు వృక్షాలుగా మారి బాటసారులకు నీడను, ఆక్సిజన్ అందిస్తుంటే కొంతమంది ఇంటికి అడ్డంగా వస్తుందంటూ కొందరు చెట్లను నరికేస్తున్నారు. ఒక మంచి ఉద్దేశంతో ప్రభుత్వం ఖర్చు పెట్టిన కోట్ల రూపాయలు నిష్ప్రయోజనంగా మారి ప్రభుత్వ లక్ష్యం నీరుగారుస్తుంది.



EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.